# అమరావతీస్తూపము,

## ఇతర వ్యాసములు.

గ్రంథకర్త :

మల్లంపల్లి సోమశేఖరశర్మ.

# అమరావతీస్తూపము,

## ఇతర వ్యాసములు.

గ్రంథకర్త :

మల్లంపల్లి సోమశేఖరశర్మ.

చెన్నపురి :

కేసరీ ముద్రణాలయమున

ముద్రితము,

౧౯౩౭.

పుస్తకముల కొఱకు :

మల్లంపల్లి సోమశేఖరశర్మ,

2/19 ఆచెప్ప మొదలి వీధి,

పురశవాకం, మద్రాసు.

# పీఠిక


ఈపుస్తకమునందలి 'అమరావతీస్తూపము', 'మన
ప్రాచీన విద్యాసంస్థలు' అనువ్యాసములు ఆంధ్రపత్రిక, శుక్ల
(౧౯౩౦), అక్షయ (౧౯౨౬) ఉగాది సంచికలయందును.
'అనాదృతవాఙ్మయ'మను వ్యాసము 'సమదర్శిని' శుక్ల
(౧౯౩౦) ఉగాది సంచికయందును, 'ప్రాచీన వృత్తివిద్యా
విధానము', 'బౌద్ధవాఙ్మయము: పరిశోధన' అనునవి 'భారతి'
(క్రోధన: ఫాల్గుణము; ప్రమోదూత: శ్రావణము) యందును,
ప్రకటితములయినవి. కొంత నూతన విషయమును జేర్చి
మొకటివ్యాసము నించుక విపులీకరించి వ్రాసితిని. మిగిలి
వానిలో నచ్చటచ్చట కొద్దిమార్పులు చేసితిని. అనావశ్యక
మని వ్యాసవిషయముల కాకరముల నిందుదాహరింపలేదు.

ఈవ్యాసములు గ్రంథరూపమున వెలయుటకు కారణ
భూతులయిన శ్రీ డాక్టరు, చిలుకూరి నారాయణరావు,
ఎమ్. ఏ., ఎల్. టి., పిహెచ్. డి., వారికి నాకృతజ్ఞతా
పూర్వకవందనములు.

మల్లంపల్లి సోమశేఖరశర్మ

# వి ష య సూ చి క


| | పుటలు. |
|---|---|
| ౧. అమరావతీ స్తూపము | ౧ - ౩౪ |
| ౨. ప్రాచీనవృత్తివిద్యావిధానము | ౩౫ - ౫౦ |
| ౩. మన ప్రాచీన విద్యాసంస్థలు | ౫౧ - ౮౯ |
| ౪. అనాదృతవాఙ్మయము | ౯౦ - ౧౨౨ |
| ౫. బౌద్ధవాఙ్మయము : పరిశోధన | ౧౨౩ - ౧౩౨ |



అమరావతీస్తూప ప్రాకార శిలాఫలకములలోఁ నొకదానిమీఁద నుబ్బెత్తుగ చెక్కిన స్తూపాకృతి.

# అమరావతీ స్తూపము

స్తూపము

స్తూపమను సంస్కృత పదమును, దిబ్బయని యర్థమిచ్చు 'థూపో' యను పాలీపదమును సమానార్థకములు. కాని బౌద్ధ వాస్తువున (Buddhist architecture) ఇటికతోనో, ఱాతితోనో కట్టిన అర్ధగోళాకారముగ నుండు సమాధివంటి ఘననిర్మాణమునకే స్తూప మను పేరు రూఢియగుట వలన, దిబ్బ యైనదెల్ల స్తూపము కాఁజాలదు. ఈ నిర్మాణము బౌద్ధమతము వాస్తువునకుఁ బ్రసాదించిన విశేషము. స్తూప ప్రాముఖ్యమును దెలిసికొనుటకు, బుద్ధుని జీవితము కొంత తోడ్పడఁగలదు.

శాక్య వంశజుఁడయిన శుద్ధోదనుఁడు కపిలవస్తు నగరము రాజధానిగ శాక్యరాజ్యమును పాలించుచుండెను. అతని పట్టమహిషియైన మాయాదేవి యొకప్పుడు, బోధిసత్త్వుఁడు తుషిత స్వర్గముననుండి వెల్లయేనుఁగు రూపమున భూలోకమున కవతరించి తన గర్భమునఁ బ్రవేశించినట్లు స్వప్నముఁ గాంచెను. అనతి కాలముననే ఆమె గర్భవతియై, కపిలవస్తు నగరమునకు చేరువ నున్న దేవదహ గ్రామమునందలి తన పుట్టినింటి కరుగుచు, మార్గమధ్యమునఁ గల లుంబినీవనమున

శుద్ధోదనుఁ డా బాలుని అరచేతి చందమామవలె నల్లారు ముద్దుగఁ బెంచి యుక్తవయస్సున యశోధర యను సౌందర్య రాశి నొసంగి పరిణయముఁ గావించెను. ఈ యువదంపతుల ప్రేమఫలముగ రాహులుఁడను కుమారుఁ డుదయించెను. కాని దుఃఖమయమయిన యీ ప్రపంచమును జూచి కోమల హృదయముగల సిద్ధార్థుఁడు తీవ్రవేదన నొంది శాంతిఁ గానక, తుదకు దుఃఖనివర్తనమార్గము నన్వేషింప ఆలు బిడ్డలను, కన్న తండ్రిని, కడకు రాజ్యసర్వస్వమును — సర్వమును పరిత్యజించి కపిలవస్తునగరమునుండి యెరు లెఱుంగకుండ నర్ధరాత్రమున బయలుదేఱి పోయెను. బౌద్ధులు దీనిని మహాభినిష్క్రమణ మందురు. నగర వినిర్గతుఁడయి యాతఁడు మహారణ్యముల కరిగి యేడేండ్లపాటు ధ్యానసమాధినిష్ఠ నుండి యేకాగ్రతతో తపస్సు చేసెను. ఈ కాలమున బౌద్ధులకు శనివంటివాఁ డయిన మారుఁడు సిద్ధార్థుని ఏకాగ్రబుద్ధిని చలింపఁజేసి యాతని తపస్సు భగ్నముచేయ ననేకవిధములఁ బ్రయత్నించెను కాని విఫలమనోరథుఁ డయ్యెను. తుదకు సిద్ధార్థుఁడు బుద్ధగయ సమీపమునందలి యురువెలా పరిసరారణ్యమున నొక యశ్వత్థవృక్షము క్రింద తీవ్రధ్యాన సమాధి నుండి పరమ సత్యప్రబోధమును గాంచెను. అంతటి నుండి యాతఁడు బుద్ధుఁ డనియు, నా వృక్షము బోధి వృక్షమని

యీ మొదటి ధర్మబోధకు ధర్మచక్రప్రవర్తన మని పేరు. బుద్ధుని ధర్మబోధల ననుసరించువారు రెండు తెఱఁగులు: (౧) సన్యాసులు — వీరిని భిక్షువు లందురు. స్త్రీలకు కూడ భిక్షుకులై బౌద్ధధర్మావలంబనమున కధికార మొసఁగఁబడుట వలన బౌద్ధభిక్షు సంఘమున పురుషులతో పాటు స్త్రీలు కూడ నుండిరి; (౨) గృహస్థులయి బౌద్ధధర్మ మవలంబించువారి కుపాసకు లని పేరు. బుద్ధుఁడు చాలకాలము తన ధర్మమును లోకమునఁ బ్రవర్తింపఁజేసి, యెనుబది వత్సరముల ప్రాయమున మల్లరాజ్యమునకు రాజధాని యయిన కుశనగరమున (పాలి: కుసినార) వ్యాధిగ్రస్తుఁడయి యచ్చటి సాలవనమున నిర్వాణమునందెను. బౌద్ధులు దీనిని మహాపరినిర్వాణ మందురు. కుశనగరమునకు వెలుపట నున్న మకుటచందన మనుచోట బుద్ధుని శరీరమునకు దహనసంస్కారము కావింపఁబడెను. దహనానంతరమున మిగిలిన బుద్ధ భగవానుని శరీరావశేషములకొఱ కిరుగు పొరుగు ప్రభువులకు మల్లులకు వివాదము కలిగెను కాని ద్రోణుఁడను బ్రాహ్మణుఁ డీ కలహ ముడిపి దగ్ధావశేషముల నందఱికి సమానముగఁ బంచి యిచ్చి సమాధానము గావించెను. ఆయవశేషముల నాయా ప్రభువులు తమ దేశములకుఁ గొనిపోయి వానిని దగిన స్థలముల భద్రపఱిచి వానిమీఁద స్తూపములను నిర్మించిరి. ఇట్టి

ధాతుగర్భపదమునకు భ్రష్టరూపము దాగబ (దాగోబా). ధాతుగర్భము మీఁది దిబ్బకు స్తూపమని పేరయినను కాలక్రమమున నీరెండు భాగములు కలిసిన సంపూర్ణ నిర్మాణమునకే స్తూప మనుపేరు రూఢి యయినది. బుద్ధులు, ప్రత్యేక బుద్ధులు, అర్హతులు, చక్రవర్తులు మాత్రమే స్తూపగౌరవమున కర్హు లని బౌద్ధుల మహాపరినిర్వాణ సూత్రమునఁ దెలుపఁబడినను విఖ్యాతు లయిన బౌద్ధాచార్యులకును స్తూపములు వెలసినవి. శారీరకధాతువులను మాత్రమే కాక పరిభోగిక ధాతువులను, అనఁగా బుద్ధుఁడు కాని, అర్హతులు కాని, చక్రవర్తులు కాని, ఆచార్యులు కాని యుపయోగించిన భిక్షాపాత్రములు, చేతికఱ్ఱలు, పానపాత్రములు — ఇట్టివానిని గూడ పదిలపఱిచి స్తూపములు నిర్మించుట వాడుకయయినది. కాలక్రమమున బుద్ధునితో సంబంధముగల పవిత్రక్షేత్రములందు ధాతురహితముగనే, వట్టి స్మారకచిహ్నములుగఁ గూడ స్తూపములు వెలయుచు వచ్చినవి. స్తూపములకు సింహళమున 'దాగబ' (దాగోబా) లనియు, నేపాళదేశమున 'చైత్యము' లనియు, బర్మాదేశమున 'పెగోడా' లనియు వ్యావహారిక నామము చెల్లుచున్నది. బౌద్ధయుగమున స్తూపమున కీర్తిని ప్రాముఖ్యము కలిగెను. బౌద్ధకళయందు బుద్ధుని మహాపరినిర్వాణమునకు స్తూపమును,

జిత్రితములయినవి. బౌద్ధయుగమున స్తూపము బుద్ధభగవ
త్యర్థముగ సమర్పించు నొకకానుకయై, తన్నిర్మాణము బౌ
ధర్మావలంబకులకు పుణ్యప్రదమయిన ధర్మకార్య మయిన

అలంకార పరిశోభితములయి కనులు కోరగించు
దివ్యసుందర విగ్రహములు, చూడ ముచ్చట యయిన
పని, హృదయ రంజకముగఁ జేతితో వ్రాసిన చిత్రము
మొదలయిన కళావిదగ్ధములగు కృతు లున్నచోటికి పో
దని బౌద్ధులకు బుద్ధుని యాదేశ మున్నను వారి నిష్కల
హృదయములు సంసారదుఃఖము నంతరింపఁజేయ న
రించిన ప్రేమావధి బుద్ధ భగవానునియెడల భక్తిరస ప్ర
ర్ణములయి, వారి నారాధకులుగ దిద్దినవి; ఈరీతిని
క్రమమున భక్తిరహితమయిన మతమున భక్తియు, ఆ
ధన రహితమయిన మతమున ఆరాధనమును మొలకె
అట్టి యాదేశము నొసంగిన బుద్ధ భగవానుని చుట్టునే
నిధానములయిన మనోహర శిల్పకావ్యము లెన్నియో
చితములై ఆదిబౌద్ధముస్వరూపస్వభావముల నే సంపూర్ణ
మార్చి వైచెను.

భక్తులయిన బౌద్ధ శిల్పుల సిద్ధహస్తముల
నిర్మాణ మొకకళయై క్రమ పరిణామము నొంది వన్నె

ప్రజలకు బుద్ధ భగవానునియెడల భక్తిగౌరవములను, మత విషయకమగు ప్రబోధమును గలిగించుటకు బౌద్ధశిల్పులు బుద్ధజీవిత కథలను, బౌద్ధగాథలను చిత్రించుచుండిరి. బౌద్ధగాథలు మొదట చాల పరిమితముగనే యుండినను క్రమముగ నవి యసంఖ్యముగఁ బెరిఁగినవి. వీనిలో, ఈజన్మమున బుద్ధుఁడయి నిర్వాణపదవి నొందిన బోధిసత్వుఁడు దయ, అహింస, ప్రేమలకు లక్ష్యముగఁ గడపిన పూర్వజన్మములకు సంబంధించిన వృత్తాంతము లగు జాతక కథలు ప్రజారంజకము లయినవి. ప్రపంచ కథా వాఙ్మయమునం దెల్ల ఈజాతకకథావళి కడుంగడు ప్రాచీన మయిన దనియే కాక, యూరోపీయ ప్రాచీన కథా వాఙ్మయమునందలి చాలకథలకాకరము లిందే కలవని ప్రాచ్య పరిశోధక పండితులగు విదేశీయులును, భారతీయులునుగూడ అభిప్రాయ పడుచున్నారు. మొట్టమొదట, బౌద్ధకళ యారంభదశలో, శిల్పమున బుద్ధుని చిత్రింపవలసి వచ్చినప్పుడు భౌతికమాన విధేయములయిన నామరూపములను విడిచి యా సాధువతంసము నిర్వాణము నొందెనని తెలుపుటకు గుర్తుగ నచ్చటి స్థలమును శూన్యముగ నుంచువారు. చిత్రాభావమే బుద్ధభావమునకు చిహ్నముగ నుండెను. కాలము గడచినకొలఁది,

ప్రజ్ఞను సమస్తము భగవదర్పితము గావించి కళారూపమున నే భగవానుని ఉపాసించు చుండిరి.

అశోకుఁడు : బౌద్ధమతము

బుద్ధుని నిర్వాణము ననంతరము మగధయందు స్థానికముగ వర్ధిల్లుచుండిన బౌద్ధమతమును విశ్వపరివ్యాప్తము గావించి బుద్ధ బోధామృతమును సంసారార్తులయిన ప్రజలకందఱకు నందించి లోకమునందలి దుఃఖమును నివర్తింపఁ జేయుట కశోకుఁడు పూనిక వహించెను. అప్పటికే బౌద్ధ సంఘము థేరవాదులని (స్థవిరులు : పూర్వాచార పరాయణులు), మహాసాంఘికులని (సంస్కర్తలు) రెండు కక్షులయ్యెను.

వజ్జిదేశపు భిక్షువులు భిక్షాభోజనాదులకు సంబంధించిన దశవస్తువుల (దశవత్థూని) విషయమున పూర్వాచార నియమములను పాటించు చుండనందున, ఏతన్నియమోల్లంఘనమును గుఱించి విచారించుటకు వైశాలీనగరమున నొక సంగీతి (బౌద్ధధర్మార్థ నిర్ణయమునకయిన సభ) జరగినది. అందు పూర్వాచారపరాయణులయిన థేరవాదుల (స్థవిరుల) కంటె నితర సాంఘికులే అధిక సంఖ్యాకులుగ నుండినను విషయ నిర్ణయమునఁ దమ యభిప్రాయమును దెలుపు నధి

వడక తమ పద్ధతియే సరియైనదని వాదించి థేరవాదులనుండి విడిపోయి, మహా సాంఘికులను పేర నొక తెగగా నేర్పడి యొక నూతన వాదమును స్థాపించిరి.

ఈచీలిక నతిక్రమించి సంఘమును కట్టుదిట్ట పఱుచుట కొఱకు అశోకచక్రవర్తి పాటలీపుత్రమున మఱియొక సంగీతిని సమావేశ పఱిచెను. దీనికి మౌద్గల్యా పుత్రుఁడయిన తిష్యుఁ డధ్యక్షుఁడు. బౌద్ధధర్మ ప్రవచనానంతరమున శిక్షా సూత్రార్థ సమన్వయమున థేరవాదులకును, మహాసాంఘికులకును ఏకీ భావము కుదరలేదు. థేరవాదులు సభనుండి వెడలి పోవుటయే కాక, తమకు మహా సాంఘికులతో సరిపడక మగధ దేశమును గూడ విడిచిపెట్టి, కాశ్మీరా ద్యుత్తర దేశముల కరిగి యచ్చటఁ దమ మతమును వ్యాపింపఁ జేయుచుండిరి.

బౌద్ధ సంఘమున నిట్లు చీలిక కలుగుటకు కారణము పైని చెప్పినట్లు 'దశవస్తువు' లని కొన్ని బౌద్ధ గ్రంథములును, మహాదేవుఁడు 'అర్హతుని లక్షణము'ను గూర్చి ప్రతిపాదించిన 'పంచ సిద్ధాంతము'లని మఱికొన్నియు నుడువుచున్నవి. విడిపోయిన మహాసాంఘికులు 'ధమ్మము'ను, 'వినయము'ను (బౌద్ధ వేదములగు త్రిపిటకములందలి మొదటి రెండు పిటకములు) స్వవాదానుసార మందందు సంస్కరించి 'థేరవాదము'నకు ప్రతిగా తమ వాదమునకు 'ఆచారియ

పాటలీపుత్ర సభానంతరము బౌద్ధమతమును దేశదేశముల
వ్యాపింపఁ జేయుటకు అశోక చక్రవర్తి మత బోధకుల
నంపెను. చక్రవర్తి యాజ్ఞ శిరసావహించి, దేశాంతరముల
కరిగిన మతబోధకులు మాగధులకుఁ దెలియవచ్చినవారు వీరు
౧. కాశ్మీర, గాంధారములకు 'మజ్ఝంతిక' భిక్షువు; ౨
మహిషమండలమునకు (ఆంధ్ర, మైసూరు దేశములకు) 'మహ
దేవ' భిక్షువు; (ఇతఁడు పాటలీపుత్రము నందలి మహాసాంఘి
కులకు నాయకుఁడు); ౩. 'వనవాసి'కి 'రక్ఖిత' భిక్షువు; ౪
'అపరాంతక'మునకు 'ధమ్మరక్ఖిత' భిక్షువు; ౫. 'మహారట్ఠ
ము'నకు 'మహాధమ్మరక్ఖిత' భిక్షువు; ౬. 'యవనలోకము
నకు 'మహారక్ఖిత' భిక్షువు; ౭. 'హిమవంతపాదము' నకు
'మజ్ఝిమ', 'కస్సపులు'; ౮. 'సువణ్ణభూమి'కి 'సోణక
'ఉత్తరులు'; ౯. 'తాంబపణ్ణికి' 'మహింద' భిక్షువు.

## చైత్యకులు

బౌద్ధమత వ్యాపనమున కశోక చక్రవర్తి ప్రేషి
తుఁడై యాంధ్రదేశమున కరుదెంచిన మగధ మహాసాంఘిక
నాయకుఁడగు మహాదేవ భిక్షువు కృష్ణానదీతీరస్థము
ధాన్య కటకమును నివాస భూమిగఁ జేసికొని చైత్యక వా
మను నొక పంథ స్థాపించెను. ఈపంథకుఁ జెందిన భిక్షువులకు
చైత్యకులనియు, చైత్యక నికాయమనియుఁ బేరు. ఈరీతి

చిన 'కునాల', 'దశరథు'ల వెనుక 'సంప్రతి' రాజ్యమునకు వచ్చి క్రీ. పూ. ౨౨౦ మొదలు ౨౧౧ వఱకు పరిపాలించెను. అశోకచక్రవర్తికి బౌద్ధమత మనిన నెంతటి యభినివేశముండెనో యీతనికి జైనమత మనిన నంతటి యభిమాన ముండెనని, అశోకునివలెనే యీతఁడును ఆంధ్ర, ద్రమిళ దేశములకు మతబోధకుల నంపి, జైనమతమును వ్యాపింపఁజేసెనని హేమచంద్రుని పరిశిష్ట పర్వము ననుసరించి తెలియుచున్నది. సంప్రతి ప్రయత్నములవలన జైనమత మాంధ్రదేశమున బాగుగ వ్యాపించినను వ్యాపింపక పోయినను మహాదేవ భిక్షువు తలపెట్టిన బౌద్ధమత వ్యాపన ప్రయత్నములకుఁ గొంత యాటంకము కలిగిన కలిగియుండును. అయినను తరువాతి కాలమున తెలుఁగుదేశమున బౌద్ధము సర్వజనాదరణీయ మయిన మతమయి వర్ధిల్లె ననుటకు ఆంధ్రదేశమున నందు ముఖ్యముగ కృష్ణా, గుంటూరు మండలములందుఁ గానవచ్చిన, కానవచ్చుచున్న బౌద్ధస్తూపాదికములే తార్కాణము.

## అమరావతీ స్తూపము

భక్తులయిన యాంధ్రదేశ కళోపాసకులు బుద్ధ భగవానుని పాదపీఠిని కానుకగా సమర్పించిన యట్టి పూజాకుసుమములలో అమరావతీ స్తూప మొకటి. ఇది కృష్ణానదీ

మున నున్నది. ఇది యిప్పటి అమరావతీ గ్రామమునకు నడుమ నుండుటచేత అమరావతీ స్తూపమని దీనికిఁ బేరు కలిగినది. క్రీస్త్వారంభ శతాబ్దులలో ధాన్యాకర మని నామాంతరముఁ గల ధాన్యకటక నగరము దక్షిణాపథము నందలి నగరములలోని కెల్ల నవతంసమై ప్రఖ్యాతిఁ గాంచుటవలన నిది ధాన్యకటక చైత్య మనియు, బౌద్ధ సంఘము నివసించుట కనువయిన విహారములు మొదలగున వనేకము లిచట నుండుటచేత ధాన్యకటక సంఘారామ మనియు బౌద్ధ వాఙ్మయమున నిది ప్రసిద్ధమైనది.

ఈ స్తూప మెప్పుడు నిర్మిత మయినదో స్పష్టముగఁ దెలిసికొనుట కాధారములు లేవు. శారీరక స్తూపము లెనిమిదింటిలో అశోకుఁ డేడింటిని తెఱపించి యందలి ధాతువులను చిన్న చిన్నవిగ పెక్కు విభాగములు గావించి, యందొక్కొక దానిమీఁద నొక్కొకటిగ దేశమునందలి వేర్వేరు భాగములందు మొత్తముమీఁద నెనుబది నాలుగు వేల స్తూపములను గట్టించినట్లు తరువాతికాలపు బౌద్ధగాథలు తెలుపుచున్నవి. కొన్ని ఇట్టి గాథల వలననే అమరావతీస్తూప నిర్మాత అశోక చక్రవర్తియని తెలియుచున్నది. ఈగాథలు విశ్వసనీయము లనుటకు ప్రమాణాంతరములు లేకపోయినను ఈస్తూపపు రాలమీఁద మౌర్యలిపిలో శాసనము లుండుట

గానవచ్చు నర్వాచీన రీతులను వేఱుపఱిచి చూచినయెడల, ప్రాచీనరీతుల ననుసరించికూడ ఇచ్చటి ప్రాథమిక స్తూపము క్రీ. పూ. రెండువందల ప్రాంతమున వెలసినదిగనే కన్పట్టును. అశోక ప్రేషితుఁడయి యాంధ్రదేశమున కరుదెంచిన మహాదేవ భిక్షువు స్థాపించిన చైత్యక పంథ కిది ప్రధానపీఠమగుటచేతను, అటుతరువాతి కాలపు శాసనములం దిది మహాచైత్య మని పేర్కొనఁబడుటచేతను ఒకవేళ నిది యశోక చక్రవర్తి యాదరణమున వెలసినదన్న ననవచ్చును కాని యిది యూహామాత్రమే. ప్రారంభమున వెలసిన చైత్యము (స్తూపము) చుట్టును కాలక్రమమున పెక్కు చైత్యములు వెలసి, యిది బహువిధాలంకార ప్రాకార పరిశోభితమయి, చూచువారలకు నేత్రపర్వ మొనరించుచు వార్త కెక్కినది.

మహాదేవుని నాఁటనుండి యీధాన్య కటక మహాచైత్యక్షేత్రము ఆంధ్ర మహాసాంఘికులకు ప్రధానమయిన పవిత్రపీఠముగ నుండినది. ధాన్యకటకము రాజధానిగ ఆంధ్రదేశమును బరిపాలించిన ఆంధ్రవంశ్యులగు శాతవాహనులు బౌద్ధమతము నాదరించి యీచైత్యమును బెక్కు విధములఁ బెంపొందించిరి.

పూర్వశైల, అపరశైలములు

మౌర్య వంశానంతరకాలపు స్తూప శాసనములను బరిశీలించినచో నం దిది 'చెతికియానం నికాయస మహాచేతియ' మనఁగా చైత్యకనికాయముయొక్క మహాచైత్య మని పేర్కొనఁ బడినది. మహాసాంఘికులలో చైత్యక వాదు లొకరు. ఈబౌద్ధ సంఘమును దాక్షిణాత్య బౌద్ధులు చైత్యవాద సంఘ మని, ఉత్తరాది బౌద్ధులు చైత్యశైల సంఘ మని వ్యవహరించుచుండిరి. ఈ సంఘముకాక అమరావతి నాగార్జునుని కొండ శాసనములందు పూర్వశైల (పువసేలియ), అపరశైల (అపరసేలియ) నికాయములు కూడఁ బేర్కొనఁ బడినవి. పూర్వశైల, అపరశైలము లను పేరఁబరఁగిన యిచటి బౌద్ధ సంఘారామములు బౌద్ధవాఙ్మయమునందు కడుంగడు ప్రసిద్ధికెక్కినవి. రమ్యహర్మ్య కళాసౌందర్యమును, ప్రకృతి దృశ్యసౌందర్యమును గూడ నీ సంఘారామములకుఁ గలదని యేడవశతాబ్ది నిచ్చటి కరుదెంచిన యువాన్‌చాంగ్ అను చీనా యాత్రికుఁడు వీనిని కీర్తించియున్నాఁడు. ఇవి పూర్వోక్త శాసనములందుఁ గొన్నిట పూర్వమహావనశైల (పువమహావన సేలియ), అపరమహావన శైల (అపరమహావన సేలియ) నామములఁ బరికీర్తితము లయినవి. క్రీస్తుశకము రెండవ, మూఁడవ శతాబ్దుల నాఁటి 'గండవ్యూహ' మను నొక

దిశయందు ' విచిత్రమాలధ్వజ వ్యూహ ' మను పేరఁ బ్రసిద్ధమయిన యొక మహారణ్యము కలదని చెప్పఁబడినది. దీని ననుసరించి చూడ ధాన్యకటక సమీపమున పూర్వపశ్చిమ దిశలందు మహావనావృత శైలము లుండియుండు ననియు, దానం జేసియే యీశైలములందలి సంఘారాములకు పూర్వ, అపరమహావనశైలము లని పేర్లు కలిగె ననియుఁ గొందఱూహించు చున్నారు.

పూర్వ, అపరశైలము లేవి యను విషయమున పరిశోధక పండితులలో భేదాభిప్రాయములు కలవు. పూర్వశైలము బెజవాడయని కొందఱ యభిప్రాయము: ధాన్యకటకమే యని మఱి కొందఱ మతము. ఇటీవల త్రవ్వఁగా నాగార్జునుని కొండయొద్ద బయలుపడిన స్తూప సంఘారామ, ప్రాకృత శాసనాదుల ననుసరించి చూడ ధాన్యకటకమునకుఁ దూర్పున నున్న సంఘారామము పూర్వశైలమను పేరను, పశ్చిమమున నున్న సంఘారామము అపరశైలమను పేరను బ్రసిద్ధము లయ్యెనని యూహింపఁ దగియున్నది. ఇవికాక కృష్ణా నదీతీరమున కంటక శైలమని మఱియొక సంఘారామ ముండినట్లు శాసనములవలన విదిత మగుచున్నది. ఈ కంటక శైలమే యిప్పటి ఘంటశాల. నాగార్జునునికొండ, అమరావతు లందలి స్తూపముల వలెనే ఇచ్చటిదిగూడ మహాచైత్య

నామాంకితమయి తనరారు చుండుటచేత, నాఁడు కృష్ణానదీ తీరమున వెలసిన సంఘారామాదు లన్నియు మహా చైత్యక పంథకు సంబంధించినవిగఁ గన్పట్టును. ఈ కారణమున చైత్యక నికాయమే పూర్వశైల, అపరశైల సంఘములుగ విడి పోయెనని కొందఱందురు: దీని నంగీకరింపక మఱి కొందఱు పూర్వాపర శైల సంఘముల వలెనే చైత్యక సంఘముకూడ ఆంధ్రదేశ మహా సాంఘికులందలి ప్రత్యేకమయిన మూఁడవ విభాగమని చెప్పుదురు. ఆచార వ్యవహారముల యందును, శిక్షా నియమములయందును బరస్పరము వీరికి నెట్టి భేదములు కలవో తెలియదు కాని వీర లెల్లరు నొక్క పంథకే చెందిన వారని శాసనములవలన స్పష్టమగుచున్నది.

### అంధకులు

ఎట్లయిన నేమి, ఆంధ్రదేశమున కరుదెంచి చాల కాలము గడచిన మీఁదట మహా సాంఘికులలో పెక్కు తెగ లేర్పడినవి. పైని పేర్కొనినవి కాక శాసనాధారమున రాజ గిరికులు లేక రాజగిరి నివాసకులని, సిద్ధాంతికులని మఱి రెండు తెగల పేర్లు తెలియుచున్నవి. ఇవి యన్నియు బౌద్ధ గ్రంథములందును బేర్కొనఁ బడినవి. హిమవత, వాజిరియ, పువ్వసేలియ, అపరసేలియ, రాజగిరీయ, సిద్ధాంతిక సంఘ

నను చైత్యక, పూర్వశైల, అపరశైల, రాజగిరిక, సిద్ధాంతిక నికాయములు కేవలము తెలుఁగు దేశపు తెగలని తెలుఁగు దేశపు ప్రాకృత శాసనములందు వీ రుదాహృతు లగుటవలన నిశ్చయింప వచ్చును. వీరిలోఁ గడపటి నాలుగు తెగలవారు బౌద్ధ గ్రంథములందు అంధకులు అను పేరఁ బేర్కొనఁబడిరి. అంధకులే ఆంధ్రులు.

క్రీస్త్వబ్దమున కించుక పూర్వమునఁ గూడ ఆంధ్ర దేశమునందలి యీ ధాన్యకటక ప్రాంతము బౌద్ధమతమునకు పంట పొలమయి, బౌద్ధులకుఁ బట్టు గొమ్మగ నుండె ననుటకు సింహళద్వీప చరిత్రమే యాధారము. బౌద్ధ వాఙ్మయమున 'తాంబపణ్ణి' యనఁ బరఁగిన సింహళద్వీపమును క్రీస్త్వబ్దమునకు రెండువందల సంవత్సరములకుఁ బూర్వమున పాలించుచుండిన 'దుట్టగామణి' యను ప్రభువు అనురాధపురమున 'మహాథూపము' (ర్వాన్ వెల్లి మహాస్తూపము)ను నిర్మించుచుండిన సందర్భమున హిందూదేశమునందలి వేలు వేలు ప్రాంతములనుండి అర్హతులు, ఆచార్యులు వేలకొలఁది బౌద్ధసాంఘికులతో నచ్చటి కరిగిరఁట. ఇట్లు వెళ్లిన వారిలో అర్హతుఁడయిన మహాదేవుఁ డొక్కఁడు. ఇతఁడు 'పల్లవ భొగ్గ'మునుండి నాలుగులక్షల యఱువదివేల భిక్షువులను వెంట నిడికొని వెళ్లెనఁట. భిక్షువుల సంఖ్య యతిశ

'క్రవచకార భోగము', 'హోమనిభోగము' అని ప్రాచీన శ
సములందు దేశ విభాగ పరముగ వాడుక చేయఁబడి నంద
'పల్లవభొగ్గ' (పల్లవభోగ) మనునదియు నొక దేశ విభ
మై యుండుట నిశ్చయము. దేశ విభాగ మను నర్థమ
'భోగ' మునకు బదులు దేశ, విషయ, నాఁడు పదము
ప్రాచీన శాసనములందుఁ బ్రయుక్తము లగుటవలన 'ప
భొగ్గ' మనునది 'పల్లవవిషయ' మని కాని, 'పల్లవనాఁ
కాని చెప్పవలసి యుండును. 'పల్లవనాఁడే' ఇప్పటి '
నాఁ' డయినదని కొందఱు చరిత్రకారుల యభిప్రాయ మ
టవలన 'పల్లవభొగ్గ' మనునది 'పలనాఁ'డని నిర్ణయిం
పగును. పల్లవనాఁడును, అందలి ధాన్యకటకమును ప్రా
కాలమున పల్లవులు పాలించిరని శాసనముల వలనను, గా
వలనను గూడఁ దెలియుచున్నది. త్రిలోచన పల్లవునికి ధా
కటక మొకప్పుడు రాజధానిగ నుండినట్లు గాథలు కల
కాంచీపురము రాజధానిగఁ బరిపాలనము నెఱపిన పల్లవ
ధాన్యకటకమునఁ దమ ప్రతినిధులను నిలిపి యాంధ్రా
మును పాలించినట్లు శాసనములు తెలుపుచున్నవి. క్రీస్తు
మాఱవ శతాబ్దిని విష్ణు కుండుల విజృంభణము ననంతరమ
గాని పల్లవులు కృష్ణానదీ తీరమును విడిచి యింకను ద
దిశకు సాగియుండలేదు. స్వతంత్ర రాజ్యము స్థాపించు

మయిన యీ ప్రాంతమునందలి వారితో సంబంధ బాంధవ్యములు నెఱపి వర్ధిల్లుచుండిరి. పల్లవులకు జన్మస్థలముగఁ గాకపోయినను వారికిఁగల యితర సంబంధాధిక్యమువలన 'పల్లవ భోగ్గము' (పలనాఁడు) అను పేరఁ బరఁగిన యీ ధాన్యకటక ప్రాంతము క్రీస్త్వబ్దమునకుఁ బూర్వమునఁ గూడ బౌద్ధమతమునకు 'చేవపట్టు'గ నుండెనని నిరూఢమగుచున్నది.

బౌద్ధమత మట్లు ప్రబలుచుండినను అమరావతీ స్తూపమునఁ గడు ప్రాచీన చిత్రము లరుదుగను, అర్వాచీనములయినవి, అనఁగా మొదలి స్తూపము నిర్మితమయిన రెండు వందల సంవత్సరములకుఁ దరువాతివి, అధికముగను గాన్పించుటచేత మొదటి నాళ్లలోకంటె తరువాతనే యిచ్చటి స్తూపము పెంపుచెంది గొప్ప బౌద్ధక్షేత్రముగ ప్రఖ్యాతమయిన ట్లూహింపవలసి యున్నది. ఆది బౌద్ధమునం దద్భుత పరివర్తనము జరగిన కాలముననే యీస్తూప మత్యంతము పెంపు చెందుటచేత దీని పేరుపెంపులకుఁ దోడుపడిన యీ పరివర్తనమును గుఱించి యించుక తెలిసికొనుట యావశ్యకము.

## హీనయాన, మహాయానములు

వైశాలీ నగరమున బౌద్ధసంగీతి జరగిన నాఁటనుండి

బౌద్ధ సంఘమునందలి యొక కక్షవారు మార్పు చెందుచ
డిన బౌద్ధమును, వేఱొక కక్షవారు మార్పును ద్వేషిం
మూల సిద్ధాంత బద్ధమయిన ఆదిమ బౌద్ధమును అభిమ
నించిరి. రాఁగా రాఁగా, మార్పునొందిన బౌద్ధమునకు 'మహ
యాన' బౌద్ధమని, ఆదిమ బౌద్ధమునకు 'హీనయాన' బౌ
మని పేర్లు కలిగినవి. 'హీనయానము'న సర్వసంగ ప
త్యాగముఁ గావించి, భిక్షువుగాఁ జేరి, 'వినయ, సు
అభిధమ్మము' లను త్రిపిటకములను జదివి పరిజ్ఞాతమై అ
తుని పదము నొందినవానికే నిర్వాణోపలబ్ధి కలుగున
ఈకారణమున 'హీనయానము'నకు 'అర్హతయాన' మనికూ
పేరుకలదు. 'మహాయానము'న వెంటనే యట్టి సంగ ప
త్యాగము గావించుట యనావశ్యకము. బంధువులనుండి వి
పోవ నక్కఱలేదు. ఇల్లు, వాకిలి విడనాడ నక్కఱలేద
ప్రేమబంధములను త్రెంప నక్కఱలేదు; ఎచ్చట నున్నను,
వృత్తి నవలంబించు చుండినను, గృహస్థధర్మమునే నడపు
సర్వభూతములయెడల ప్రేమయు, దయయుఁ జూపుచు, లో
కల్యాణమును గోరి సత్కార్యాచరణ పరాయణుఁడయి బౌ
ధర్మముల ప్రకారము ప్రవర్తించు చుండినచో నెట్టివాఁడ
నను నిర్వాణము నొందఁ గలఁడు. ప్రధానభేద మీరెం

మహాయానమున నిర్వాణోపలబ్ధి సర్వజన సులభమగుటచేత బౌద్ధమున నెంతయో గొప్ప పరివర్తనము సంభవించెను. ఆదర్శములు మాఱినవి ; ఆచారములు మాఱినవి ; తత్త్వము భేదించినది ; భక్తి హెచ్చినది; కర్మకాండము పెరిఁగినది; నూతనసృష్టి యెంతయో కలిగినది. తుదకు బుద్ధుఁడు మొదట బోధించిన బౌద్ధమునకు, ఈవిధమున పరివర్తనము నొందిన బౌద్ధమునకు పెక్కువిషయముల సాదృశ్యమే లేకపోయినది. రాగ ద్వేష మోహానల జ్వాల లంతరించి, స్వకీయ వ్యక్తిత్వము రూపుఱుటయును, దుఃఖ సముదయమునుండి ప్రాణి మోక్షము నొందుటయునే నిర్వాణమని ప్రథమమున బుద్ధుఁడు బోధించెను. అంతకన్న 'తత్త్వ' పరముగ నతఁ డేదియుఁ జెప్పియుండక పోవుటయే కాక, అట్టి దానిని గూర్చిన కల్పనాలోచనములు కూడ వనియు నిషేధించెను. అట్టిది, మహాయానమున, ప్రపంచ సత్యాసత్యత్వములను గూర్చియు, పరమజ్ఞానమును గూర్చియు తర్కవితర్కములు ప్రబలి బౌద్ధదర్శనము (Buddhist philosophy) అంకురించి యది క్రమముగా విస్తరిల్లినది. ఇట్లగుటలో, ధర్మకాయ, సంభోగకాయ, నిర్మాణ కాయములని బుద్ధకాయత్రయ సిద్ధాంత మేర్పడినది. 'హీనయానము' నబౌద్ధులకు ధర్మము,

మావశ్యకము, మహాయానమున బోధిసత్త్వాదర్శము ప్రాధాన్యము వహించెను. సంపూర్ణ వికసిత చిత్తులయి, ప్రపంచ దుఃఖమునకుఁ దామును పరితాపము ననుభవించుచుఁ, దమ ప్రేమము కారణముగ అలసులుగ నుండక, అలౌకికౌదార్యముతో ఈజన్మమునను, భవిష్యజ్జన్మము లందును ప్రపంచ సేవచేయఁ గృత నిశ్చయులై, సర్వభూత నిర్వాణోపలబ్ధికిఁ బాటుపడుచు, ఈజన్మమునందుఁ గాని, భవిష్యజ్జన్మమునందుఁ గాని విధాయకముగ బుద్ధపదమును బడయువారు బోధిసత్త్వులు. దరిదాపుగ బుద్ధపదమును సమీపింపవచ్చిన యిట్టి బోధిసత్త్వులతోడ్పాటు కాని, బుద్ధులతోడ్పాటు కాని లేని దే మహాయానమున బౌద్ధమతావలంబి బుద్ధపదము నొందనేరఁడు. భక్తిసాధనముననే బోధిసత్త్వులు వశులై భక్తునికి తోడ్పడుచుందురు. ఈ కారణమున, బౌద్ధులకు హీనయానమున స్తూపమునకు పూవులు సమర్పించుట, దానికి ప్రదక్షిణము చేయుట, బౌద్ధ క్షేత్రములను సందర్శించుట, బౌద్ధ భిక్షువులకు భోజన మిడుట కర్తవ్యములు కాఁగా, మహాయానమున బుద్ధునికి భిన్నులయిన బోధిసత్త్వులు మొదలగు దేవతలను పూజించుట ప్రధానకార్యమయ్యెను. బోధిసత్త్వులకీరితిని గలిగిన ప్రాధాన్యమువలన మహాయానము 'బోధిసత్త్వయాన' మనియు పేరు గాంచినది.

గాని తాను నిర్వాణము నొందనని 'ప్రణిధానము' గావిం
చినవాఁడు. బోధిసత్త్వులు భార్యాసహితులు: సంపత్సమే
తులు, మహాయానమున వీరు అసంఖ్యముగ వెలసిరి. వీరి
చుట్టు నపూర్వములయిన గాథ లనేకము లల్లుకొని, మహా
యానమునకు గొప్పపురాణవాఙ్మయమును (Mythology) ప్రసా
దించినవి. ఇట్టి బోధిసత్త్వులలో నొకఁడును, బౌద్ధమున విద్యా
సంస్కృతుల కధి దైవతమును అయిన 'మంజుశ్రీ'కి 'మాల
ధ్వజ వ్యూహచైత్యము' (ధాన్యకటక చైత్యము) చెంత నున్న
మహారణ్య మావాసమనియు, నతఁడు ఆ ప్రాంతమున నివ
సించుచుండిన నాగవంశ్యు లనేకులను, ఇంక నితరులను
బౌద్ధులను గావించె ననియు 'గండ వ్యూహ' మను గ్రంథము
నఁ దెలుపఁబడినది.

మహాయానము విస్తరిల్లిన కాలముననే అమరావతీ
స్తూపము పేరుపెంపులు గాంచి విఖ్యాత బౌద్ధక్షేత్రమయి
విలసిల్లినది. ఈనూతన బౌద్ధ మావిష్కరణము చెందిన
స్థలము అమరావతీ ప్రాంతమని కొందఱును, కాశ్మీర గాం
ధారములని కొందఱును వచింతురు. ఇందేది సత్యమయినను
మహాయానమునకు నమరావతికి నెక్కువ సంబంధము కల
దనిమాత్ర మంగీకరింపక తీరదు.

ఆర్య నాగార్జునుఁడు

వాదమును బ్రతిపాదించినవాఁడు బౌద్ధ శ్రావకుఁ డయిన యార్య నాగార్జునుఁడు. మహాయాన మత స్థాపకుఁడే యితఁడని కొంద అందురు కాని ఇతనికి పూర్వమే మహాయాన బౌద్ధ మావిష్కరణము నొందుటకుఁ గారణములయిన యభిప్రాయములు బౌద్ధసంఘమున నిగూఢములుగ నుండిన వనియు, ఇట్టి యభిప్రాయముల నదివఱకే వెలువఱుచుచు వచ్చిన యాచార్యులు కొందఱు కల రనియు కొంద అందురు ; కాని మహాయానము ఆర్యనాగార్జునుని వలననే ప్రఖ్యాతమయి వర్ధిల్లినదని యెల్లరు నంగీకరింతురు.

జన్మచేత బ్రాహ్మణుఁడయి, మతావలంబనమున బౌద్ధుఁడయిన యీ యార్యనాగార్జునుని కాలమును గుఱించి కాని, జన్మస్థలమును గుఱించి కాని మనకు నిశ్చయముగఁ దెలియదు. కొంద ఱీ యాచార్యసత్తముఁడు క్రీస్త్వబ్దమునకు పూర్వము మొదటిశతాబ్ది యంతిమభాగమునం దుండెననియు, మఱి కొందఱు క్రీస్తుశకము రెండవశతాబ్ది యంతిమభాగమునను, మూఁడవ శతాబ్ది యారంభమునందు నుండెననియు వాదింతురు ; క్రీస్తుశకము రెండవ శతాబ్దినాఁటివాఁడను నభిప్రాయమే యిప్పుడు ప్రబలముగ నున్నది. విదర్భయందలి యమరావతిలో జన్మించెనని కొందఱు, దక్షిణ కోసలదేశీయుఁ

కలవు. నాగార్జునాచార్యుఁ డొక్కఁడు కాఁడనియు, ఆపేరు కలవారు వేఱువేఱు కాలములందుఁ బుట్టి ప్రఖ్యాతులయిన వారు ముగ్వురు కల రనియు నొక వాదము కలదు. ఎచ్చట జన్మించినను మాధ్యమిక వాదకర్తయయిన నాగార్జునుఁడు తన జీవితపు ప్రొద్దు పడుమటి దెసకు వ్రాలిన కడపటి కాలమును కృష్ణానదీతీర ప్రాంతమునందుఁ గడపె నని బౌద్ధ గ్రంథములవలనఁ దెలియుచున్నది. ఆకాలమున దక్షిణాపథము నేకచ్ఛత్రముగఁ బాలించుచుండిన యాంధ్రరాజు 'సాతవాహనుఁ' డీయార్య నాగార్జును నాదరించి యత్యంతము గౌరవించెను. ఆర్య నాగార్జునుఁడు శ్రీ ధాన్యకటకము చుట్టు నానా చిత్రవిచిత్రిత మయిన ప్రాకారమును గట్టించుటయే కాక, మహోద్దానపతి (Patroniser) 'సాతవాహను'ని వితరణౌదార్యములవలన 'శ్రీ పర్వతము'న 'శైలమంటపాలయము'ను గట్టించెను.

శ్రీ పర్వతమును, ధాన్యకటకమును ప్రముఖము లయిన బౌద్ధ పీఠములని 'మంజుశ్రీ మూలకల్ప'మను బౌద్ధ గ్రంథమునఁ గలదు. జీవితావసానదశయందు నాగార్జునాచార్యుని కావాసమయిన శ్రీపర్వతమును, పూర్వోక్త గ్రంథమునఁ జెప్పఁబడిన శ్రీ పర్వతము నొక్కటియే కానోపును. ఈ శ్రీ పర్వతము కృష్ణానదీతీరసమయి నేఁడు శైవ

ముల ననుసరించి శ్రీ పర్వత మనునది 'మహాచైత్య' విలసిత మయిననాగార్జునునికొండ యగు నేమోయని తోఁచుచున్నది. ఆ శాసనములందు 'శ్రీపర్వతము' కాశ్మీరము, గాంధారము చీనా, అపరాంతము, వంగము, వనవాసి, 'తాంబపణ్ణి' ద్వీపము మొదలగు దూరస్థదేశములందు బౌద్ధ మతమును వ్యాపింపఁజేయు బౌద్ధుల కత్యంత పవిత్రక్షేత్రమని చెప్పబడినది. ఈ ప్రాంతమున నుండియే, అనఁగా కృష్ణానదీతీరస్థమయిన గూడూరు(కొడ్డూర)నుండియే బౌద్ధులు బర్మా, సయామ్ మొదలగు దేశములకు ఓడనెక్కి బౌద్ధమతబోధకై అరుగుచుండువారు. బుద్ధుని పిదప బుద్ధుని యంతటి వాఁడయిన నాగార్జునాచార్యుని కావాసమయిన స్థలమగుటచేత పూజ్యార్థమున నాపర్వత ప్రదేశమునకు శ్రీ పాదు, శ్రీపాదములు అనునట్లు శ్రీ పర్వతమను నభిధానము కలిగియుండును. బౌద్ధ మతము క్షీణించి, దాని మీఁది గౌరవాదరణములు నశించిన మీఁదట నా పర్వతనిలయము వట్టి 'నాగార్జునుని కొండ' నాఁ బరఁగి యుండవచ్చును.

తన్నాదరించిన 'సాతవాహన'భూపతికొఱకు ఆర్య నాగార్జునుఁడు బుద్ధభగవానుని సుగుణసంపద కంటికిఁ గట్టినట్లు వర్ణించుచు, ఛందోబద్ధమయిన యొక 'సుహృల్లేఖ'

లోనికిని ఆ ప్రాంతముననె యిది 'సింఘవర్మ' చేత ననువదింపఁ బడినది. దీనికి మూఁడవ యనువాదము కూడఁ గలదు. క్రీ. శ. ౬౭౩ ప్రాంతమున 'ఇట్సింగ్' అను ప్రసిద్ధ చీనా యాత్రికుఁడు హిందూదేశమును సందర్శింప నేతెంచి తామ్రలిప్తి నగరమున కరిగినప్పుడు స్వయముగ నతఁడచట దానిని తన మాతృభాషలోని కనువాదము గావించెనఁట. ఇంతటి ప్రసిద్ధమయిన యీ లేఖ మూలము మాత్రము హిందూదేశమున నంతరించి పోయినది. 'సుహృల్లేఖ' యను పేర 'తిబెత్తు' భాషనుండి యాంగ్లమున కనువదింపఁ బడిన యొక పద్యగ్రంథము కలదు. ఇది నాగార్జునాచార్య విరచితమయిన 'సుహృల్లేఖ' కనువాద మగునో కాదో తెలియరాదు.

### అమరావతీ చైత్యము: పేరుపెంపులు

ఆంధ్రవంశ్యులయిన శాతవాహనులలోఁ గొందఱు బౌద్ధ భిక్షువుల నిమిత్తము నాసిక, కార్లి మొదలగుచోట్ల గుహలు తొలిపించి యొసంగి, వారి కనేక దానములు చేసి యుండుటవలన వారి బౌద్ధమతాభిమానము వెల్లడి యగుచున్నది; కాని వీరిలో నాగార్జునాచార్యునికి సమ కాలికుఁడయి, యీ మహాబోధిసత్త్వు నాదరించిన శాతవాహన భూపతి యెవరో యెఱుంగరాక యున్నది. గౌతమీపుత్ర

నాగార్జునుని దివ్య ప్రభావము వలనను బౌద్ధము నాదరించి, బౌద్ధులను బోషించి, మహా చైత్యమునకు భక్తి కానుకలను సమర్పించినారు.

ఆర్య నాగార్జునుని కాలమే ధాన్యకటక బౌద్ధమునకు మేలయిన పూలకారు. ఆ కాలమున నది గొప్ప బౌద్ధ విద్యాపీఠమని వాసికెక్కినది. దేశాంతరములందును, ద్వీపాంతరములందును ధాన్యకటకము పేరు మారుమ్రోఁగినది. తిబెత్తు దేశమునందలి లాసానగరము సమీపమునందుఁ గల 'డూపాంగ్' విద్యాపీఠము దీని యొరవడి మీఁదనే వినిర్మితమయినదని తిబెత్తు దేశ గ్రంథములందుఁ గలదు. ఈ పవిత్ర బౌద్ధక్షేత్ర మెల్లప్పుడు దేశాంతరాగతులయిన బౌద్ధబృందముతోఁ గిటకిట లాడుచు కనులకు విందొనర్చుచుండెడిది.

మహాయానమున పౌరాణిక బౌద్ధ దేవతా సంఖ్య యధికమయి, యా దేవతలకు పూజావిధియు, స్తోత్రాదికములును అతిశయిల్లుటతో మంత్ర, తంత్రాదికములు కూడ తావు కల్పించుకొనినవి. వీనికి మూలము లయిన తాంత్రికాభిప్రాయములు మహాయాన మారంభమున నుండియు అందు అవ్యక్తముగ నుండి కాలక్రమమున సువ్యక్తములయి బౌద్ధ

పనములకు చాల ప్రసిద్ధి కెక్కినదని తిబెత్తుదేశ బౌద్ధగ్రంథములు నుడువుచున్నవి. 'దశవలుఁ' డను బౌద్ధ సాధుపుంగవుఁ డొకఁడు శ్రీధాన్యకటక చైత్యముకడ తంత్రముల నన్నిటిని జేర్చెనఁట. 'మాతృ తంత్ర కాలచక్ర' మీ ధాన్యకటక చైత్యము కడకుఁ జేర్పఁబడినదనియు, నిచట బుద్ధుఁడు కాలచక్ర మనుధ్యానసమాధిని గూర్చుండినచోట 'వజ్రపాణి' యనుబోధిసత్త్వుఁడు దివ్యమయిన రమ్య హర్మ్యమును ఆశ్చర్యకరముగఁ దన మహిమచేత నిర్మించె ననియు తిబెత్తు బౌద్ధగ్రంథములందుఁ గలదు. ఈగ్రంథములయాధారముననే, నాగార్జునుని కిచట 'మహాకాలతంత్రము' లభించినదని తెలియుచున్నది. పూర్వోక్త గాథల యాథార్థ్య మెటులున్నను ధాన్యకటకమునకు తాంత్రికబౌద్ధముతో సంబంధము కలదను విషయము నవి స్థిరపఱుపఁగలవు.

అంతిమదశ

అచిరకాలముననే ధాన్యకటకమున కా మహాదశ తొలఁగిపోయినది. మహాచైత్యము ప్రభ క్రీస్తుశకము నాలుగైదు శతాబ్దులవఱకు వెలిఁగినది. దాని క్షీణదశ కంతట నుండియే మొదలు. ఇందులకుఁ గల కారణము లనేకములు. ముఖ్యకారణము వైదికమయిన బ్రాహ్మణ మత విజృంభణము

సవన దీక్షాప్రవృత్తిఁ గలిగి బ్రాహ్మణ మతమున కాశ్రయమొసంగి బౌద్ధము నుపేక్షించిరి. ఆశ్రయ మొసంగి పోషించు దాత లేక దక్షిణాపథమున బౌద్ధము క్రమ క్రమముగా క్షీణదశకు వచ్చెను.

క్రీస్తుశక మేడవ శతాబ్దియందు చీనా యాత్రికుఁడయిన యువాన్‌చాంగ్ ఆంధ్రదేశమున కరుదెంచి ధాన్యకటకనగరమును సందర్శించునాఁటికే బౌద్ధము దుర్దశ ప్రస్ఫుటముగ నేత్రగోచర మయినది. ధాన్యకటక నగరమున నసంఖ్యములుగ విలసిల్లిన బౌద్ధ విహారరాజము లనేకములు భిక్షు సంఘ పరిత్యక్తములయి, జనశూన్యములయి పాడువారి యుండినవి. ఇరువది విహారములందు మాత్రము బౌద్ధసాంఘికులు నివసించుచుండిరి. వా రయినను వేయిమంది కెక్కువగ లేరు. వీరిలో ననేకులు మహాసాంఘిక బౌద్ధులు. ఒకప్పుడు బౌద్ధమున కాయువు పట్టుగ నుండిన ధాన్యకటక నగరముననే యువాన్‌చాంగ్ సందర్శించు నాఁటికి వంద హిందూ దేవాలయములు ప్రతిష్ఠితము లయినవి; బౌద్ధేతరులయిన పెక్కు మతములవారుకూడ నచటఁ గాన వచ్చుచుండిరి. అప్పటికిని ఆ మహానగరమునకు విద్యాపీఠమను యశస్సు కుంచితము కాలేదు. ఆ నగరమునం దుండిన కాల

## నేఁటిస్థితి

బౌద్ధ మతావసానదశలో తాంత్రికపద్ధతి ప్రబలమయి మహాయానము బౌద్ధనామ మాత్రాంకిత మయిన తాంత్రిక శైవ కల్పమయి, తన విశిష్టలక్షణమును గోలుపోయి క్రమముగ నంతరించినది. నాఁటనుండి ధాన్యకటక 'మహాచైత్యము'నకు పూజావేదికపయి స్థానము లభింపలేదు. క్రీస్తుశకము పదునొకండవ శతాబ్దివఱకు పరిశుద్ధాంతఃకరణముగల జానపదులు భక్తి ప్రేరితులయి దానికి ఎడనెడ పుష్పాంజలులను సమర్పించుచు వచ్చినను మత మనుమబ్బు తెర దిగఁజారిన మీఁదట నది యుత్కృష్ట శిల్పకళాభిజ్ఞత కపూర్వోదాహరణముగ మాత్రమే పొలుపారి, కాల విపర్యయమున శతాబ్దులు గడచి పోవ శిథిలమయి భూగర్భస్థ మయినది. ఇయ్యది క్రీస్తుశకము పదునెనిమిదవ శతాబ్దియందు తుదకు సౌందర్యకళాభిజ్ఞులయిన పాశ్చాత్యుల ద్వారమునఁ దన యస్తిత్వమును బయలు పఱుచుకొని, విశీర్ణములయిన చైత్యశిల్పచిత్రముల రూపమున ప్రాచీనాంధ్ర శిల్పకళాకుశలుల కళా విజ్ఞానమునకు నేఁడు స్మారక చిహ్నమయి యలరారుచున్నది.

ఆంధ్రదేశమున కృష్ణానదీ తీరమునందలి చైత్యాలయ, విహారాది బౌద్ధ ప్రతిష్ఠాపనములు కూడ కాలక్రమమున

వాతి తరముల వారి స్మృతిచంద్రికా ధవళిమయందు 'లం
దిబ్బ'లనుపేర కళంకాంకములుగనే నిలిచి పోయినవి. పూ
పోయిన స్తూపము లోకప్పుడు విహారాంతికమున వెలసిన
యగుటవలన నా స్తూపపు దిబ్బలను గూడ ప్రాంతీయులయి
జానపదు లాపేరనే వ్యవహరింతురు. దీప సహస్రాలంకృ
మయి, బుద్ధదేవుని జయంత్యుత్సవములకును ఇతరబౌద్ధవర్ధ
తులకును దేశాంతరముల నుండియు, ద్వీపాంతరముల నుం
యు వేలకొలంది బౌద్ధ భక్తబృందము నాకర్షించుచు, సయ
పర్వముఁ గావించుచుండిన యీ మహాచైత్యము విలసిల్లి
క్షేత్రము ఆమహా విభూతి యెల్ల హరించిపోవ 'దీపాలదిన్నె
యను నామమును మాత్రమే పరిశిష్టముగ నిలుపుకొని 'బ్ర
చెడ్డయాంధ్రుల పూర్వవైభవంబు' ననేకశతాబ్దులనుండి కన్
రు మున్నీరుగ వర్ణించు మహావాహిని కృష్ణవేణీస్రవంతితో
శ్రుతికలిపి నేఁటికిని హృదయవిదారణముగ విషాదగీతి నా
పించుచునే యున్నది.

## ఆకృతి, శిల్పములు

ఆధునిక కాలమున అమరావతీస్తూపము పేరు ప్ర
ష్ఠలు అందలి శిల్ప చిత్రముల యోగ్యతవలననే దిగం
విశ్రాంతము లయినవి. ఆంధ్రులకు కీర్తి సముపార్జించి పెట్టి

ఇంచు మించుగ వృత్తాకారముగల పెద్ద వేదిక (Basement), త దుపరితలమున అర్ధగోళాకారముగల యండ డము (Dome), దానిమీఁద హర్మిక (Pavilion), దానిపయిని కేతనవిరాజితమయిన దండాంచిత చ్ఛత్రము అనెడి యంగములతోఁ గూడిన సంపూర్ణ నిర్మాణమే ధాన్యకటక చైత్యమని, అమరావతీ స్తూపమని విఖ్యాత మయినది.

వేదికమీఁద అండ నిర్మాణమునకు నాలుగు వైపుల యందును 'ఆయక' స్తంభము లనుపేర అయిదేసి స్తంభము లుండెడివి. ఈ స్తంభములమీఁద వెలుపటివైపు దిగువ భాగమున స్తూప, ధర్మచక్ర, బోధివృక్ష చిత్రము లుండును. అమరావతి, భట్టిప్రోలు, జగ్గయ్యపేఁట, ఘంటశాల స్తూపములందు మాత్రమే కాని యుత్తర హిందూస్థానమునందలి యే స్తూపము లందును ఇవి కానరాకపోవుటచేత 'ఆయ్యక' స్తంభ ప్రతిష్ఠాపనము ఆంధ్రదేశమునందలి బౌద్ధస్తూపముల విశిష్ట లక్షణమని సిద్ధాంత మయినది.

వేదికకు చుట్టును 'శ్రీవీథి' యను పేర ప్రదక్షిణవీథి యుండెడిది. ఈ వీథి నావరించి నిలువు జాతికంబములతోను, వీనిలోని కెడనెడ నడ్డముగఁ జొనిపిన జాతి కమ్ములతోను నిర్మించిన కట్టువవంటి శిలా ప్రాకారము కలదు. ఆర్యనాగారునునిచేత నిర్మితమయినదని పరికీర్తిత మయిన ప్రాకారమే

ఱాతి దూలములతో మనుగవలె నేర్పడిన భాగమునకు 'ఉష్ణీష' మని పేరు. సూచీ స్తంభోష్ణీషములు అతిమనోహర మయిన దివ్య చిత్ర సంపదతో నొప్పారినవి. ప్రాకార రేఖయందు నాలుగు దిశల నాలుగు ద్వారములు కలవు.

మాయాదేవి స్వప్నము, బుద్ధుని జననము, మహాభినిష్క్రమణము, మృగదావమునందలి బుద్ధుని మొదటి ధర్మబోధ, మారప్రలోభకథనము, బుద్ధధాత్వారాధనము అనెడి బుద్ధవృత్తములు బౌద్ధులకు ప్రియతమములగుట నేమో యవి యమరావతీస్తూపమున పలుమాఱులు చిత్రితము లయినవి. స్తూపముమీఁదఁ జిత్రింపఁబడిన జాతకకథలలో మిగుల హృదయాకర్షకములుగఁ బేర్కొనఁదగినవి 'ఛద్దంత', 'వెస్సంతర' కథలు.

చలువఱాతిమీఁదఁ జిత్రితమయిన యీ శిల్పసంపదను సూక్ష్మముగఁ బరిశీలించినచో చతురులయిన బౌద్ధయుగమునాఁటి యాంధ్ర శిల్పకళావిశారదుల చేతిలో నా చలువరాయి తన కాఠిన్యమంతయు వీడి మెట్లు తీర్చిన నట్లు చక్కనగు మయినపు ముద్దగ మాఱినదని తోఁపక మానదు. క్రీస్తుశకము ప్రాథమికశతాబ్దులందు బౌద్ధమత మాంధ్రదేశమున బాగుగ ప్రబలిననాఁటి ఆంధ్రుల యాచార వ్యవహారములు, దుస్తులు, ఆభరణములు మొదలగు వానిని

విభూతికి సూత్రములు పన్నిన ప్రాచీనాంధ్రశిల్పాచార్యులు రచియించిన కృతుల గొప్పదనమునకు అమరావతి, జగ్గయ్యపేట, నాగార్జునునికొండ మొదలగుచోట్ల బయలు పడిన స్తూపములందలి భగ్నశిథిలశిల్పశకలములై నేడు నిదర్శనములుగ నున్నవి.

---



అమరావతీస్తూపము : ప్రాకారోష్ణీషశిల్పము

# ప్రాచీన వృత్తివిద్యావిధానము

పూర్వము వేదములు, శాస్త్రములు మొదలగు వైదికవిద్య లన్నియు బ్రాహ్మణ క్షత్త్రియ వైశ్యు లను ద్విజుల యధీనమున నుండెను. మిగిలిన విద్యలు, అనఁగా కమ్మరము, కుమ్మరము, కంచరము, నగలు నాణెములు చేయుట, ఇండ్లు మిద్దెలు మేడలు కట్టుట, వంతెనలు కట్టుట, చెఱువులు త్రవ్వుట, దేవాలయములు గోపురములు నిర్మించుట, రథములు బండ్లు చేయుట – ఈ మొదలగున వన్నియు ద్విజేతరుల యధీనమున నుండి, వారి పారిశ్రామిక విద్యల కధికారులుగ నుండిరి.

వృత్తివిద్య, కులములు

ఒక్కొక్క వృత్తి నవలంబించువారు కుల మను పేర నొక్కొక్క సంఘముగా నేర్పడిరి. ఇప్పటి కులములు సాధారణముగ వృత్తుల ననుసరించి యేర్పడినవే. ఒక్కొక్క కులమువారు ఒక్కొక్క విద్యను కాపాడి పోషించుచు వచ్చిరి. అందువలన నీ విద్యలకు కులవిద్య లనియు, వేలువేలు వృత్తులకు సంబంధించిన వగుటచేత వృత్తివిద్య లనియు పేరు. ఈ విధమైన విద్యనే ఇప్పుడు సాంకేతికవిద్య (Technical Education) అనుచున్నారు.

నిప్పటివలె కళాశాలలు కాని, విద్యాలయములు కాని యుండె డివికావు. నిపుణులైన వృద్ధులు తమ కర్మశాల (Work shops) లందే తమ తమ కులములందలి బాలురకు విద్యా ప్రదానముఁ గావించువారు. అందువలన నట్టి బాలురు నేర్చువిద్య స్వానుభవముతోఁ గూడినదగుట వారికిని, ప్రపంచమునకు నుపయోగపడునట్టిదిగ నుండెను. వృత్తివిద్య నేర్చుకొను విద్యార్థి తన వినయ విధేయతల వలనను, వృత్తియందలి భక్తి శ్రద్ధల వలనను తన గురువు మనస్సు రంజించి ఆతనిని మెప్పించినచో ఆతని వివేకమును, శ్రద్ధను, ఆసక్తిని పరీక్షించి ఆతఁడా విద్యార్థికి ఆ వృత్తి విజ్ఞాన రహస్యముల నుపదేశము చేయువాఁడు. అందువలన వృత్తివిద్యాభిమాని దీక్షవహించి యొడలు వంచి వినయవిధేయతలతో పనిచేసి తన గురువును మెప్పింపఁ జూచువాఁడు. విద్యార్థి ఏమాత్రము విద్య నేర్చుకొనినను అది స్వానుభవపూర్వకముగ పడసిన దగుటచేత తన జీవయాత్ర సుఖముగఁ గడపుకొనుట కతనికి తోడ్పడుచుండెను. ఏ వృత్తియందైననుసరే నిపుణులైనవా రెచ్చటనున్న నచ్చటి కేగి విద్యార్థులు విద్య నేర్చుకొనుచుండువారు. తండ్రియొద్ద కొడుకు విద్య నేర్చుకొనినను, అన్నయొద్ద తమ్ముఁడు నేర్చుకొనినను, నేర్చుకొనునంతకాలము బంధు భావముతోఁ గాక గురుశిష్యభావముతోనే వారు

వదలి బంధుసరళిని మెలఁగువారు. హిందువులది సమ
కుటుంబము గనుక కర్మశాలలో తండ్రి యిచ్చిన జీత
కొడుకును, అన్న యిచ్చిన వేతనము తమ్ముఁడును ఇం
వచ్చినపిదప కుటుంబధర్మము ననుసరించి వారి వారికి ని
వేయువారు. ఈ విధమున వృత్తివిద్య లన్నియు పూర్వ
తండ్రివలననుండి కొడుకునకు, అన్నవలననుండి తమ్మునకు వ
పారంపర్యముగ వచ్చుచుండెడివి. ఒక్కొక్క కులమువా
తమ కులవిద్యనే కాని యితరములను నేర్చుకొనరాదను క
బా టుండెడిది. తన కులవిద్యను విడిచి ఇతర కులవిద్య
చేపట్టుట కులద్రోహముగ పరిగణింపఁబడుచు వచ్చె
స్వధర్మమే శ్రేయోదాయకము; పరధర్మము భయావ
ము; ఆచరణాయోగ్యము. ఇట్టి నమ్మకము ప్రబలమ
వ్యాపించియుండుటచే

వెలివిద్య లెన్నియైనను
గులవిద్యకు సాటిరావు కుంభినిలోనఁ
వెలకాంత లెంద ఱున్నను
గులకాంతకు సాటిరారు గువ్వల చెన్నా!

మున్నగు పద్యములు పుట్టుటకు కారణ మయినది. ఇట్లు
గూ కులములవారు తమ తమ కులముల కేర్పడిన విద్యల
ప్రాణతుల్యముగ నెంచి పోషించుచు వచ్చిరి. అట్టి
ప్రాచీన కులజుల కుటీరములే వృత్తివిద్యాలయము

ప్రపంచ మంతటఁ బేరుపడిన వస్తుజాలమును తయారుచేసి హిందూదేశపారిశ్రామికుఁడు ఖండాంతరులవలనఁగూడ సంస్తుతులను బొందె, పల్లెటూరియందలి తన చిన్నికుటీరము ముందు తనవృత్తి విద్యా నైపుణ్యమునకు దర్పసూచకముగ విజయస్తంభమును పాఁతి కీర్తిపతాకము లేవనెత్తినాఁడు.

వృత్తు లెన్నో మనదేశమున సాధారణముగ కుటీర పరిశ్రమ లన్ని కలవు. వీనిని నడపునది జీవము లేని యంత్రములు గాక బుద్ధి వైభవమును, ప్రతిభాసంపదయుఁ గల దివ్యచైతన్యాంశాసంభవుఁడగు మానవుఁ డగుటవలన అవి పారిశ్రామికకళలై పరిఢవిల్లినవి. హిందూదేశ పరిశ్రమలను గుఱించి యిచట వ్రాయుట అనవసరము.

### కులసభలు, నిధులు

స్వధర్మసంరక్షణమునకై ఈ కులములకు కులసభలును, పంచాయతులు నుండెడివి. హిందూధర్మశాస్త్రములుకూడ ఆయాకులములకు సంబంధించిన వివాదములను పరిష్కరించు పద్ధతి కులసభలకే వదలిపెట్టి వానిని గౌరవించినవి. పూర్వపు ధర్మశాస్త్రకారులకు ఈ వృత్తులయం దెంతటి గౌరవము కలదో ఈ విధమైన ధర్మశాస్త్ర నిబంధనములను గాంచినఁ దెలియఁగలదు. కులసభలుమాత్రమే కాక ప్రత్యేకము ఇప్పటి 'బ్యాంకు'లవంటి కొన్ని నిధు లుండెడివి. రాజులు మొదలగు

తాము దానము చేయఁదలఁచినదాని విలువకు సరిపోయిన వడ్డీ నొసంగు మూలధనమును ఆ కులమువారి నిధి కొసంగువా రు. ఈ పద్ధతి వలన రెండు లాభములు కలుగుచుండెను: (౧) ధర్మము ఆచంద్రార్కస్థాయిగ సాగుట, (౨) మూలధనము వలన నా పరిశ్రమ అభివృద్ధిఁ గాంచుట. ఈ విధమైన నిధులు నిబంధనములు క్రీస్తుశకారంభకాలమునకే, అనఁగా ఆంధ్ర రాజులు పాలించునాఁటికే కలవు. అప్పటికే ఆయా వృత్తి సంఘములు (Trade unions) చక్కని వికాసము నొంది అభి వృద్ధిఁగాంచినవి.

ప్రతి వృత్తియు చాల గౌరవప్రదమైనదిగ నెన్న బడుచుండెను. ప్రాచీన హిందూగ్రామ వ్యవస్థను పరికించి నచో ప్రతివృత్తికి నుచితస్థాన ముండినట్లు సువ్యక్త మగును వ్యవసాయకపు జాతి యగుటచేత హిందువులు ముఖ్యముగ నూటికి తొంబదితొమ్మిది వంతున గ్రామములందే ని సించువారు. హిందూసంఘ పరిపాలనమున కేమి, మఱి యితరవిషయముల కేమి, పూర్వము - పూర్వమే యననేల ఇప్పటికి - గ్రామమే ప్రాతిపదిక. హిందూదేశము నంతన కంపింపఁజాలు ఏవిద్యుత్సంచలనము కలిగినను అది గ్రామము నుండియో ప్రాదుర్భవించుచుండెను. ఏ సంస్కర్త కాని, రాజకీయ తంత్రజ్ఞుఁడు కాని పూర్వము ప్రకృతియొుడియుండి

దుర్గమునునైన గ్రామమున 'కులపతి'యైన పారిశ్రామికుఁ డుచితస్థానమును సంపాదించెను.

## వైదికవిద్య, వృత్తివిద్య

బ్రాహ్మణుఁడు తన వశమున నున్న వైదికవిజ్ఞానమును ప్రజల కొసంగినను పారిశ్రామికుఁడు లేనిచో నిలువ నీడ యుండునా? భోజనాదికము లమర్చుకొనుట కుపకరణములును సాధనములు నుండునా? పారిశ్రామికవిజ్ఞానము లేనిచో ఆధ్యాత్మికవిజ్ఞాన ముండియు సంఘ మభివృద్ధి నొందఁజాలదు. ఆధ్యాత్మికదృష్టి లేని పారిశ్రామికవిజ్ఞానము అపాయకరము. ఆధ్యాత్మిక, పారిశ్రామిక విజ్ఞానములం దేది కొఱవడినను రెండవదానికి ప్రశస్తి లేదు. పారిశ్రామిక విజ్ఞానము సుందరమును, హృదయాకర్షకమునైన నాగరకతను సృష్టించుచుండ ఆధ్యాత్మిక విజ్ఞానము దానికి తేజస్సు నొసఁగి ప్రాణము పోయుచున్నది. హైందవ నాగరకత యంతయు పల్లెటూరి పారిశ్రామికుని చిన్ని కుటీరమునుండియు, నిరాడంబరజీవియు వైదికవిద్యాసంపన్నుఁడునైన బ్రాహ్మణుని పర్ణశాల నుండియు పెరిఁగి పెంపుఁగాంచినది. ఈ రెండు విధములైన జ్ఞాన విభాగములకుఁ గల యన్యోన్యసంబంధమును గుర్తెఱింగినది గనుకనే మన ప్రాచీనగ్రామ మీరెంటికి ప్రధానస్థాన మొసంగి సఖ్యత సమకూర్చినది. ప్రాచీనగ్రామవ్యవస్థయందు

నమును సమన్వయముచేసి నేటి పారిశ్రామిక సమస్య
దానికి సంబంధించిన యితరములైన చిక్కులను 'ఆధు
నాగరకత' కన్నులు తెఱవకమునుపే చక్కగ పరిష్కరి
నది. పారిశ్రామికునికి గ్రామవ్యవస్థలో 'వృత్తి' రూపమ
స్థాన ముండుటచే వృత్తివిద్య కెట్టి యాదరణ ముండెడి
తెలియఁగలదు. పూర్వము బ్రాహ్మణుఁడు, పారిశ్రామికుఁడు
పీ రిరువురును హిందూసంఘమునకు రెండు కన్నులవలె ను
పరస్పరము సహానుభూతిని గలిగియుండుట నేర్చుకొని, ఆ
త్మికవిద్య కధికారులై ఉన్నతాదర్శములను జూపి మ
వునియందలి దివ్యసంపదను దోహదముచేసి యొక్కరు
ఆధిభౌతికవిద్య కాచార్యులై సౌందర్యరసపరిప్లుతములగు క
రచనములను గావించి జీవితమును సౌఖ్యానంద సంభరిత
గావించి మఱియొక్కరును సంఘమును నడిపించి దేశమ
పరిపాలించువారు.

'భటవృత్తి' మాన్యములు, గ్రామవ్యవస్థ

ప్రతిగ్రామమునను కమ్మరి, వడ్రంగి, కంసాలి వె
లగువారి కందఱకు 'వృత్తు'లనుపేర వృత్తిమాన్యము లు
డివి. గ్రామము ఏర్పాటగునప్పుడే ఈవృత్తు లేర్పడుచు
డివి. గ్రామజీవనము పరిపూర్ణ మయి సరళముగ న
పోవుట కవసరమైన యీవృత్తులవారు ముండుటవల

కాపాడువారు. కావుననే వారి కేర్పడిన మాన్యములకు 'భటవృత్తి మాన్యము' లనియు, 'జాతికట్టు మాన్యము' లనియు పేరు కలిగెను. పూర్వము గ్రామమే కాక యందలి దేవస్థానముకూడ వారికి మాన్యము లిచ్చి గౌరవించి పోషించుచుండెడిది. దక్షిణదేశమున నేక్షేత్రము ప్రసిద్ధికెక్కిన దేవాలయమున నైనను కమ్మరి, కుమ్మరి, కాసె (తాపీపని) వాఁడు, వడ్రంగి, స్వర్ణకారుఁడు మొదలగువార లెల్లరు నుండువారు. ఇట్లు మహాసంస్థయైన గ్రామమును, అందలి ఉపసంస్థయైన దేవస్థానమునుగూడ గొప్ప పారిశ్రామిక శాలలుగ నుండుటయే కాక ఆయావృత్తులవారికి తమతమ విద్యలలోఁ నారితేరుటకును, చేయితిరుగుటకును ప్రాథమికాభ్యాసశాలలుగఁగూడ నుండెడివి.

ఆయా వృత్తులవారు వారి వారి వృత్తివిద్యలయందు నిపుణు లగుటకు గ్రామవ్యవస్థ ఈవిధమున నవకాశ మిచ్చుచుండ ధనికులు, సామంత మండలేశ్వరులు, రాజులు మొదలగువారు నూతులు త్రవ్వించియు, చెఱువులు కట్టించియు, గుళ్ళుగోపురములు నిర్మించియు పనివాండ్రకు తమ పనితనముఁ జూపుట కవకాశ మిచ్చి ఆదరించువారు. పనివాఁడు తన పనితనముఁ జూపి తన కృతిప్రేరకుని మెప్పించినచో అతఁడు

ఇట్లు 'మాన్యము'ల నొసంగి యాదరించుటయే కాక వారి
పనితనమును మెచ్చుకొని కళాప్రియులైన ప్రభువులు సాం
ఘికముగ వెనుకఁబడియుండు వారికి కొన్ని కొన్ని స్వాతంత్ర్య
మర్యాదలనుగూడ నొసంగి క్రమక్రమముగ సంఘమున వారి
పరపతియు, గౌరవ మర్యాదలును హెచ్చునట్లు చేయువారు
ప్రాచీనశాసనావళిని గాంచినచో మన కట్టిశాసనములు కొన్ని
కానఁబడును. ఇట్లు వృత్తివిద్యావిశారదులవలన ఆయా కుల
ములకు హిందూసంఘమున గౌరవము హెచ్చుచు వచ్చెను
ఆయాకులములకు ప్రాణరక్షవలె నుండిన విద్యావంతులు దేశ
మును సౌభాగ్యవంతముగ దిద్దుటకై తమమేధాశక్తిని
ప్రతిభాసంపదను వినియోగించువారు.

పంచాణమువారు, వారిపనితనము

లలితములైన పారిశ్రామిక కళలను పోషించి, కాపా
దేశమునకు సౌభాగ్య సౌందర్యముల నొడఁగూర్చినవారి
ఈపారిశ్రామిక జాతులవారే. వీరిలో 'పంచాణము'వారి
అనఁబడు విశ్వకర్మవంశజులు ముఖ్యులు. బ్రహ్మకుమారుఁడై
విశ్వకర్మకు అయిదుగురు కొడుకులు కలరు. వారైదుగు
(౧) కమ్మరము, (౨) వడ్రంగము, (౩) కంచరము, (౪
శిల్పము, (౫) స్వర్ణకారకము (కుందనపుఁబని) అను నయిది
వృత్తులకు కారకులైరి. ఈయైదువృత్తులవారికి 'ఐదాయ

చుగఁ గన్పట్టును. తామ్రశాసనములనుగూడ వీరే చెక్కువారు. కళింగగాంగుఁడగు మూఁడవ వజ్రహస్తుని దానశాసనముల యుత్కీర్ణకులలో మహాతక్షశాలులు మేంటోజు, సూకమోజు, వల్లేనోజు ననువారు కలరు. ఉపాధ్యాయుఁడని యర్థమిచ్చు నోజ్ఝరూపాంతరమైన ఓజపదమే ఓజుగా మాఱినది.

గుంటూరు మండలమునందలి పల్నాటి తాలూకా మాచెర్ల గ్రామమున ఆదిత్యేశ్వరాలయమునందున్న శాసనములలోఁ గొన్ని యీవిశ్వకర్మకులజుల ప్రశస్తిని తెలుపుచున్నవి. ఆశాసనములందు పేరెన్నికఁగన్న విశ్వకర్మ వంశోద్భవులైన కొందఱాచార్యులు పేర్కొనంబడియున్నారు. వారు శివలింగములను మలఁచుటలోను, విగ్రహములను చెక్కుటలోను, చతుర్విధప్రాసాదాదులను నిర్మించుటలోను, వాస్తుశాస్త్రమునకు సంబంధించిన జ్ఞానమునందును ప్రజ్ఞావంతులని సంస్తుతింపఁబడిరి. మఱియొక శాసనము వీరిని 'దశక్రియా'పరిజ్ఞాత లని పొగడుచున్నది. నగర, గ్రామ, దుర్గనిర్మాణములు, జలనిర్గమనాగమనాదినిర్మాణములు, దేవాలయ గోపుర తటాకాది నిర్మాణములు మొదలగు వానియందు వీరు ప్రవీణులై దేశముయొక్క కళాసంపదను పెంపొందఁజేసిరి. ఎల్లోరాగుహాలలోని కైలాససౌధాదులు, మా

వచ్చిన శిల్పకళ నెంత భద్రముగ కాపాడి, దాని నెంత చక్క
వినియోగమునకు తెచ్చిరో వెల్లడించు మహోత్కృష్ట
నిదర్శనముగ నున్నది. ఇప్పటికి నిపైనుపేర్కొనిన నిర్మాణములం
శిల్పకళాకౌశలమును జూచి, యానందించి తలయూపనివా
లేడు. అట్టిది ప్రాచీనార్యసంప్రదాయమున పెరిగి కులవిద్యా
పారంగతులయిన విశ్వకర్మకులజుల యుత్కృష్ట కళాకౌశలము

### శిల్పకళాగౌరవము, చారిత్రకోదాహరణములు

సిద్ధహస్తులైన యిట్టిశిల్పాచార్యులను స్వమతస్థులే కా
మతాంతరులయిన శత్రువులుకూడ గౌరవించి పురస్కరించ
చుండువారు. హిందూదేశైశ్వర్యము నపహరించుటకై పెక్కు
తడవలు దండయాత్రలు సలిపిన సుల్తాను ఘజనీ మహమ్మ
హిందూవిగ్రహములను అసహ్యించుకొనినను వానిని, వా
కొలుకు ఆలయములను తయారుచేయుటలో హిందూశిల్పు
చూపిన కళానైపుణ్యమునకు ఆశ్చర్యవిముగ్ధుడై డెందము
వాడు. మథురానగరమును ముట్టడించినపిదప, ఆనగరమ
నందలి భవనములయొక్కయు, నగరముయొక్కయు సు
తను పొగడుచు సుల్తాను ఘజనీ నగరమునందలి తన ప్ర
నిధి కుత్తరము వ్రాసినట్లు మహమ్మదీయ చరిత్రకారుడై
ఫెరిష్టా తెలిపియున్నాడు: "మహమ్మదులవారి మత
వలెనే సుస్థిరమైన వేలకొలది దివ్యభవనము లిచట కల

సంవత్సరములలో నైనను మరల నిట్టినగరమును నిర్మించు
టకుఁ గాదు''అని సుల్తాన్ మహమ్మదు వ్రాసెనఁట. సుల్తాను
ఘజనీకి మరలి వెళ్ళినప్పుడు ౫౩,౦౦౦ ల మంది హిందువులను
ఖైదీలుగఁ గొనిపోయెను. వీరిలో చాలమంది శిల్పులు, వృత్తి
విద్యానిపుణులు నుండియుందు రనుటకు సందియములేదు ;
ఏలయన, గాంధార దేశమునందలి సుల్తాన్ మహమ్మదు
రాజధానియైన ఘజనీయం దున్నన్ని ప్రాసాదములు, దివ్య
భవనములు, జలాశయములు, కేళీగృహములు, మండప
ములు మొదలగునవి ప్రాగ్దేశనగరరాజములందు వేనియం
దును గానరా వనియు, వీని నన్నిటిని నిర్మించినవారు హైం
దవశిల్పులే యనియు తెలియుచున్నది. క్రీస్తుశకము పదు
నాలుగవ శతాబ్ది కడపట, తైమూరు హిందూదేశముపై
దండెత్తివచ్చి ఢిల్లీనగరమున లక్షలకొలఁది జనులను దారుణ
వధపాలుచేసి, పిదప చాలమందిని ఖైదీలుగ పట్టుకొనెను.
వారిలో శిల్పులు మొదలగు కళాకుశలు లెంద ఱుండిరో
లెక్కవేయించి, వారిని తనరాజధానియైన 'సమర్కాండు'
నకుఁ గొనిపోయి, వారిలో చాల ప్రవీణులయిన
వారిని కొందఱి నచ్చట నొకమసీదు కట్టించుటకు తనయా
స్థానమునఁ దనయాశ్రయమున నుంచుకొని మిగిలినవారి
నందఱిని తన సామంతరాజులకు అధికారులకు నొప్పగించి

దృష్టిని పగఁబూని హిందూవిగ్రహములను, హిందూదేవాలయములను భగ్నముచేయుచు వచ్చినను కళాకుశలుల శిల్పకౌశలమును మెచ్చుకపోలేదు, మెచ్చి వారి నాదరింపకపోలేదు. ఇంతయేల, శత్రురాజులు హిందూదేశముపై దండెత్తి వచ్చినపుడు వారి శిల్పకళారచనములను జూచి ముగ్ధులై అట్టి శిల్పవిద్యావాచస్పతులను తమతమ దేశములకుఁ గొనిపోయి గౌరవసమ్మానము లొసంగి వారిశిల్పకళారచనములకు ప్రోత్సాహ మిచ్చియున్నారు. అందువలన హైందవశిల్పకళ దేశదేశములకు బ్రాఁకి అచ్చటచ్చట వలసల నేర్పాటు చేసికొనెను. తుదకు అత్యంతరమణీయమైన దని పేర్వడసిన బాగ్దాదునగరమును కట్టినదికూడ హైందవశిల్పులే యని కొందఱు చరిత్రపరిశోధకుల యభిప్రాయము.

దేశీయప్రభువుల కళాభిమానము

శత్రురాజుల మాట యట్లుండ దేశీయులైన రాజాధిరాజులు కూడ కళల నాదరించి యుండి రనుటకు పెక్కు నిదర్శనములు కలవు. అట్టి వొకటి రెండు నుడివినఁ జాలును: "అశోకవర్ధనుని కాలమున శిల్పు లొకవిధముగ రాజకొలువులోనివారుగనే పరిగణింపఁబడుచుండిరి. చేతులు పోఁగొట్టి కాని, కళ్ళు పోఁగొట్టి కాని......వృత్తివిద్యా విశార

దురు. వడ్రంగులు, కమ్మరులు మొదలగువారిని రాజే ప్రత్యేకము కనుఁగొనుచు వారి పని పరిశీలించుచుండువాఁడు. ఢిల్లీపాదుషాయైన అక్బరు కొలువులో పెక్కురు కళాకుశలులు, వృత్తి విద్యానిపుణులు నుండువారనియు, వారి రచనములలో అత్యుత్తమములైన వానికి ప్రత్యేకబహుమానముల నొసంగి పాదుషా వారిని గౌరవించుచుండువాఁడనియు అతని మంత్రియయిన 'అబుల్ ఫాజల్' 'అయిని అక్బరి' అను గ్రంథమున వ్రాసియున్నాఁడు.

కర్ణాట సార్వభౌముఁడైన కృష్ణదేవరాయలు ఉదయగిరి దుర్గముపై దండెత్తివెళ్ళి దానిని పరిపాలించుచుండిన గజపతిరాజులను జయించి యాకోటయందలి యొక దేవాలయమున నున్న యత్యంతసుందరమైన బాలకృష్ణవిగ్రహమును పెల్లగించి నిజరాజధానియైన విజయనగరమునకుఁ గొనిపోయినట్లు చారిత్రకప్రమాణము కలదు.

ఈపై నొసంగిన యుదాహరణములను పరిశీలించినచో దేశీయులైన నేమి, విదేశీయులైన నేమి ప్రభువు లగువారు ఇట్టి విద్యావంతులను ఆదరించి గౌరవించి, శిల్పమును పోషించువారనియు, పరరాజులు దేశమును జయించినప్పుడు చతురులైన శిల్పాచార్యులను, తద్విరచితములైన కళాకావ్యరచనములను తమ దేశమునకుఁ గొనిపోయి తాము జయిం

నేమి, హైందవేతరులైన నేమి, పూర్వులకుఁ గల కళాభిరతి
సహస్రకంఠముల నుచ్చైస్స్వనమున నుద్ఘోషించుచున్నవి
అరితేరి సిద్ధహస్తులైన శిల్పులు, స్థపతులు మొదలగు కళా
కుశలులు దేశమునకు కీర్తితెచ్చు నలంకారములు. వా
దేశము సంపద. లలితకళాసంపద, శిల్పకళా విజ్ఞానము లే
దేశము దేశమే కాదని మన పూర్వులు భావించియుండినట్లు
పూర్వోక్త విషయములవలన విశద మగుచున్నది. తుదకు
పదునాఱు, పదునేడు, పదునెనిమిది శతాబ్దులందు తంజావూ
రు, మధురానగరములు రాజధానులుగ పరిపాలించిన నాయ
కరాజులు కూడ సుప్రసిద్ధులైన శిల్పాచార్యులను పోషించి
కళలను వృత్తివిద్యలను ఆదరించి రనుటకు వారికాలము
నిర్మింపఁబడిన గొప్పగొప్ప దేవాలయాదినిర్మాణములే తా
ణము. విజయనగరాధిపతుల కాలమునను, తంజావూ
మధుర నాయకరాజుల కాలమునను హిందూదేవాల
శిల్పము అత్యంతోన్నతస్థితికి వచ్చినది. ప్రజ్ఞాఢ్యులయి
యా కాలపు శిల్పుల రచనములు నేఁటికిని చెక్కు చెదర
చూపఱకు వాని రచనామాధుర్యమునకు ఆశ్చర్యమున
నేఁటి కళాదైన్యమునకు విషాదమును గలిగించుచున్న

ఈసంగతుల నన్నిటినిబట్టి చూడఁగా పూర్వము ప్రభు
రేణువులు అగ్రహారముల నొసంగి వైదికవిద్య నెట్లాద

బ్రాహ్మణునిహస్తమున మతవిద్య కెట్టి యాధ్యాత్మికపు తీర్పు కలిగెనో అట్లే కుటీరవాసియు, నిరుపేదయు, నమాయకుఁడు నైన పారిశ్రామికుని చేతిలో వృత్తివిద్యయు కళాకుసుమముగ వికసించి దశదిశలఁ దన నెత్తావిని విరజల్లి సర్వజనానంద సంధాయకమై విరాజిల్లెను. అంతటియౌన్నత్యదశ నందిన యీ రెండు విధములగు విజ్ఞానవల్లరులకు గ్రామమే యాలవాలము; ప్రాథమిక క్రీడారంగము. పల్లెటూరి పారిశ్రామికుఁడు తన కర్మశాలలో వెలిఁగించిన యీ విజ్ఞానరత్నదీపము దేశాంతరములనుగూడ ప్రకాశవంతము చేసి, సౌందర్యరససృష్టికి పరమావధి యయినది. అట్టిది మన పూర్వపు వృత్తివిద్య. అంతటి నిరాండబరమైనది తద్విద్యావిధానము; అంతటి యుత్కృష్టమైనది దాని ఫలితము.

# మన ప్రాచీన విద్యా సంస్థలు

మనపూర్వపు విద్యాపద్ధతి యిప్పటి విద్యాపద్ధతికంటె నుత్తమమైన దయినను కాకపోయినను అశోక, కృష్ణదేవ రాయ, శివాజీలవంటి ప్రభుపుంగవులును, యుగంధర, తిమ్మరసాదులవంటి మంత్రివరేణ్యులును, కాళిదాస, భవ భూత్యాదులవంటి కవివతంసులును, నాగార్జున, శంకరా చార్యాదులవంటి మతసంస్కర్తలును విలసిల్లుటకు కారణ భూతమై, జాతీయాభ్యుదయమునకును, వాఙ్మయవికాసమున కును, దేశీయపురోభివృద్ధికిని దోడ్పడి, హైందవవిజ్ఞాన కాంతి కిరణములను నలుదెసలఁ బ్రసరింపఁజేసి, భారతజాతి కఖండ గౌరవప్రతిష్ఠలను సముపార్జించి పెట్టిన దగుటచేత నది సంస్తుతి పాత్రమును, చిరస్మరణీయమూర్తమును గాకపోదు. అందువలన రమారమి రెండువేల యేండ్లు మన జాతీయహృదయమును పూర్తిగ వశపఱుచుకొని, ఐహికాముష్మిక సుఖములకు దారి చూపిన మన పూర్వకాలపు విద్య ఎచ్చటెచ్చట నెట్లెట్లు వర్ధిల్లినదియు తెలిసికొనుట యుక్తము.

మన దేశచారిత్రము బౌద్ధయుగమున ఆరంభ మగు చున్నది. బౌద్ధయుగమునకు పూర్వపు విద్యాసంస్థలనుగుఱించి మనకు బాగుగ తెలియదు; కాని వేదకాలమున పరిషత్తు లుండెడి వనియు, అచ్చటికి బహుశాస్త్రవేత్తలు, వేద

గురువు శిష్యునికి వాగ్రూపముననే విద్య నేర్పుచుండె ననియు, గురువు నేర్పినదానిని శిష్యుఁడు కంఠస్థము చేయువాఁ డనియు మాత్రము మనకు తెలియును. అదియునుం గాక ద్విజులు మాత్రమే విద్య నభ్యసించువా రని కూడ మన మెఱుంగుదుము.

బౌద్ధయుగము

కాని సర్వవర్ణములవారికి అందుపాటులో నుండని యీ విద్యాపద్ధతికి బౌద్ధయుగమునఁ గొంత మార్పు కలిగెను. ఈ వర్ణ మావర్ణ మనక యెల్ల వర్ణములవారును బౌద్ధమతమున చేరుట కవకాశము కలిగినట్లే బౌద్ధవిద్యాపీఠములలో విద్య నేర్చుకొనుటకుఁగూడ మంచి యవకాశములేర్పడినవి. ఈ కాలముననే గొప్ప గొప్ప విద్యాపీఠములు వెలసినవి. ఆ విద్యాపీఠములలో భరతఖండమునందలి సర్వవర్ణములవారు మాత్రమే కాక దేశాంతరవాసులుకూడ వచ్చి విద్య నభ్యసింపఁజొచ్చిరి. ఉత్తరహిందూస్థానమునఁ బేర్వడిన తక్షశిల, నాలంద, ఓదంతపురి మున్నగు గొప్ప విద్యాపీఠములు ఈ బౌద్ధయుగమున విరాజిల్లినవియే.

దక్షిణాపథమునఁ గూడ బౌద్ధయుగమే సమస్త కళలకు నుత్తేజన మిచ్చిన కాలము. అయినను అచ్చట నీ కాలమున విలసిల్లిన విద్యాపీఠములనుగుఱించి మనకు

కళాభిరుచిని దెలుపు గొప్ప యుదాహరణములుగ నిలిచి యున్నవి. ధాన్యకటకము, వేఁగి, కాంచీపురము, శ్రీశైలము - ఇవి యా కాలమున పేరొందిన విద్యాపీఠము లని తెలియ వచ్చుచున్నది.

శాతవాహనవంశజు లాంధ్రదేశమును పరిపాలించుచుం డిన కాలమున కృష్ణానదీతీరస్థమైన ధాన్యకటకము దక్షిణా పథనగరరాజముల కవతంసమై యలరారినది. ఇప్పుడు దానిని ధరణికోట యందురు. ధాన్యకటకము ప్రతిష్ఠయంతయు బౌద్ధ యుగము నాఁటిదే. అది బౌద్ధ సంఘారామములతో విలసిల్లుచ బౌద్ధులకు క్రీ. శ. మొదటి శతాబ్దులందు పవిత్రమైన మఠ పీఠముగ నుండెను. బౌద్ధమతస్థులు రెండవ బుద్ధునిగ పరిగ ణించు ఆర్య నాగార్జునుని కాలమున ఈ ధాన్యకటకము విద్యా పీఠమయి మిగుల ప్రసిద్ధి కెక్కెను. ఇది బ్రాహ్మణవిద్యకును బౌద్ధవిద్యకునుగూడ నిలయమై యుండెడిది. ౭,౦౦౦ ల బౌద్ధ భిక్షువులతోను, ఆఱు కళాశాలలతో కూడిన యొక విశ విద్యాలయముతోను విలసిల్లు టిబెట్టు(త్రివిష్టపము)నంద 'లాసా' నగరము సమీపమున నున్న 'డాపంగ్' సంఘార మము ఈ ధాన్యకటక సంఘారామము నాదర్శముగఁ గైకొ యే నిర్మింపఁబడినదని టిబెట్టు చరిత్రకారులు తెలుపుచున్నా ధాన్యకటక సంఘారామ విశ్వవిద్యాలయములనుగుఱించి

యువాన్‌చాంగ్ అను చీనాదేశపు బౌద్ధయాత్రికుఁ డిచట మిక్కిలి రమ్యములైన బౌద్ధనిర్మాణము లనేకములను తాను చూచినట్లు తెలిపియున్నాఁడు.

ఇట్లే వేఁగి లేక వేంగి కూడ బౌద్ధయుగమున గొప్ప సంఘారామముతో విరాజిల్లి గొప్ప విద్యాపీఠముగఁ బ్రసిద్ధి కెక్కినది. అచ్చటి సంఘారామమున పెక్కు 'అంతస్తులు గల హర్మ్యములును, సొగసుగ చెక్కఁబడిన స్తంభములచే నలంకరింపఁబడిన యితర గృహములును' ఉండినట్లును, 'ఈ యారామము మ్రోల నూఱడుగుల యెత్తు గల యొక స్తూప' ముండినట్లును, 'ఇచ్చటి బుద్ధవిగ్రహమును శిల్పి తన నేర్పంతయుఁ జూపి కళలూరునట్లు చెక్కినట్లును' తెలియుచున్నది. ఈ వేంగీవిద్యాపీఠమునకు శ్రీ దిఙ్నాగాచార్యులవారు అధ్యక్షులుగ నుండిరి.

ఈ కాలముననే దక్షిణాపథమున విలసిల్లిన మఱియొక విద్యాపీఠము కాంచీపురము. ఇదికూడ ధాన్యకటక విద్యాపీఠమువలె బ్రాహ్మణ బౌద్ధవిద్యలు రెంటికి నిలయముగ నుండెను. పెక్కు సంఘారామములతో శోభిల్లిన యీ నగరరాజము బౌద్ధమతము క్షీణించినపిదపఁ గూడ బ్రాహ్మణమతమునకు పట్టుగొమ్మయై కీర్తి వహించినది. కాంచీపురము రాజధానిగ పరిపాలించిన పల్లవరాజులు విద్యలను కళలను

నట్లేకాక ఈ పల్లవరాజ్యమునుండియే బౌద్ధభిక్షువులు విజ్ఞానజ్యోతిని గొనిపోయి సింహళమునుఁగూడ ప్రకాశవంతముగ చేసినట్లు చెప్పెదరు. క్రీస్తుశక మేడవశతాబ్దియందు దక్షిణాపథమునకు వచ్చిన యువాన్ చాంగ్ ధాన్యకటకము మొదలు కాంచీపురమువఱకు ననల్పశిల్పకళాకౌశలముతో నలరారు పెక్కు దేవాలయములను, బౌద్ధనిర్మాణములను జూచినట్లు తెలిపియున్నాఁడు. ఇట్లు బౌద్ధ యుగమునను, పల్లవరాజుల పరిపాలనమునను కాంచీపురమున విద్యలు చక్కఁగ వర్ధిల్లినట్లు మన కనేకనిదర్శనములవలన తెలియుచున్నది. బ్రాహ్మణమతము పునరుద్ధరింపఁబడినకాలమునఁగూడ కాంచీపురము గొప్ప విద్యాపీఠముగనుండి గొప్ప 'ఘటికాస్థాన'మని పేర్వడసెను.

బౌద్ధయుగమునందలి గొప్పసంఘారామములలో శ్రీశైల మొకటి. ఇచ్చటి సంఘారామమునుగుఱించి వ్రాయుచు డాక్టరు బర్గెస్ దొరగారిట్లు వ్రాసియున్నారు: 'ఇచ్చటికి వచ్చి నివసింపవలసినదని ఆర్య నాగార్జునుఁడు బౌద్ధభిక్షువుల నాహ్వానించి ఈసంఘారామమున బౌద్ధమతమునకు సంబంధించిన ముఖ్యగ్రంథములను, వాని వ్యాఖ్యానములను సంపాదించి యుంచెను'. ఈ విధమున శ్రీ పర్వతసంఘారామము పెద్ద పుస్తక భాండాగారముతో విలసిల్లిన గొప్ప విద్యాపీఠము. చరమదశలో నాగార్జునాచార్యుని నివాసమై యిది

ఈ పై సంగతులను గమనించినచో బౌద్ధయుగమున సంఘారామములు విద్యానిలయములుగ నుండినట్లు మనకు బోధపడును. బౌద్ధసన్న్యాసు లీ సంఘారామములందు నివసించుచు విద్యాపిపాసార్థితులకు విద్యాప్రదానముఁ గావించుచుండువారు.

హిందూయుగము

బౌద్ధయుగమును వదలి తదనంతరహిందూయుగమునకు వచ్చినచో మనకు గొప్పమార్పు గోచరమగును. బౌద్ధయుగమునందువలె తక్షశిల, నాలందలవంటి విశ్వవిద్యాలయములు మనకుఁ గాన్పింపవు. విద్య యంతయు బౌద్ధయుగమున బౌద్ధభిక్షువుల యధీనమునం దున్నట్లుగనే యీ యుగమున బ్రాహ్మణుల యధీనమునం దుండెను. బౌద్ధమతమునందలి సర్వమత సమాదరణీయములయిన సిద్ధాంతములను, సర్వజనాదరపాత్రములయిన యాకర్షణములను అన్నిటిని దన మతమున పొందుపఱిచి దానికి జనరంజకముగ నూతనత్వము నాపాదించి బ్రాహ్మణుఁడు మరల విజృంభించిన తనమతముతోపాటు తన్మతావరణములోనికి వచ్చిన హిందూసంఘమునకంతకు మతగురువే కాక విద్యాగురువునై యాచార్యత్వము వహించెను. బ్రాహ్మణుఁ డాచార్యుఁడై వేదివ యీ బ్రాహ్మ

గురుకులములు

వేద వేదాంగవిదులైన బ్రాహ్మణు లెచ్చట నున్న నచ్చటి కరిగి విద్యార్థులు గురుకులవాసము చేసి విద్య నార్జించువారు. గురువు శిష్యుని కుమారునిగ భావించి యాదరించువాఁడు. శిష్యుఁడు తన వినయవిధేయతలచేతను, భక్తిశ్రద్ధలచేతను, సపర్యలచేతను గురువును మెప్పించి ఆతని మన్ననలకు పాత్రుఁడగువాఁడు. చంద్రుని వెన్నెలవలె గురువును శిష్యుఁడెల్లప్పుడు ననుసరించి యుండువాఁడు. గురుజనపూజనము, అధ్యయనము తక్క అతనికి వేఱుచింతలు లేవు. ఈవిధమున నిల్లు వదలి, తల్లిదండ్రులను వదలి గురుకులవాసము చేసి విద్య పరిపూర్తిగ నేర్వవలయు నన్న పండ్రెండేండ్లు మొదలు నలువది యెనిమిదేండ్లవఱకు పట్టుచుండెడిది. కొందఱు కులపతులయొద్ద విద్యాభ్యాసము పదునాఱేండ్లతోనే ముగించువారు.

విద్యపూర్తియైన 'స్నాతకు'లకు కులపతి సదుపదేశము చేసి వారిని దీవించి స్వగృహమునకుఁ బంపువాఁడు. విద్యపూర్తి యగునంతవఱకు ఆర్యవిద్యార్థి బ్రహ్మచర్యవ్రతమునే పరిపాలించుచుండవలెను. విద్య పూర్తి గావించుకొని శిష్యుఁడు స్వగృహమునుఁగూర్చి వెడలిపోవునప్పుడు గృహస్థుఁడగువాఁడు ఆతనిని గౌరవమర్యాదలతో తన గృహమున కాహ్వానించి

కాని యుండెడివి కావు. ఈపూర్వవిద్యాపద్ధతి యంతయు మాఱిపోయినను, గురుకులవాసశ్రమ కాని, కులపతిసంపూజనబాధ కాని యిప్పుడు తప్పిపోయినను, తుదకు వేదాధ్యయనమే ఆకాశపుష్ప మగుచున్నను బ్రాహ్మణ సంఘమున వివాహకాలమున 'స్నాతకము', కాశీప్రయాణము, వరుని ప్రతిమాలి తోడ్కొనివచ్చి కన్య నొసంగి పెండ్లి చేయుట – అను నీయాచారములు మాత్రము పూర్వపువిద్యా పద్ధతిని జ్ఞాపకముచేయు పరిశిష్టములై నిలిచియున్నవి.

## బ్రాహ్మణవిద్య

బౌద్ధయుగానంతరము వర్ధిల్లిన విద్య యంతయు బ్రాహ్మణవిద్య, యనఁగా కేవలము వేదశాస్త్రములకు సంబంధించినవిద్య. సాంకేతికవిద్య (Technical Education) అనఁగా వాస్తుశిల్పాదిపరిశ్రమలకు సంబంధించినవిద్యను బ్రాహ్మణుఁడితరులకు వదలిపెట్టెను. హేతు, ఆధ్యాత్మిక జ్ఞానములకుఁ దోడ్పడు విద్య కంతకుఁ దా నధికారియై ప్రభుపుంగవుల గౌరవసమ్మానములకు పాత్రుఁ డయ్యెను.

## చతుర్దశవిద్యలు

ఋగ్యజుస్సామాథర్వము లనియెడు నాలుగు వేదములు, శిక్షా, వ్యాకరణ, కల్ప, నిరుక్త, జ్యోతిశ్శాస్త్ర ఛందశ్శాస్త్రములనఁబడు నాఱు వేదాంగములు, మీమాంస

విద్య లెన్ని యను విషయమున కొన్ని మతభేదములు కలవు. కొందఱు పదునాలు గనిరి. మఱికొందఱు పదు నెనిమిదనిరి. ఇఁక గొందఱు ముప్పదిరెం డనిరి. పై నుడివిన పదు నాలుగు విద్యలకు నుపవేదములైన యాయుర్వేద, గాంధ ర్వవేద, ధనుర్వేద, స్థాపత్యములు (శిల్పము మొదలగు సాం కేతిక విద్యలు) నాల్గింటిని జేర్చిన పదునెనిమిదివిద్య లగుచున్న వి. కాలము గడచినకొలఁది వీనిసంఖ్య పెరుఁగుచువచ్చినది. శుక్రుఁడు మొదలగువారు విద్యలను కళలను విడఁదీసినను కాలక్రమమున కొన్ని విద్యలు కళలలోఁ గలసిపోయినవి. అయినను చతుష్షష్టికళలు వేఱు, వేదవేదాంగాదివిద్యలు వేఱు అను ప్రాచీనవిభాగముమాత్ర మంతరింపలేదు. ఈవిధముగు బ్రాహ్మణవిద్య ముఖ్యముగ (౧) ఘటికాస్థానములు, (౨) అగ్రహారములు, (౩) దేవాలయములు (౪) మఠములు అను నాలుగు విధములగు సంస్థలలో పెరిఁగి పెంపుఁగాంచినది.

## ఘటికాస్థానములు

ఘటికాస్థానములు విద్యాపీఠములని తెలిసినను వీనిని గుఱించిన వివరములు మాత్రము మనకు తెలియవచ్చుట లేదు. ఘటికాస్థానములు ముఖ్యముగా దక్షిణాపథమునందలి శాసనములందు మాత్రమే పేర్కొనఁబడినవి. వేంగీచాళుక్య వంశజుఁడైన మొదటి జయసింహవల్లభుని

కాస్థాన ముండెననియు అందు జయసింహవల్లభమహారాజువల ననుండి నిడమఱ్ఱుగ్రామమును దానముగ ప్రతిగ్రహించిన కాటిశర్మ పితామహుఁడయిన మండశర్మ 'ఘటికాసామాన్యుఁ' డనియు తెలియుచున్నది. ఘటికాసామాన్యుఁ డనఁగా ఘటికాస్థానమునందలి యొకయధ్యాపకుఁ డనియో సభ్యుఁ డనియో తలంపవలసియుండును. కాంచీపురముకూడ బ్రాహ్మణవిద్య ప్రబలిన దినములలో పేరుమోసిన ఘటికాస్థానముగ నుండెనని యిదివఱకే చెప్పఁబడినది. కదంబవంశప్రభువులకు మూలపురుషుఁడైన మయూరశర్మ తన గురువగు వీరశర్మతో పల్లవరాజుల రాజధానియైన కాంచీపురమునకు బైలుదేఱి వెళ్ళెననియు, అతఁడు ప్రవచనమున గొప్పపండితుఁడు కావలెనను కోర్కెతో అన్ని ఘటికలకును వెళ్ళి గొప్ప ఆశుతర్కకుఁడు (Debator or disputant) అయ్యెననియు నొకశాసనము తెలుపుచున్నది. కాంచీపురము నేలిన (రెండవ) నరసింహవర్మయను పల్లవరాజు బ్రాహ్మణుల ఘటికాస్థానమును నిర్మించెనని వేఱొక శాసనమునఁ గలదు. భరతక్షేత్రమున కలంకార ప్రాయమైన కర్ణాటక సీమయందలి కుంతలదేశము 'ధర్మాక్కె నెమ్మణముం భోగక్కాగరముమాద ఘటికాస్థానము' మని ధర్మమునకు సహకారకములును, భోగముల కాకరములు నగు ఘటికాస్థానములకు నెలవని యొకశాసనము

కాకర మనియు నూహింప వీలగుచున్నది. ఘటికాశ్రమ మెట్లు నిర్మింపవలసినదియు ఉత్తంకుఁడు సామవేదమున చెప్పినట్లు శాసనములందు వ్రాయఁబడినది. ఇంతకంటె నీ సంస్థనుగుఱించిన వివరములు మనకు తెలియవు.

## అగ్రహారములు

ఘటికాస్థానములమాట యెటు లున్నను అగ్రహారము పూర్వకాలమున సుప్రసిద్ధమైన విద్యాసంస్థగ నుండె ననుట నిర్వివాదాంశము. మానసారమను సుప్రసిద్ధ పురాతన శిల్ప శాస్త్రమున, విన్యాసరీతుల ననుసరించి పండ్రెండు విధములైన గ్రామభేదములు పేర్కొనఁబడినవి. అందు అగ్రహార మను నది యొకటి. అది విద్వాంసులైన విప్రవరులకు స్థానము. కామికాగమము ౨౭-వ పటలమున నిది మంగల మనికూడ వర్ణింపఁబడిన దని మానసార మిట్లు తెలుపుచున్నది:

విప్రైర్విద్వద్భి రాభోగ్యం మంగలం చేతి కీర్తితం
అగ్రహార స్తదేవోక్తం విప్రేంద్రైః కామికాహ్వయే.

కన్నడ దేశమునను, ఆంధ్రదేశమునను అగ్రహార మగ్రహారమే కాని ద్రవిడదేశమున దానికి మంగల మనియు, చతుర్వేదిమంగల మనియు పేర్లు కలవు. చాళుక్యచోళులు లాం
ధ్రదేశమును పరిపాలించుచుండిన కాలమున గలిగిన ద్రావిడ

క్యేదిమంగల మిట్టిదే. కాకినాడ, పిఠాపురప్రాంతములకు ప్రాచీనకాలమున ప్రోలునాఁ డని పేరు.

అగ్రహారము లన్నియు వైదికవిద్య వ్యాపింపఁ జేయుటకై తద్విద్యాభిమానులైన రాజులు, నాయకులు జమీన్‌దారులు మొదలగువారు బ్రాహ్మణుల కొసంగినవియే. సపదక్రమానుక్రమాధీత వేదద్వయులు, సకలోపనిషత్పురాణేతిహాసానేక ధర్మశాస్త్రవిదులు, అగ్నిష్టోమయాజులు, యజ్ఞాగమమంత్రార్థతత్వజ్ఞులు, యజన యాజన అధ్యయన అధ్యాపనాది షట్కర్మ నిరతులు అయిన బ్రాహ్మణులకు రాజులు ఉత్తరాయణ పుణ్యకాలముననో, సూర్య చంద్రగ్రహణములనిమిత్తముననో, ఇతర పర్వదినముల సందర్భముననో లేక పట్టబంధ సమయముననో గ్రామముల నగ్రహారములను జేసి సర్వకరపరిహారముగ నొసంగువారు. ఆయగ్రహారమువలన వచ్చు రాబడి ననుభవించుచు, విద్యార్థులై వచ్చినబాలురకు విద్యాప్రదానముఁ గావించుచు, జీవనోపాధినిమిత్తము వేఱుచింతలు లేక బ్రాహ్మణులు సుఖముగా కాలక్షేపము చేయువారు. కొన్ని కొన్ని యగ్రహారములందు ప్రత్యేక మిట్టిట్టి విద్యలు నేర్పు నధ్యాపకుల కిన్నిన్ని వృత్తు లనికూడ నేర్పాటు లుండెడివి. వీర

| | |
|---|---|
| అత్ర వ్యాకరణం వ్యాచక్షాణస్య వృత్త్యర్థం భాగ ఏకః | రూపావతారం వ్యాచక్షాణస్యైక పురాణం వాచయితు రేకః |
| మీమాంసా వ్యాఖ్యాత్రే ద్వౌ | వైద్యస్యైకః |
| వేదాంతం వ్యాఖ్యాతు రేకః | అంబష్ఠస్యైకః |
| ఋగ్వేద మధ్యాపయితు రేకః | విషవాదిన ఏకః |
| యజుర్వేద మధ్యాపయితు రేకః | జ్యోతిర్విద ఏకః |
| సామాని గాపయితు రేకః | |

ఈవిధమున ఋగ్వేద, యజుర్వేద, సామవేదములను, మీమాంసా, వేదాంత, వ్యాకరణ, రూపావతారములను బోధించువారికి మాత్రమే కాక పురాణము చెప్పువానికిని, వైద్యునికిని, వ్రణవైద్యము మొదలగువానిని జేయు మంగలికిని, విషవైద్యునికిని, జ్యోతిష్కునికినిగూడ నగ్రహారములందు వృత్తు లుండెడివి. పూర్వము గ్రామములు కాని, అగ్రహారములు కాని ఇతర గ్రామములమీఁదను, ఇతర పట్టణములమీఁదను ఆధారపడకుండ తమ జీవనమును తాము స్వయముగఁ గడపుకొనుట కేయేవృత్తులవా రావశ్యకమో అట్టి వారి కందఱికి వృత్తు లుండెడివి.

అగ్రహారముల నొకవిధమగు విద్యాపీఠములు (Chartered Universities) అని నుడువ వచ్చును. రాజొసంగిన యగ్రహారమునో, వృత్తులనో యనుభవించుచు గురువు చదువుచెప్పు

ఏకభోగ, బహుభోగములు :— అగ్రహారములు సాధారణముగ ఏకభోగములుగను, బహుభోగములుగను ఉండెడివి. ప్రత్యేక మొక్కని హక్కు భుక్తములలో నుండు నగ్రహారము నేకభోగ మందురు. ఒక్క యగ్రహారముననే పెక్కుమంది బ్రాహ్మణులకు వృత్తు లుండి యది గణభోగ్య మయినచో నట్టి దానిని బహుభోగ మందురు. ఏకభోగ మయినను బహుభోగ మయినను అగ్రహారము ప్రత్యేకము బ్రాహ్మణుల యాశ్రమవాటిక యగుటచేత నందు బ్రాహ్మణేతరులు నివసించుట కవకాశ ముండెడిదికాదు. అధ్యయన అధ్యాపనాది షట్కర్మనిరతు లయిన బ్రాహ్మణు లెప్పుడును వ్యవసాయము చేయువారు కాకపోవుటవలన అగ్రహారపు భూములను సేద్యము చేయుటకు కొంతమంది రైతులు కావలసివచ్చువారు. వీరు నివసించుట కగ్రహారముల నంటి చిన్నపల్లె లుండెడివి. వీనికి పూళ్లని పేరు. పూఁడి పదాంతములయిన యిప్పటి గ్రామములలో నన్నియుఁ గాకపోయినను చాలభాగము కొంచెమించు మించుగ నిట్టివే యని నుడువవచ్చును. అగ్రహారమునకు కావలసిన కూరగాయ లన్నియు పూఁడినామాంచితము లయిన పల్లెలలో పండింపఁబడును. ఈపూళ్లకే సంస్కృతమున గ్రామగ్రాసపుఁ బల్లె లనియు, గ్రామోపహారము లనియుఁగూడ పేర్లు కలవు. సాధారణముగ రాజు లగ్రహారదానముఁ గావించునప్పుడే

హిరణ్యాదేయము 'గను, 'సదండదశాపరాధము 'గను, 'సో త్పద్యమాన విష్టికము 'గను, 'చాటభటదూతరాజపురుషా ప్రవేశనీయము ' గను అగ్రహారములను దాన మొసంగు వాఁడు ; అనఁగా దాన మొసంగిన యగ్రహారమునకు పన్నుపర్యాయము లుండెడివి కావు. అగ్రహారమునుండి రాజునకు చెల్లవలసిన ధాన్యరూపమైనట్టియు, ధనరూపమై నట్టియు రాబడి ప్రతిగ్రహీతలది. రాజు దానము నొసంగు నప్పుడే అగ్రహారమున ప్రజలు చేయు దశాపరాధములను విచారించి దండము (జరిమానా) విధించుటకును, దండిం చుటకును అధికారస్వామ్యముల నగ్రహారికులకే వదలివేయు వాఁడు. రాజునకు చేయఁబడవలసిన వెట్టివేములు సయితము దానముతో నగ్రహారికులకే చెందుచుండెను. విద్యార్థుల విద్యాభ్యాసమునకుఁ గాని, అగ్రహారశాంతికిఁ గాని భంగము కలుగకుండుటకై సైనికులు (చాటభటులు — Regular or Irregular troops) గాని, దూతలు (Messengers) కాని, రాజ పురుషులు (King's Servants) కాని అగ్రహారములలో ప్రవే శింపరా దనునిబంధనముతోనే రాజు అగ్రహారమును దాన మొసంగువాఁడు. అగ్రహారదాననిబంధనములలో నెల్ల ఈ నియమమే కడు ముఖ్యమైనది. వ్యవహార, దోష (సివిలు,

హారవిచారణమునఁ గాని బ్రాహ్మణేతరుల కెవ్వరికి నధికారము లేకపోవుటయే కాక వారి కెవ్వరికి బ్రాహ్మణుని యనుమతిమీఁద తక్క నాయగ్రహారమున ప్రవేశించుటకైన హక్కుండెడిదికాదు. ఈకారణముననే కావచ్చు, ముఖ్యముగ పంచమవర్ణమువా రగ్రహారపు వీథులందు నడవరా దను నిబంధనము కలిగినది. పూర్వపు విద్యాపద్ధతి యంతరించినను, పాశ్చాత్య నాగరకతాఘాతమున ప్రాచీనబ్రాహ్మణాచారదుర్గములు శిథిలము లయినను ఆ నిబంధనము మాత్ర మిప్పటికి నిలిచిపోయినది. ఈ నియమములను నిబంధనములను బరిశీలించినచో రాజుల కగ్రహారము లన్న నెట్టి గౌరవప్రపత్తులుండెడివో, విద్యార్థుల విద్యాభ్యాసమునకు భంగము కలుగకుండ రా జెట్టి జాగ్రత తీసికొని, బ్రాహ్మణుని కెట్టి స్వేచ్ఛ నొసంగుచువచ్చెనో తెలియఁగలదు. ఈవిధమున నగ్రహార మొక చిన్న సంస్థానముగ నుండెను. బ్రాహ్మణుఁడు దాని కధిపతియై రాఁగల సంతతి వారి భావిభాగ్యోదయము నాకాంక్షించి సంస్కృతి సూత్రములను పురివెట్టుచుండువాఁడు. ఈ కారణముననే ప్రాచీనకాలమున హిందూదేశమున నే యుద్యమము బయలుదేఱినను అది యెల్ల సంస్కృతికి సంబంధించినదిగనో, మతమునకు సంబంధించినదిగనో యుండుచు వచ్చెను. అట్టి యుద్యమము లన్నియు పల్లెటూరినుండియే ప్రభ

జులు నాయకులు మొదలగువారు కొంత అగ్రహారములందలి బ్రాహ్మణులకు గృహములను కట్టించియిచ్చుట యేకుండ నొక్కొక్క గృహమునకు కావలసిన సర్వవిధములైన పరికరములను, సంబారములనుగూడ నిచ్చుచు వచ్చినట్లును శాసన నిదర్శనములు కొన్ని కలవు. ఈక్రింద నుదాహృతమైన శాసనభాగ మట్టిదే.

> గృహాన్ విధాయ విపులాన్ వృత్తివృత్తి విభాగతః
> శయ్యోపధానపర్యంక విచిత్రాస్తరణాసనైః
> దేవోపకరణై ర్గోభి ర్గృహోపకరణై స్తథా
> శాలితండులముఖ్యై శ్చ ధనధాన్యై ర్గుడై ర్ఘృతైః
> తిలాదిసర్వసంభారై స్సంభృతాం స్తాన్ గృహోత్తమాన్
> ప్రవేశ్య ద్విజవర్యాం శ్చ పత్నీపుత్రయుతాన్ ముదా
> వస్త్రయుగ్మంచ సోష్ణీషం కౌశేయం రత్నకుండలే
> అంగుళీయకముఖ్యాని కల్పయిత్వా పృథక్ పృథక్
> వస్త్రాభరణతాటంక కంఠసూత్రాది భూషణైః
> బ్రాహ్మణాం శ్చ సపత్నీకాన్ పూజయిత్వాతిభక్తితః
> సహిరణ్యపయోధారాపూర్వకం ప్రదదౌ నృపః.

ఈరీతి నగ్రహారము లన్నియు విద్యానిలయములుగ ప్రసిద్ధి వహించినట్లును, మన ప్రాచీన విద్యాసంస్థలలో అగ్రహార మగ్రగణ్యముగ నుండినట్లును అంగీకరింపకతీరదు.

చుండెడివి. అగ్రహార వ్యవహారములను చక్కఁబెట్టుట కేర్పడినవారికి మహాసభవారనియు, సభవారనియు, మహాజనులనియు పేర్లుండెడివి. ఒక్కొక్క యగ్రహారము వైశాల్యమునుబట్టియు, వ్యవహారమునఁ జూపవలసిన దక్షతనుబట్టియు సభవారిసంఖ్య కొన్ని కొన్ని చోట్ల తక్కువగను, కొన్ని కొన్ని చోట్ల నెక్కువగను ఉండెడిది. ఇట్లే గ్రామవ్యవహారములను చక్కఁబెట్టుట కేర్పడిన సభకు పంచాయతీసభయని పేరు. అగ్రహారమహాసభలకును, గ్రామపంచాయతీసభలకును గల భేదమును గుఱించి యిచట వ్రాయుట యప్రస్తుతము.

ప్రత్యేకము విద్యాప్రదానమునిమిత్తము గాని, లేక దేవస్థానముల నిమిత్తము కాని చేయఁబడు దానధర్మముల కీ సభవారు ధర్మకర్తృత్వము వహించువారు. విద్యావిషయకమైనట్టి కాని, మఱి యితర ధర్మకార్యములకు సంబంధించినట్టి కాని దానధర్మములు కొన్ని కొన్ని చోట్ల ఈసభవారి పరముగనే చేయఁబడుచుండెడివి. అట్టి సందర్భములలో సభవారే దాత యాశయముల కనుగుణ్యముగ నాయాధర్మకార్యముల నాచరణమునకు తెచ్చుటకు తగిన కట్టుబాటులు చేయుచుండువారు. దక్షిణ హిందూదేశమున మన కీవిధమయిన శాసనములనేకములు కానవచ్చును.

పుదుచ్చేరి సమీపమునఁ గల బాహుగ్రామమున నీటి

లిది. నృపతుంగదేవని ప్రధాని — కురుమల్లోద్భవుఁడును, బశాలివంశ మార్తాండుఁడు నగువాఁడు తన ప్రభువు నను మతితో బాహుగ్రామవిద్యాస్థానమునకు మూఁడు గ్రామములను దాన మొసంగి వానిని ఆ గ్రామసభవారి వశము చేసెను. ఊర్మివంశసమాకులమై క్రిందికిఁ దిగు మందాకినీ నది నేవిధముగా ధూర్జటి తన జటలో నిలిపి వహించెనో అట్లే సభవారుకూడ పదునాలుగు గణములతోడం గూడిన విద్యానదిని వశముచేసికొని కాపాడిరి.

## దేవాలయములు

అగ్రహారములకు పిదప పరిగణింపఁదగిన ప్రాచీన విద్యాసంస్థ దేవాలయము. పూర్వకాలమున దేవాలయముతో సరిపోల్పఁదగిన మహాసంస్థ ఇంచుమించుగ లే దనియే చెప్పవచ్చును. అది మతధర్మముల నుద్బోధించు గురుపీఠము; వేదచోదిత విద్యాప్రదానముఁ గావించు విద్యానిలయము; మతబోధకు లుపన్యాసములుచేయు నుపన్యాసవేదిక; శాస్త్రజ్ఞులు వాక్యార్థములు గావించు సభాభవనము; పౌరాణికు లితిహాసములు వినిపించు సత్రశాల; భాగవతోత్తములు పరమేశ్వరారాధనముఁ గావించు పూజా మండపము. అట్టిది పూర్వకాలపు దేవాలయము. సాధ్యమైనంతవఱకు ప్రాచీన గ్రామజీవనము కలఁకఁ

సందలి ప్రాచీనశాసనముల ననుసరించి తెలియవచ్చుచున్నది. పూర్వకాలమున దేవస్థానములకుఁ జేయఁబడుచుండిన దానధర్మములలో విద్యాప్రదానమునకుఁగూడ నేర్పాటు లుండెడివి. మండలేశ్వరులు, సైన్యాధిపతులు, రాజులు, చక్రవర్తులు విద్యాభిమానమును, మతాభిమానమును గలిగి యొకప్పుడు కాకపోయిన మఱియొకప్పుడైన తాము దేవస్థానములకు చేయు దానధర్మములలో విద్యాప్రదానమునకుఁగూడ నేర్పాటులు చేయువారు. దానంజేసియే దేవస్థానముకూడ విద్యానిలయమై పేరొందఁగలిగెను. ఇట్టి విద్యావిషయకపు టేర్పాటులు కలిగిన యొక దానశాసనము దక్షిణార్కాడుమండలమునందలి త్రిభువనిగ్రామమునఁ గానవచ్చుచున్నది. ఇది చోళదేశమును పరిపాలించిన రాజకేసరివర్మాభిధానుఁడగు (మొదటి) రాజాధిరాజు కాలమునాఁటిది (క్రీ. శ. ౧౦౧౮—౧౦౫౦). ఈరాజుయొక్క ముప్పదవయేఁట రాజేంద్రచోళుని కారోగ్యాభివృద్ధి యగునట్లుగా సేనాపతియైన రాజేంద్రచోళ మహాబలి బాణరాయ రనునతఁడు 'రాజేంద్రచోళసుత్తమాగ్ర' మను పేరఁబరఁగు ధర్మముఁ గావించెను. తద్ధర్మమునకు సంబంధించిన కార్యవివరముల నాచరణమునకుఁ దెచ్చుటకై ఆగ్రామమునందలి మహాసభవా రచ్చటి సభామండపమున సమావేశమై సంవత్సరమునకు ౧ ౨,౦౦౦ ల కలములధాన్యము

కలముల ధాన్యము నేర్పాటుచేసి, మిగిలిన ధాన్యము నీక్రింది విధమున వినియోగించిరి ;

(౧) ఋగ్వేదాధ్యాపకులు ముగ్గురు, యజుర్వేదాధ్యాపకులు ముగ్గురు, ఛందోగసామాధ్యాపకుఁ డొక్కఁడు, తలవకార సామాధ్యాపకుఁ డొక్కఁడు, ఆపూర్వ, వాజసనేయ, బోధాయనీయ, సత్యాషాఢ సూత్రాధ్యాపకు లొక్కొక్కరు మొత్తము పండ్రెండుగురికి దినమునకు నాలుగు కలముల ధాన్యము;

(౨) వేదాంతము, వ్యాకరణము, రూపావతారము, శ్రీభారతము, రామాయణము, మనుశాస్త్రము, వైఖానస శాస్త్రము – వీనిని బోధించు నధ్యాపకు లొక్కొక్కరు;

(3) ఋగ్వేదాధ్యయనపరు లఱువదిమంది, యజుర్వేదాధ్యయనపరు లఱువదిమంది, ఛందోగసామాధ్యయనపరు లిరువదిమంది, ఇతర శాస్త్రాధ్యయనపరు లేఁబదిమంది – మొత్తము నూటతొంబదిమందికి దినమునకు పదునొకండు కలముల, పదికురుణీల, నాలుగు నాళీలధాన్యమును;

(౪) వేదాంతము, వ్యాకరణము, రూపావతారము – వీని నభ్యసించు నితరవిద్యార్థులు డెబ్బదిమందికిని

ఏర్పాటు కావింపఁబడెను. పై విధమున చేయఁబడిన

వలన నా విద్యాస్థానమునఁ గఱపఁబడుచుండిన విద్య లేవి యో, యేయే విద్య నెంద ఱెందఱు విద్యార్థులు నేర్చుకొను చుండిరో, యేయేవిద్య నేర్పుట కెంద ఱెంద అధ్యాపకు లుండిరో మనకు వివరముగ తెలియుచున్నది. విద్యార్థులకు భోజన వసతి గృహములతో నేర్పాటైన చిన్న విశ్వవిద్యా లయమువంటిది కాదా యీ త్రిభువనీ దేవస్థానవిద్యాపీఠము?

ఇట్టిదే మఱియొక శాసనము ఎణ్ణాయిరము గ్రామ మునఁ గానవచ్చినది: చోళ దేశము నేలిన మొదటి రాజేంద్ర చోళుని కాలమునాఁటిది (క్రీ. శ. ౧౦౧౩ - ౧౦౪౫). ఈ యెణ్ణాయిరము గ్రామమునకే రాజరాజచతుర్వేదిమంగల మనియుఁ బేరు. రాజునకు విజయాభ్యుదయములు కలుగునట్లు ఈ చతుర్వేదిమంగలము మహాసభవారు 'రాజరాజవిణ్ణగ' రను దేవాలయమున సమావేశమై కొన్ని ధర్మకార్యముల నొనరించిరి. అవి విద్యావిషయకమైనవి. విద్యార్థులకు విద్యా ప్రదానముఁ గావించుటకు వలసిన యేర్పాటులు చేయుటయు, నా విధమున విద్య నేర్చుకొను విద్యార్థుల కొక భోజనశాల నేర్పఱుచుటయు నా ధర్మయొక్క ముఖ్యోద్దేశము. ఇందును గూర్చిన వివరములను శాసన మీరీతిని దెలుపుచున్నది:

(౧) దేవస్థానమున తిరువాయిమొష్జిస్తోత్రమును పఠిం చుటకు నలువురు నియమితులైరి. వారి కొక్కొక్కరికి భృతిగ

వదియైదుగురు శ్రీవైష్ణవులకు భోజనము పెట్టు నిమిత్తమ
కొంత భూమి యొసంగఁబడెను.

(౩) సప్తాహమువంటి యొకానొకయుత్సవము సం
ర్భమున వేయిమంది వైష్ణవులకును, ఆ యుత్సవము చూచు
కేతెంచిన దాసులకును అన్నప్రదానముఁ గావించుకొను ఉ
కలముల ధాన్యమును, 3 కలంజుల బంగారము నొసంగ
బడెను.

(౪) గంగైకొండచోళమండపమునందు, ఋగ్వేద
ధ్యాయనపరులు ౭౫ గురు, యజుర్వేదాధ్యయనపరులు ౭
గురు, ఛందోగసామాధ్యయనపరులు ౨౦ మంది, తలవకా
సామాధ్యయనముచేయువారు ౨౦ మంది, వాజసనేయాధ
యనపరులు ౨౦ మంది, అథర్వవేదాధ్యయనపరులు ౧
మంది, బౌద్ధాయనీయ గృహ్యాకల్ప, గణాధ్యయనపరులు ౧
మంది — ఈ విద్యార్థులకు భోజనవసతి కల్పింపఁబడెను.

పై నుడివిన వేదము లభ్యసించు బ్రహ్మచారుల
మొత్తము ౨౩౦ మంది; రూపావతారము నభ్యసించువా
౪౦ మంది; మొత్తము విద్యార్థులసంఖ్య ౨౭౦ : వీ రందఱ
నొక్కొక్కరికి దినమునకు ఆఱునాళీల ధాన్య మేర్పా
కావింపఁబడెను.

విద్యార్థులు కలరు. వీరి కందఱ కొక్కొక్కరికి దినమునకు ౧ కురుణి, ౨ నాళీల ధాన్యము నియమిత మయ్యెను.

వ్యాకరణాధ్యాపకునికి దినమున కొక్కకలము ధాన్యమును, ప్రాభాకరాధ్యాపకుని కొకకలము ధాన్యమును, వేదాంతము చెప్పువానికి దినమున కొక్కకలము నొకతూని ధాన్యమును ఏర్పాటు చేయఁబడెను.

వేదాధ్యయనమునకై పదిమంది అధ్యాపకులు నియమింపఁబడిరి, ఎట్లన : ఋగ్వేదమునకు ముగ్గురు, యజుర్వేదమునకు ముగ్గురు, ఛందోగసామమున కొకరు, తలవకారసామమున కొకరు, వాజసనేయమున కొకరు, బౌద్ధాయనీయ గృహ్యాకల్పకారకముల కొకరు.

రూపావతారము బోధించువానికి దినమునకు 3 కురుణీల ధాన్యము. దినమున కిట్లు 'రాజరాజ మరకాలు'తో ముప్పది కలముల ధాన్యము కొలుచువారు. ఈరీతిని సంవత్సరమునకు ౧౦,౯౫ కలముల ధాన్య మగుచుండెను. అధ్యాయమున కొకకలంజుచొప్పున వ్యాకరణమున నెనిమిదధ్యాయములకు వ్యాకరణాధ్యాపకుని కెనిమిది కలంజుల బంగారమును, అధ్యాయమున కొకకలంజుచొప్పున పండ్రెండధ్యాయములకు ప్రాభాకరాధ్యాపకునికి పండ్రెండు కలం

మీమాంసాశాస్త్రము లభ్యసించు డెబ్బదిమంది విద్యార్థులకు 3½ కలంజుల బంగారమును ఇచ్చుటకు (విద్యార్థి వేతనము) నేర్పాటు కావింపఁబడెను. ప్రాచీన కాలమున దేశీయప్రభువుల పరిపాలనమున నార్యవిద్యల కీ రీతిని ప్రోత్సాహ ముండెడిది.

మొత్తముమీఁద నీ ధర్మనిర్వాహణమునకుఁగావలసిన ౬౧౧/౨ కలంజుల బంగారమునకును, ధాన్యమునకును దేవస్థానమునకు ౪½ వేలీల భూమి యొసంగఁబడెను.

ఈ విధమైన దానశాసనముల నెన్నియైనను చూపవచ్చును. వీరరాజేంద్రచోళదేవుని (క్రీ. శ. ౧౦౬౨ — ౧౦౬౭) తిరుముక్కూడల్ శాసనము కూడ నిట్టిదే. ఆ శాసనము ననుసరించి యీ క్రిందిసంగతులు తెలియుచున్నవి:

తిరుముక్కూడల్ మహావిష్ణ్వాలయమున 'జననాథమండప' మనుపేర నొకమండపము కలదు. అందు వేద, శాస్త్ర, వ్యాకరణ, రూపావతారములను బోధించు నొక విద్యాస్థానమును, అధ్యయనపరులగు బ్రహ్మచారుల కొక భోజనశాలయు, ఆవశ్యకమైనచో వైద్యమునిమిత్త మొక వైద్యాలయమును ఉండెను. బ్రహ్మచారులకు భోజనమునకును, ప్రతిశనివారము నభ్యంగమునకు తైలమునకును, రాత్రులు చదువుకొనుటకు దీపములకై చమురునకును ఏర్పాటు

మీ క్రింది యేర్పాటులు చేయఁబడినవి : (౧) బియ్యము, (౨) వంశపారంపర్యముగ వైద్యము నభ్యసించు కుటుంబములోని యొకవైద్యుఁడు, (౩) ఒక శస్త్రవైద్యుఁడు, (౪) మూలికలు తీసికొనివచ్చుటకును, వంటచెఱకుఁ గొని వచ్చుటకును, వైద్యాలయమునకు సంబంధించిన తక్కిన పనులు చేయుటకును ఇరువురు నవుకరులు, (౫) రోగులకు సపర్యచేయుకొఱ కిరువురు దాసీలు, (౬) భోజనశాల, వైద్యశాలల కొకసేవకుఁడు.

సంవత్సరమునకు సరిపోవు ఈ క్రింది మందులు వైద్యాలయమున నిలువచేసి యుంచువారు : (౧)...ఆశాహారీత్రికి - రెండుపళ్లు (౨) గోమూత్రహారీతికి - రెండుపళ్లు (౩) దశమూల హారీతికి - ఒకపడి (౪) భల్లాతకహారీతకి - ఒకపడి (౫) గండీరము - ఒకపడి (౬) బలాకోరండతైలము - ఒకతూని (౭) పంచా...తైలము - ఒకతూని (౮) లశు......ండతైలము - ఒకతూని (౯) ఉత్తమ కర్ణాదితైలము - ఒకతూని (౧౦)... ఘృతము - ఒకపదక్కు (౧౧) బిల్వాది ఘృతము - ఒకపదక్కు (౧౨) మండూకరవటకము-౨,౦౦౦ (౧౩) త్రివృత్తి-ఒకనాళి (౧౪) విమలై - ౨,౦౦౦ (౧౫) తామ్రాది - ౨,౦౦౦ (౧౬) వజ్రకల్పము - ఒకతూని, ఒకపదక్కు (౧౭) కల్యాణలవణము - ఒకతూని, ఒకపదక్కు (౧౮)...

పై కొలతలలోను, తూనికలలోను వచ్చు పడి చెన్నపురి
తి. నాళి, తూని, పదక్కు అనువానికిఁ గల పరస్పరసంబం
ధమును నిశ్చయించుటకు తంజావూరు చోళరాజుల శాసన
ములు మన కుపకరింపఁ గలవు. వాని సాయమున నీ క్రింది
ని మానము కట్టుట కవకాశము కలదు.

| | | |
|---|---|---|
| ౨ ఆళాకులు | = | ౧ ఉళక్కు |
| ౨ ఉళక్కులు | = | ౧ ఉరి |
| ౨ ఉరులు | = | ౧ నాళి |
| ౧౬ నాళులు | = | ౧ పదక్కు |
| ౨ పదక్కులు | = | ౧ తూని |

దీని ననుసరించి పదక్కు తూనిలో సగమనియు, క్కు పదక్కునకు ౧౬ నాళు లనియుఁ దేలుచున్నది.

పూర్వోక్త శాసనములవలన దేవాలయధర్మములు వలము హవిర్బల్యర్చనాదుల నిమిత్తమే కాక విద్యావిష యములకుఁగూడ పూర్వ మెట్లు వినియోగపడుచుండెనో తెలియఁగలము. ఇంతటి కట్టుబాటులమీఁద, నంతటి సదాశయములతో సంస్థాపితములయిన విద్యాస్థాన ములు ప్రశంసింపఁదగినవికదా! గ్రంథవిస్తరభీతివలనఁ గాని నిచో ఇంకను ఇట్టి విషయములను దెలుపు శాసనము లనే ములు చూపవచ్చును.

ములకు సంబంధించిన మఠములును ఆయామతముల వ్యాపనమునకుమాత్రమే కాక విద్యాభివృద్ధికిని ఎక్కువగ తోడ్పడియున్నవి. అగ్రహారములు, దేవాలయములు పూర్వము విద్యావ్యాపనమున కేవిధముగ తోడ్పడుచుండెడివో అట్లే యీ మఠములుకూడ గొప్ప విద్యావ్యాపకసంస్థలుగ ప్రసిద్ధి కెక్కి యమితప్రయోజనకారు లయ్యెను.

## జైనబస్తీలు

బౌద్ధమతము దక్షిణాపథమున రూపుమాయుటకుఁ గల ప్రబల కారణములలో జైనమతవిజృంభణ మొకటి. క్రీస్తుశకము రెండవ శతాబ్దినుండి జైనమతము బాగుగ వర్ధిల్లినది. సామంతభద్రుఁడు, అకలంకచంద్రుఁడు, విద్యానందుఁడు, మాణిక్యనంది, ప్రభాచంద్రుఁడు, జినసేనుఁడు, గుణభద్రుఁడు — ఈ మొదలగు విద్వద్వతంసులైన జైనాచార్యులు గొప్ప గొప్ప గ్రంథములు వ్రాసి, రాజాస్థానములకేగి విమతవాదులతో ప్రతివాదములు చేసి జైనమతమును దేశమున వ్యాపింపఁజేసిరి. అందువలన దక్షిణగాంగుల కాలమునను, రాష్ట్రకూటుల కాలమునను, కళచురిప్రభువుల కాలమునను జైనము రాజమతమై కీర్తిఁగాంచెను. కన్నడ దేశమున 'శ్రవణబెళగొళ' మొదలగు గ్రామములు జైనమతవిద్యకు ప్రధానపీఠము లయినవి.

వ్యాపించియుండె ననుటకు ప్రబలనిదర్శనములుగ నున్నవి. ఆంధ్ర దేశము నేలిన పూర్వ చాళుక్యప్రభువులు జైన, శైవ మతములు రెంటినిగూడ సమానముగ నాదరించినట్లు శాసన ప్రమాణము కలదు. (మూడవ) విష్ణువర్ధనుఁడు (క్రీ. శ. ౭౧౮ - ౭౫౧), అమ్మరాజ విజయాదిత్యుడు (క్రీ. శ. ౯౪౫ - ౯౭౦), విమలాదిత్యుఁడు (క్రీ. శ. ౧౦౧౫ - ౧౦౨౨)— ఈ మొదలగువా రందఱు జైనమతము నాదరించి, జినాలయములకు దానములు కావించిరి. జైనమత మాంధ్ర దేశమునం దంతట వ్యాపించినట్లు నిదర్శనము లున్నను జైనమతపీఠములు కొన్నిమాత్రమే ప్రధానవిద్యాస్థానములుగ నుండినట్లు కన్పట్టును. బెజవాడ (కృష్ణాజిల్లా), ధర్మవరము (గుంటూరు), రామతీర్థము (విశాఖపట్టణము), హనుమకొండ (ఓరుగల్లు), దానవులపాడు (కడప) — ఈ మొదలగునవి ఆంధ్ర దేశమునందలి ప్రసిద్ధజైనమతపీఠములుగఁ గన్పట్టును. జైనుల 'పల్లె'లు, 'బస్తీ' లు జైనమతవిద్యను వ్యాపింపఁజేయుటకు నెక్కువగ తోడ్పడినవి. జైనబస్తీ చిన్న చిన్న పేఁటలతోను, పెక్కు జినాలయములతోను గూడిన బ్రాహ్మణాగ్రహారము వంటి యొక జైనాగ్రహారముగ భావింపవచ్చును. జైనమత స్థలలో యతులకువలెనే యోగినులకుఁగూడ ప్రత్యేకమఠము

గుఱించి కొన్ని మనకు వివరములు తెలియవు. కాని ప్రతిముఖ్య మఠమున నసంఖ్యాములయిన మతగ్రంథములు చేర్పఁబడుచు వచ్చుటచేత నది యొకగొప్పగ్రంథభాండాగారమయి వెలయుచుండెడిది. ప్రాచీనగ్రంథాన్వేషకు లనేకులకు తాళపత్ర, భూర్జపత్రాద్యముద్రితప్రాచీనజైనమతగ్రంథము లనేకములు ఇట్టిమఠములయందే దొరకినవి.

### శైవమతములు

జైనమతమునకు పిదప దక్షిణాపథమున బాగుగ వర్ధిల్లిన మతము శైవము. శైవమతము చోళదేశమున 'ననాది'గ నుండినను దాని నాదేశముననే కాక దక్షిణాపథ మంతట నెక్కువగ వ్యాపింపఁజేసినవారు కాలాముఖులు, పాశుపతులు అనఁబరఁగు శైవులు. కాలాముఖ, పాశుపతములనునవి శైవమతమునందలి యంతర్భేదములు. క్రీస్తుశకము పది, పదునొకండు, పన్నెండు శతాబ్దులం దీమతమెక్కువగ విజృంభించెను. అప్పుడు చేది, చోళ, మాళవదేశాధిపతులును, పశ్చిమచాళుక్య, పూర్వచాళుక్య, కాకతీయాది రాజవంశజులునుగూడ ఈమతము నవలంబించి, దానికెక్కువ యాదర ప్రోత్సాహముల నొసంగిరి. శైవమతవిజృంభణము ప్రథమదశలో కాలాముఖులే ప్రబలు లయి

వారని మఱికొన్నిగాథలు కలవు. ఎట్లయిన నేమి వీరు ఆర్యదేశ, మధ్యదేశ, గౌడదేశవాసు లనియు, నుత్తరాపథమున నుండి వచ్చిన వారనియు స్పష్టమగుచున్నది. సాధారణముగ నీకాలాముఖ, పాశుపతనామములు పండిత, శివపండిత, శక్తి, శివ, రాసిపదాంతములుగఁ గానవచ్చును: ఉదా:- విశ్వేశ్వర పండిత, ఈశానశివపండిత, వామశక్తి, జ్ఞానశివ, నాగరాసి. సాధారణముగ పాశుపతులు పండిత, శివపదాంచితులు, మంచనపండితుఁడు, శ్రీపతిపండితుఁడు, మల్లికార్జున పండితుఁడు - వీర లెల్లరు పాశుపతశైవులే. ఇందువలననే మల్లికార్జున పండితారాధ్యుఁడు తన 'శివతత్త్వసారమున' 'పశుపతి' మతమునే యుద్ఘాటించెను.

ఆంధ్రదేశమున శైవమతమునకు పూర్వచాళుక్యులును, కాకతీయులును ఎక్కువ ప్రోత్సాహాదరములను చూపి దాని కాలంబమై నిలిచిరి. పూర్వచాళుక్యుల కాలమున, అనఁగా అమ్మరాజవిజయాదిత్యుని కాలముననుండి కాలాముఖము మొగ్గతొడుగ, కాకతీయులకాలమున పాశుపతము కాయకాచి పంటపండెను.

ఇంతవఱకుఁ బ్రకటింపఁబడిన యాంధ్రదేశశాసనములలో మొట్టమొదటిమాఱు కాలాముఖుల ప్రస్తావము పూర్వ
చాళుక్య ప్రభువైన అమ్మరాజ విజయాదిత్యుని

సంపన్నులు. విద్యాప్రదానముఁ గావించుటలో దీక్షాకంకణము కట్టినవారు. వీరిని 'శిష్యచాతకవర్షాగమము'లని కన్నడశాసనములు వర్ణించుచున్నవి. వీరి వక్కాణ కన్నడశాసనములం దిట్లు కలదు.

"యమ, నియమ, స్వాధ్యాయ, ధ్యాన' ధారణ మౌనానుష్ఠాన జపసమాధి శీల గుణసంపన్నరుం, విబుధజన ప్రసన్నరుం, సకలసుకవినికురుంబాధారరుం, అన్నదాన సువర్ణ దాన కన్యాదాన గోదాన భూదాన అభయ భైషజ్యానేక దానవినోదరుం, లాకుళాగమాభరణరుం, సమస్తశాస్త్రాగమ విచారాచార చతురరుం......".

కాలాముఖులును, పాశుపతులునుగూడ మఠముల ద్వారముననే తమ మతమును, విద్యనుగూడ వ్యాపింపఁజేసిరి. శైవమతవిజృంభణకాలమున శైవమఠములు దేశమున నెల్లెడల వలవలె నల్లుకొనినవి.

కన్నడ, ద్రమిళ, ఆంధ్రదేశములం దాకాలమున విద్యాప్రదానముఁ గావించు పెక్కు శైవమఠములు మొలకలెత్తెను. ఆంధ్రదేశమున శ్రీశైలము, కాళేశ్వరము, భీమేశ్వరము మొదలగునవి శైవులకు ప్రధానక్షేత్రములుగ నుండెను.

పాశుపతశైవసంప్రదాయమునకు ...

యొక్క యుపమతములు కన్నడదేశమునను, ద్రమిళదేశమునను గూడ నుండినవి. గోళకీమఠ శాఖలు తెలుఁగుదేశమున కడప మండలమున పుష్పగిరియందును, కర్నూలుమండలమున త్రిపురాంతకమునందును, గుంటూరు మండలమున మందడమునందును వెలసినవి. ఈగోళకీమఠము క్రీస్తుశకము పదునొకండవశతాబ్దినుండి దక్షిణాపథమునం దెల్ల మిక్కిలి ముఖ్యమైన మఠవిద్యాసంస్థగ నుండినట్లు శాసనములవలనఁ దెలియవచ్చును.

విశ్వేశ్వరగోళకి:— ఆంధ్రదేశమున గుంటూరు మండలమునందలి మందడమునం గల విశ్వేశ్వరగోళకి సుప్రసిద్ధమైనది. దానిని నెలకొల్పిన శివాచార్యుఁడు కాకతీయగణపతిదేవచక్రవర్తికి చిన్మయదీక్ష నొసంగిన రాజగురు వగు విశ్వేశ్వరశివమహాముని. గణపతిదేవ చక్రవర్తి కూఁతురైన రుద్రమదేవి యాసుకృతికి శాలివాహనశకము ౧౧౮౩-వ దుర్మతినామసంవత్సర చైత్రబహుళ శుక్రవారమునాఁడు వెలఁగపూఁడి సహితముగ మందరగ్రామము దానముచేసెను. విశ్వేశ్వర శివమహాముని ఆదానమును పరిగ్రహించి యచ్చట నొకవిశ్వేశ్వరాలయమును, మఠమును, బ్రాహ్మణుఁడు మొదలు చండాలుని పర్యంతము వర్ణవివక్ష లేకుండ నిర

పదిబ్రాహ్మణకుటుంబముల కొక్కొక్క కుటుంబమునకు రెండుపుట్లు భూమిచొప్పున నీయఁగా మిగిలిన దానిని మూఁడు భాగములు చేసి, యం దొకభాగము విశ్వేశ్వరునికిని, మఱి యొకభాగము విద్యార్థులకును, శుద్ధశైవమఠమునకును, మూఁడవ భాగమును ప్రసూత్యారోగ్యశాల (Maternity Hospital) కును, విప్రసత్రమునకు నిచ్చివేసి ఋగ్యజుస్సామ వేదములు నేర్పుటకు మూవురధ్యాపకులను, పదవాక్యప్రమాణము (Logic), సాహిత్యము (Literature), ఆగమములు బోధించుట కయిదుగురు వ్యాఖ్యాతలను, వైద్యు నొకనిని, కాయస్థు నొకనిని (గణకుఁడు) నియమించెను.

ఈపై నుడివిన పదిమందికి నొక్కొక్కరికి రెండుపుట్లు భూమి నొసంగెను. పైవారితోపాటు, దేవాలయమున పది మంది నర్తకులును, ముఖవీద్వయసంయుక్తులగు నెనమండ్రు మార్దంగికులును, ఒక కాశ్మీరదేశపు గాయకుఁడును, పదు నలుగురు గాయినులును, 'కరడా' వాద్యమునందును, నాట్యమునందును నేర్పరులైనవా రాఱుగురును నియమితులైరి. వీరికి వృత్తు లేర్పాటు చేయఁబడెను. అంతియే కాక, చాతుర్వర్ణ్యసముద్భూతులైనట్టియు, జటాధారులైనట్టియు, గ్రామసంరక్షణము నభిలషించి బీజచ్ఛేద, శిరచ్ఛేద, కుక్షిఛేదాదికర్మలం జేసికొనునట్టియు చోళదేశాగతులైన వీర

శిల్పము, మంగలి పనులం జేయువారును, వాస్తుశాస్త్రజ్ఞులు నగు గ్రామభటులు పదిమందికిని గూడ వృత్తులొసంగఁబడెను.

ఇట్లు విశ్వేశ్వర గోళకియందు కేవలము విద్యాప్రదానముమాత్రమే కాక ప్రసూత్యారోగ్యశాలకూడ నేర్పాటు చేయఁబడెను. ఇది యెంతయు ప్రశంసింపఁదగినదికదా! కన్నడ దేశమునందలి బెళగామిలోని కోడియమఠ నామాంతరమునం బరఁగు కేదారేశ్వరాలయము సుప్రసిద్ధవిద్యాస్థానము. ఈ విద్యాస్థానమున వేదవేదాంగములు, కుమార, పాణిని, శాకటాయనుల వ్యాకరణ శాస్త్రములు, న్యాయ, వైశేషిక, మీమాంసా, సాంఖ్యాది దర్శనములు, లకులీశ, పాతంజల్యాది యోగశాస్త్రములు, కావ్యనాటకధర్మశాస్త్రేతిహాసాదులు బోధింపఁబడుచుండెడివి. ఆనాఁడు వైదికవిద్యాప్రదానముఁ గావించు మఠములలో వైద్యశాలలుకూడ నుండినట్లు శాసనములవలనఁ దెలియుచున్నది. పూర్వోక్తమగు కోడియమఠము 'నానానాథరోగిజనరోగభైషజ్యస్థానము' (దిక్కుమాలిన రోగులకు చికిత్సచేయు వైద్యశాల) యని కూడ పేర్వడసినది. ఇట్టి మఠములు శ్రీశైలమున (౧) భిక్షావృత్తిమఠము, (౨) అరసమఠము, (౩) కలుమఠము, (౪) సారంగమఠము, (౫) గణమఠము అని యైదుండెడివి. వీనిలో భిక్షావృత్తిమఠము విద్యావ్యాపనము చేయు

లకు పూర్వమే నాథముని, పుండరీకాక్షులు, యామునా
చార్యులు మొదలగువారు పనిచేయుచుండినను రామానుజా
చార్యులు మతరంగమున కవతరించుటతోఁ గాని శ్రీవైష్ణవ
మునకు బలము కలుగలేదు. ఆచార్యులవా రామతమును
సరియైన మార్గమునకుఁ దెచ్చి దక్షిణాపథరాజన్యులను కొంద
ఱిని వశపఱుచుకొని వారికి వైష్ణవమత మిప్పించిన పిదప
నుండి క్రమక్రమముగా నామతము పుంజుకొని తీగసాగెను.
శ్రీరామానుజాచార్యులకుఁ దరువాత వేదాంతదేశికులు, మన
వాళమహాముని మొదలగువా రాముకొని వైష్ణవమతవ్యాపన
ముఁ గావించి చరితార్థులైరి. అయినను కర్ణాటాధీశుఁడైన శ్రీ
కృష్ణదేవరాయలకాలమునుండి కాని యాంధ్రదేశమున
వైష్ణవమతము బాగుగ విజృంభింపలేదు. కృష్ణదేవరాయలు
మొదలు కర్ణాటాధీశులైన అచ్యుతదేవరాయలు, సదాశివ
రాయలు, వేంకటపతిరాయలు, శ్రీరంగదేవరాయలు మొద
లగు వారియాదరప్రోత్సాహములవలన నది దక్షిణదేశమున
నుఱుకులువైచుచు నభివృద్ధిఁ గాంచెను. శైవమతము క్రీస్తు
శకము పదునొకండు, పండ్రెండు, పదుమూఁడు శతాబ్దులం దెట్లు
చోళ, చాళుక్య, కాకతీయాది రాజవంశముల యాశ్రయమున
విజృంభించెనో యట్లే వైష్ణవమతమును పదునాలు పదునేను
శతాబ్దులందు విజయనగరము కర్ణాటాధీశులకాలమున రాజ

కట్టి పనిచేసినవి. శ్రీతిరుమల తాతాచార్యులవారు, తిరుమల శ్రీనివాసాచార్యులవారు, కందాళం అప్పలాచార్యులవారు, కందాళం భావనాచార్యులవారు, కందాళం దొడ్డయాచార్యులవారు, తాళ్లపాకం తిరుమలాచార్యులవారు, పరవస్తు ముమ్మడి వరదాచార్యులవారు, కోటికన్యాదానం తాతాచార్యులవారనఁబడు ఏటూరి తిరుమల కుమార తాతాచార్యులవారు, పరాంకుశం వణ శఠగోపజీయంగారు – ఈ మొదలైన విద్వద్వరేణ్యులు వేదమార్గ ప్రతిష్ఠాపనాచార్యులును, ఉభయ వేదాంత ప్రవర్తకులునై విజయనగర కర్ణాటాధీశులకాలమున ప్రసిద్ధులైరి. గాఢమైన వీరి మతాభిమానమువలనను, కార్యదీక్ష వలననే వైష్ణవమతము రాజమతమై పెంపు చెందఁగలిగెను. శ్రీకృష్ణదేవరాయలనాఁడు విజృంభింపమొదలిడిన యీమతము వీరప్రతాప శ్రీరంగదేవరాయలకాలమునాఁటికి కత్యుచ్ఛదశకు వచ్చెను. ఆకాలమున కర్ణాటాధీశులే కాక వారికి సామంతులుగను సేనాపతులుగను నుండినవారుకూడ నీమతము నవలంబించి యాదరించిరి. మన యాంధ్రదేశమునందలి జమీన్‌దారు లెల్లరు శ్రీవైష్ణవమతము నవలంబించిన దీకాలముననే. తన్మతాచార్యుల గాఢదీక్షయు, మతాభిమానమును అప్పటినుండి యిప్పటివఱకు తెలుఁగుదేశముపై చెక్కుచెదరకయుండునట్లు తమముద్రల నచ్చొత్తినవి.

ఇవి యన్నియు వైష్ణవ మఠములు. ఇవి గాక వ్యాసరాయ మఠము, శృంగేరీమఠము మొదలగు మాధ్వాద్వైతాది మఠములును కలవు. కాని వీనినిగుఱించిన వివరములు శైవ మఠములకువలె శాసనముల ననుసరించి బాగుగ తెలియ వచ్చుట లేదు. కాని యివి యన్నియు నాయామతములను దేశమున సుస్థిరముగ పాదుకొలుపుటకు మాత్రమే గాక వైదిక విద్యాప్రదానముఁ గావించి గొప్పగొప్ప విద్వాంసులను తయారుచేయుటకుఁగూడ నెక్కువగఁ దోడ్పడియుండినవి.

పూర్వోక్తములయిన మన ప్రాచీనవిద్యాసంస్థలను గుఱించియు, విద్యాపద్ధతినిగుఱించియు గాఢముగ యోజించి నచో పల్లెటూరి జీవన మెంత నిరాడంబరముగ నుండెనో యాసంస్థలు, నాపద్ధతియు నంత నిరాడంబరముగ నుండెడి వని స్పష్టము కాఁగలదు. పెద్దపెద్ద కళాశాల లక్కఱలేదు. కూర్చుండుటకు పెద్దపెద్ద కుర్చీలుకాని, బల్లలుకాని యక్కఱ లేదు. పవిత్రమై, భక్తిభావములతోడను, త్యాగదీక్షతోడను నిండి నిబిడీకృతమై యుండు దేవాలయములును, మఠములును విద్యాస్థానములు. చక్కనిపంట పైరులతోను, తోఁటలతోను ప్రకృతికి కంఠాభరణములవలె నుండు అగ్రహారములే గొప్ప విద్యాపీఠములు. అందు నిత్యము విద్యార్థులకు గురుజన పూజనము ; పరమేశ్వరారాధనము ; సజన సాంగత్యము,

చున్నాఁడు; విద్యార్థిని కన్న కొడుకువలె నాదరించి తండ్రి యగుచున్నాఁడు; ఐహికజీవితము నెట్లు గడపవలెనో తెలిపి దేశికుఁ డగుచున్నాఁడు. భక్తి ప్రేమములే వారికిఁ గల యను బంధములు; గురువృద్ధజనమార్గానుసరణమె వారిరాచబాట; స్వధర్మనిర్వహణమే వారి కార్యదీక్ష; సనాతన ధర్మ సంరక్షణమే వారి నిరంతరకృషి. పడిపోయినది ఎప్పుడో రాజమార్గము. విజ్ఞానజ్యోతి దేశమున వెలిఁగించి త్రోవ చూపినారు ఆర్యమహర్షులు. అంతే. నిరాతంకముగ, నిరాడంబరముగ అంతము లేని కాలవాహినివలె విద్యాతంతువు భంగము రాకుండ సాగిపోవలసినదే. గురువుననుండి శిష్యుఁడు, శిష్యునినుండి గురువు, గురువులో శిష్యుఁడు, శిష్యునిలో గురువు తయారైన కాల మది. భావికాలముయొక్క బీజములు భూత కాలమునం దుండెను. భూతకాలపు ప్రతిభావిభూతులు భావి కాలమున ఇను మడించిన కాంతితో తెఱలి తేజరిల్లుచువచ్చి నవి; ఒక్కటేమార్గము; ఒక్కటే చుట్టు; బింబమునకు ప్రతిబింబము; అంతే. మార్పులేదు; క్రొత్త కూర్పులేదు. యూకాలము వేఱు; ఈ కాలము వేఱు; కాని ఇదికూడ ఆగత కాలపు పరిణామమే కదా!

# అనాదృత వాఙ్మయము

తెలుఁగున ఛందోబద్ధమైన చారిత్రక వాఙ్మయము
చాల తక్కువ. ఆ యున్న కొలఁది వాఙ్మయమును రెండు
తరగతులుగ విడఁదీయవచ్చును: (౧) కొంచెమో గొప్పో
చదువుకొన్నవారు మాత్రమే చదివి తెలిసికొని ఆనందించు
వాఙ్మయము, (౨) వ్రాయను, చదువను నేర్వనివారుకూడ
విని ఆనందించు వాఙ్మయము. మొదటి తరగతి వాఙ్మయమే
అసలు వాఙ్మయముగా ఇంతవఱకు పరిగణింపఁబడుచున్నది.
రెండవదానిని మనవారు వాఙ్మయమే అనరు.

మొదటి తరగతిది కావ్యమునఁ జేరినది. ఇందు పద్య
ప్రబంధములు, ద్విపద ప్రబంధములు కలవు. ద్విపద కేవలము
దేశిజాతికి సంబంధించిన ఛందమగుట కొంతకాలమునకు
పూర్వ మది మన యాంధ్రవిద్వాంసుల నిరాదరణమునకు
పాత్ర మైనది. సంస్కృత చ్ఛందమునందలి వృత్తములతోఁ
గూడిననే కాని కావ్యమునకు గణన రాలేదు. పద్యప్రబంధ
ములే రంగస్థలము నాక్రమించి ద్విపదకావ్యములను వెడల
నడిచినవి; అయినప్పటికి ద్విపద మేమూలనో నక్కి యెట్లో
తన ప్రాణమును దాను పోసికొని తన బ్రదుకుతెరువు తాను
చూచుకొనుచునే వచ్చినది. పౌరాణికేతివృత్తములు గల
ద్విపదకావ్యములమాటే యిటు లుండ చారిత్రకేతివృత్తము

మనపూర్వుల కంతప్రీతి లేదు. చరిత్ర మిహపర సాధక మైన
కాదు. అసలు వాఙ్మయ మంతయు మతవిషయక మైన ప్రయో
జనముతో చతుర్విధ పురుషార్థములలో ప్రధానముగ ప్ర
మాంతిమ పురుషార్థములను సాధించుటకే పుట్టినది. వ
ప్రబంధములయందలి యితివృత్తము లన్నియు ధర్మ, మో
ప్రతిపాదకములే; తద్బోధకములే. అందువలననే ప్రజల
అవి యట్టిగౌరవ స్థానమును కల్పించుకొన్నవి. ధర్మ, మో
ప్రతిపాదనము నిమిత్తమే గ్రంథములు పుట్టినపుడు అ
తి దనుగుణముగనే పాఠకుల యభిరుచిని సరిదిద్దె నన్న విం
దేమి కలదు? సనాతన మతాచారపరాయణులైన ప్రజ
అట్టి యితివృత్తము గల గ్రంథములనే యాదరించుచు, తది
రుద్ధములైన గ్రంథముల ననాదరించుటం జేసి వేఱువిధమై
వాఙ్మయము విలసిల్లుట కవకాశము లేకపోయెను. సంస్కృ
చ్ఛందోబద్ధమైన పద్యగ్రంథమున చారిత్రకేతివృత్తము స్థా
ము కల్పించుకొనునప్పటికి చాలకాలము పట్టెను. ఇది వి
యనగర సామ్రాజ్య అంతిమకాలమునకుఁ గాని సాధ్యమ
కా లేదు. కేవలము నశ్వరమును, ఐహికమును, పురుషా
సాధనానుపయుక్తమును, విశేషించి ఐహికబంధప్రోద్దీపకమ
ను, స్వ(దేశీయ, జాతీయ, ఆత్మా)అభిమానజనకమును అగ
చారిత్రకేతివృత్తమునకు పద్యప్రబంధము తో

ఆంధ్రవిద్వాంసులలో వ్యాపించుటఁజేసియే కావచ్చు చరిత్ర సంబంధమైన పద్యకావ్యములు విజయనగరసామ్రాజ్యాంతిమ భాగమునకు పూర్వము మనకుఁ గానరావు. చరిత్రగ్రంథము ప్రబంధరూపమునఁ గాన్పించునాఁటికే దేశము తెలుఁగు మిాఱి పోయినది. తుంగభద్రాతీరస్థమైన విజయనగరమున తెలుఁగు దొరలు దొరతనము చేయుచుండిరి. తెలుఁగునాయకులు, తెలుఁగురాజులు ఆ దొరలకు ప్రతినిధులై, దణ్ణాయకులై, దుర్గాధిపతులై, మంత్రులై ఒక్క తెలుఁగుదేశముననే కాక 'దక్షిణాది' నంతట వ్యాపించి 'తెలుంగాణెము' మొదలు కన్యాకుమారివఱకు, సహ్యాద్రి మొదలు పూర్వాద్రివఱకుఁ గల దక్షిణదేశ మంతయు తెలుఁగుఁ జేసివేసిరి. రాజభాష తెలుఁగు; రాజులు తెలుఁగువారు; రాచఱికము తెలుఁగు వారిది. ఏమాత్రము 'తాహతు'గలవాఁడైననుగూడ తెలుఁగు కవుల నాదరించుటయు, వారికృతుల నంకితముఁ గైకొనుటయు, లేక వారిచే కృతుల రచియింపించుటయు నొక విలాస మయ్యెను. మగఁటిమిగల మహమ్మదీయులకుగూడఁ తెలుఁగు దొరలప్రాపు మేరువుకో పయినది. నాఁడు దొరలందఱిలో తీర్పులు దిద్దఁగలిగినదొరలు తెలుఁగుదొరలే. విజయనగర మున ఆరవీటిదొరల ప్రాజ్యసామ్రాజ్యమున నాఁడు తెలుఁగు బిడ్డఁడై పుట్టిన దొరతనమే; తెలుఁగు కత్తిని పట్టిన విజయమే.

విజయము, నరపతివిజయ మను రామరాజీయము, సోమదేవ రాజీయము, రంగరాట్చరిత్రము, పద్మనాభయుద్ధము మొదలైన చారిత్రకేతివృత్తములు పద్యప్రబంధము రూపమున వెలసినవి.

పద్య ప్రబంధరూపమున నున్న పైగ్రంథములే కాక మఱికొన్ని చరిత్రగ్రంథములుకూడఁ గలవు. కాటమరాజు కథ (దీనికి సంబంధించిన ఎఱగడ్డపాటి పోట్లాట, భట్టురాయబారము), బాలచంద్రుని యుద్ధము; అలరాజు రాయబారము మొదలైన పల్నాటివీరుల చరిత్రములు, వల్లురాజు యుద్ధము, సిద్ధేశ్వరచరిత్రము – ఇవి యన్నియు చరిత్రగ్రంథములే: ద్విపదకావ్యములు. ద్విపదకావ్య మన్న గణ్యత లేని దినములలో ద్విపదరూపమున వెలయింపఁబడిన వగుటచేత వీనిని రచియించినవారి పేరు ప్రతిష్ఠలు పైకి రాలేదు. వీని రచనాకాలముకూడ మనకు సరిగ తెలియదు కాని, పైనుడివిన పద్యచరిత్ర గ్రంథములకు మాత్రము పూర్వాపువై యుండవచ్చును. ఇట్లనుటకు గట్టి యాధారము లేవియు లేవు కాని, వాని స్వభావమునుబట్టియు, వానియందలి ఛందమునుబట్టియు నట్లూహింపవచ్చును. చారిత్రకేతివృత్తము గల ద్విపదప్రబంధములు ప్రధానముగ వీరరసపరిప్లుతములైనవే. ఇట్టి ప్రబంధములందలి ప్రధానపాత్రలందఱును మానవమాత్రులే: మన

ములలోని నాయకులకువలె దేవతలతోఁగాని, మహర్షులతోఁ
గాని, దేవలోక, గంధర్వలోకములతోఁ గాని సంబంధ ము
న్నవారు కారు. పద్యప్రబంధములలోని నాయకులకువలె వారి
కి మానవాతీతములైన, మానవాననుభూతములైన శక్తులు
లేవు. కేవలము వారును మనము నొకటే; ఇఁక భేద మేమన,
వారి జీవితకథాప్రవృత్తి మానవసామాన్యానుభవమున కిం
చుక పైమెట్టుననుండి లోకుల యమాయకహృదయముల
శృంగార, వీర, కరుణ, అద్భుతరసముల నెలయించుచు
వారిని తన్మయులం జేయుచుండెను. ఈరసోద్వృత్తియే మా
నవహృదయమున పొంగి, పొరలి పదము, ద్విపదములరూప
మునఁ జాలువారి నురుఁగులు కట్టెను. అట్టిరచనములు రసో
ద్వృత్తి వేఁడివేఁడిగ నుండి పొంగులు తేరునపుడే కాని చల్లఁగ
చల్లారినపిదప రావు. ఈకారణముచేతను, పై నుడివిన ద్విప
దకావ్యములయందలి యితివృత్తము లారవీటి విజయనగరా
ధీశుల కాలమునకు చాల పూర్వము నడచినవగుటచేతను
పద్యకావ్యములకంటె ద్విపదకావ్యములు పూర్వపువై యుం
డవలెను. అదియునుంగాక పద్యమునకంటె దేశిజాతి ద్విప
దయే పూర్వపుదిగఁ గన్పట్టును: అతి ప్రాచీనకాలముననుం
డియు ఆంధ్రహృదయమున స్థానము కల్పించుకొన్నవి అసలు
దేశిజాతులే. ప్రాచీన శాసనములను జూచినను ఈ విషయమే

దృష్టి నాకర్షించినది. దానం జేసియే చారిత్రక ప్రబంధము
ఇప్పటికే చాలవఱకు ముద్రితములై యున్నవి. కృష్ణరా
విజయము, నరపతివిజయ మను రామరాజీయము, ర
రాయచరిత్రము, సోమదేవరాజీయము, పద్మనాభయుద్ధము
ఈ పద్యప్రబంధము లన్నియు ఆంధ్రపాఠకలోకమునకు సుపరి
తములు.

కాని చారిత్రక ద్విపదకావ్యములపై ఆంధ్రభాష
మానులదృష్టి యింకను ప్రసరించియుండలేదు. వీనిలో త
జారి పల్నాటివీరచరిత్రము మాత్ర మచ్చుపడినది. కేవల మ
చరిత్రగ్రంథ మైనందువలననే కాదు, శ్రీనాథమహాకవికృ
మనునానుడికూడ దానిసత్వరముద్రణమునకు కొంత తో
డినది. పల్నాటివీరచరిత్రమున ముద్రితము కావలసినగ్రం
మింకను చాలఁ గలదు. కాటమరాజుకథలు, సిద్ధేశ్వరచరి
మొదలైన గ్రంథముల జోలికి పోయిన వారే లేరు. తెల
గున చారిత్రక వాఙ్మయమే అసలు తక్కువ. అందు ద్విప
కావ్యములు మఱియు తక్కువగ నున్నను, అవి యింకను అ
ద్ధుల యనాదృతికి పాలగుచునే యున్నవి. ఈ కావ్యము
బహుళోపభూయిష్ఠములు: తప్పులు కుప్పలుగ నున్నవి. వా
లోఁ గొన్ని కొన్ని పట్టుల సరియైన పాఠమే కుదురద
వానికి ప్రతు లెంత యెక్కువగ సంపాదించిన నంత మంచిది

త్వరితముగ నచ్చొత్తించి ప్రకటింపవలసిన భారము చరిత్రాభిమానులైన యాంధ్రులపై నున్నది. ఉన్న కొంచెము వాఙ్మయమును బోఁగొట్టుకొని, మనకు చరిత్రవాఙ్మయము లేదని వాపోయినఁ గార్యము లేదు.

చరిత్ర గ్రంథములుగనే కాక కావ్యములుగ చూచినను పై నుడివిన గ్రంథములు చాల చక్కఁగ నున్నవి. వానిలో మనోరంజకమైన శైలియు, సరసమైన కూర్పును, రక్తమును తీవరింపఁజేయు ఉద్వేగమును లేకపోలేదు. ఉదాహరణమునకు కాటమరాజు కథలను జదువఁదగును : ఈ కృతులయందలి ద్విపదలు కొన్ని కొన్ని పట్టుల జాతీయములతో నిండి చాల ముచ్చటగ నుండును. ఇవి యముద్రితములుగ నున్న కారణమున వానిరుచి ఆంధ్రలోకమున కింకను దెలియరాకున్నది. తెలుఁగు నుడికారమును, తెలుఁగు పలుకుబడియు నిందు మూర్తిమంతమై యలరారుచున్నది. ఆంధ్రపాఠకలోకమునకు రుచి చూపుటకై ఆ కథయందలి చరణము లచ్చటచ్చటివి కొన్ని యిట పొందుపఱుపఁ బడినవి:

పసుమాఁడు లక్షల పశువులు గలవు
కొమర తొమ్మిదికోట్ల గోవులు కలవు
ఏ మడిగిన పుల్ల రిచ్చేము మేము.

బొట్టులు పెంచుక బోగులా గుండు
నట్టుమానిసు లెల్ల నని సేయఁగలరె?

* *

పొడువుగా వారిని పొగిడేడే సారె
ఏమిటికి పొడువు లెంచిచూచినను
బూరుగు తా నెంత పొడువు పెరిఁగిన
చందనకుజముతో సరితూఁగఁగలదె?

* *

చేతప్పు వాతప్పు చెదరని గుండె
పిటికి కండయు లేని బిరుదురాహుతుఁడు.

* *

పాకనాఁడు చెదరె పలనాఁడు వడఁకె
గౌడదేశంబెల్ల కళవళం బందె
ములికినాఁ డంతయు నులికిపడి పోయె
కాకినాఁ డంతయు కాకిపా రాయె
కంచి భయం బందె కటకంబు జడిసె
గుత్తిరాజులకెల్ల గుండె దిగులాయె
కాటమరాజును కడు చెప్పి నపుడె
కడుపులో పిండాలు గడగడ వడఁకె.

* *

కావడె త్తిన యట్లు కాదు కయ్యంబు
బాసపత్రా లిచ్చి పండిన చేలు
గాసిపుచ్చినయట్లు కాదు కయ్యంబు

* *

ఘనమైన బాణాలు గారెలు కావు
చనుదెంచు చక్రాలు చక్కిలాలు కావు
కమ్మేటి రక్తమ్ము కావు దోవతులు
కమ్మని పాసెమ్ము కాదు కయ్యంబు
వండిన భక్ష్యాలఁ బరిమార్పఁగాక
బంటుతన మేవూరు? బ్రాహ్మ లేవూరు?

* *

తప్పు లనేకము లున్నను గ్రంథ మంతయు సరసమైన శైలిని ఉద్వేగముతో నడచుచుండును. పాఠకుల దృష్టి నిట్టి గ్రంథములపైకిఁ ద్రిప్పుటకే పై చరణము లుదాహరింపఁబడి నవి. ముఖ్యముగ చరిత్రకుఁ గావలసిన యీ విధమైన వాఙ్మ య మచ్చటచ్చట మారుమూలపల్లెలలో చెదరియున్నది. దానిని సేకరించుటయు, సేకరించినదానిని సరిచూచి సరి యైన పద్ధతిని బ్రకటించుటయు జరగవలసియున్నది.

౨

ఇఁక వ్రాయను, చదువను నేర్వనివారుకూడ విని యానందించు రెండవతరగతి వాఙ్మయమునుగుఱించి విచా రింతము. పాటలు, పదములు, జంగముకథలు, బుఱ్ఱకథలు - ఇవి యన్నియు నిందు జేరును. వీనిని 'చరిత్ర పదములు' (Historical ballads)గ పరిగణింపవచ్చును. చిన్నపరెడ్డికథ,
ఆరెమ పాటీలకథ, చిన్నమకథ, బంగారు తిమ్మరాజుకథ,

ప్రజాహృదయమును రసతరంగితముఁ గావించి, యుఱ్ఱూఁత లూఁచి, చూఱలాడిన చారిత్రక విషయమే యందలి యితివృత్తము: వీరమో, కరుణమో ప్రధానమైనరసము. నాయకుఁడు సామాన్య మానవుఁడు: కాని యాతనిజీవితమున నెవ్వఁడో యొక్క మెఱపు మెఱసి దాని కంతకు నొక్క కాంతి పరివేషమును గలిగించినది: ఆ పరివేషమండలమున ప్రజలను రిచ్చవడఁజేయు వీరరసప్రజ్వలితములగు శౌర్యసాహస గాథలో, లేక ప్రజల కన్నీటిధారల నివాళిఁ గైకొను కరుణ రసార్ద్రములగు కథానకములో పులకరించినవి. రసోద్దీపకములైన యట్టి పులకలకు స్థాయి కల్పించినవారు ప్రజలు. పై నుడివిన కథ లన్నియు నిట్టివే. 'విద్య రానివా' రనఁబడు ప్రజల యాదర, పోషణములవలన జీవించున్నవే. 'విద్యాధికుల' హృదయములను ప్రబంధ మెంత వశపఱుచుకొనెనో ఈ చరిత్రపదములు 'విద్య రాని వారి' చిత్తముల నంత సమ్మోహితములం జేసెను. వీనికి వారి ప్రాపే లేకపోయిన నవి యీ పాటికే యంతరించి యుండును. ఇతివృత్తముయొక్క స్వభావము ననుసరించి యీ రచనల తీరు ఒక్కొక్కదానిలో నొక్కొక్కవిధముగ వికసించినది: ఒకదానిలో నున్న 'లయకట్టు' ఇంకొకదానిలో లేదు: ఒకదానిలో నున్న పాటరీతి వేఱొకదానిలో లేదు. దేశికవిత పండినపంట ఈ 'పద'...

దపదములు - ఇవి యన్నియు ఈ కోవలోనివే. ఈ కథ లన్నియు వీధిభిక్షుకుని దైనిక సంకీర్తనగ్రంథసముదాయమునఁ జేరి యాతని ప్రాంతజోలెలో తలదాచుకొనియున్నవి. వాని నన్నిటిని పైకి తీసి, తగిన యాదరణమొసంగి, తగురీతిని వానిని ప్రకటించిననే కాని యవి యాంధ్రపాఠకలోకముయొక్క గౌరవాదరములకుఁ బాత్రములుకావు. ఇవికూడ సుస్వరూపమున వెలయనంతవఱకు మన యాంధ్ర వాఙ్మయమునకు ఆశ్వాసాంతగద్యము వ్రాయలేము.

ఇట్టి వాఙ్మయము నాంధ్రభాషాభిమాను లనాదృతి పాలు చేయుచున్నందువలన మన చారిత్రమున కెట్టి నష్టము వాటిల్లుచున్నదో తెలిసికొనుటకీ క్రింది యుదాహరణ మొక్కటి చాలును.

ఈ విధమైన వాఙ్మయమున 'సర్వాయి పాపడుకథ' అను చిన్నిపుస్తక మొకటి. కానైతే యిది నాలుగైదుపుటల గ్రంథము మాత్రమే. కాని దక్షిణ హిందూదేశ మహమ్మదీయచారిత్రమును బఠించువార లిందలి యితివృత్తము చాల ముఖ్యమైన దని గ్రహింపఁగలరు. ఇది చెన్నపురి సావుకారు పేటలో ౧౯౦౬-వ సంవత్సరమున ముద్రింపఁబడినది.

ఈ చిన్ని పుస్తకమునందలి కథ యిది : కథానాయకుడు సర్వాయిపాపడు

ఇంటిపేరు నాశనోళ్లు
పేరు సరదారి పాపన్న - ఆరాయుడూ॥

కథలో పై రీతి నీతని పుట్టు పూర్వోత్తరములు తెల పఁబడినవి. కథప్రకార మీతఁడు మొదట ఆవులను మేప కొనుచు, కల్లు గీసికొనుచు జీవితముఁ గడపువాఁడు. ఆతని యీ గోపాలకజీవిత మిట్లు వర్ణితమైనది.

ఆవుల దొడ్డికాడికొచ్చి
దొడ్డితడికె వాడు తీసెరా - ఆరాయుడూ॥
పిల్లంగ్రోవి వూదుతున్నడూ - ఆరాయుడూ॥
యెనకా యేనూరు ఆవు
ముందరా మున్నూరు ఆవు
ఈనికావు వేరుపడ్డాది
శనగచేలే పరగ మేపెనురా - ఆమందను
జొన్నచేలే పరగ మేపెనురా - ఆరాయుడూ॥
నక్కలమ్మ గుంటకాడ
ఆవులాకు నీళ్లు పెట్టి
చెట్టునీడ నిద్రపోతాడూ - ఆరాయుడూ॥

చెట్టునీడ నిద్రపోవుచుండిన పాపనిమీఁది కెండ పొడ రాఁగా అప్పుడు పంద్రెండుపడగల నాగుబాము వచ్చి యాతని కెండ తగులకుండ తన పడగ లెత్తి గొడుగుపట్టెనఁట. కాశి నుండి రామేశ్వరమునకు తీర్థయాత్రలు సేవింపఁబోవు బ్రా హ్మణు లీ వింత చూచి యాతనికి రాజయోగ ము

నీచపుఁ బనులు చెప్పవ ద్దనియు, భవిష్యత్కాలమున తనకు పట్టఁగల మహాదశకు తగిన పనులే చెప్పవలసిన దనియు నాతఁ డామెను కోరెను. తల్లికొడుకుల సంభాషణ మిచట చక్కఁగ నున్నది: చూడుఁడు.

విన రా సర్దారి పాప!
పరవిద్య లెన్నియైనా
కులవిద్యకు సాటిరావు - సర్దారి పాప;
ఇంటిఆవుల మేపుమంటాది - సర్వమ్మతల్లి
ఈత చెట్లు గీయుమంటాది - సర్వమ్మతల్లి
తాటికల్లె కట్టుమంటాది - సర్వమ్మతల్లి
ఈతకల్లె కట్టుమంటాది - సర్వమ్మతల్లి
ఈత జెల్లం వండుమంటాది - సర్వమ్మతల్లి॥

తల్లిమాటలు పాపనికి రుచింపవు: పాపని దృష్టి రాజయోగముమీఁద నున్నది. మొనగాఁడు కావలెనను దాహ మాతని కలిగించెను. బస్తీలు కొట్టి డబ్బు సంపాదించి మాన్యత, మగఁటిమిఁ గల మన్నీఁడు కావలెనని యాతని కోరిక లీరిక లెత్తుచున్నవి. ఆతఁడు తల్లితో చెప్పుచున్నాఁడు:

ఈదులుగీస్తే ఈండ్రవాడు
కల్లుకట్టితే గవండ్లవాడు
కత్తిపట్టితే మేదరవాడు
కుండపట్టితే కుమ్మరవాడు
మొనగాడి చట్టమొచ్చునా — సర్వమ్మతల్లి

లక్ష్యవీథులలో తనయొక్కయు, తోడివారలయొక్కయు వృత్తు లసహ్యము లైనవి. మన స్సంతయు 'మొనగాఁడి చట్టము' మీఁదికి, 'పాళెగాఁడి చట్టము' మీఁదికిఁ బోవుచున్నది. తన సంకల్పములను కార్యరూపమున సఫలము చేసికొనుటకు ధనము కావలెను. తలపోసినాఁ డతఁడు.

ఊరు కొడితే యేమిఫలము
పల్లె కొడితే యేమిఫలము
కొడితే గోల్కొండ కొట్టాలె — సర్వమ్మతల్లీ
నెల్లూరు బస్తీలు కొట్టాలె - సర్వమ్మతల్లీ
కందనోలు మహల్లు కొట్టాలె - సర్వమ్మతల్లీ
మైసూరు దేశంకొట్టాలె - సర్వమ్మతల్లీ
మీసము గిరగిర త్రిప్పె - సరదారి పాపడు॥

సర్దారి పాపని పరాక్రమము సామాన్యమైనది కాదు. ఆతఁడు విక్రమించినచో నెదు రెవ్వరు? ఎంతటి భయావహ మో యాతని పరాక్రమము కనుఁగొనుఁడు:

అబ్బా! అబ్బా! పాపని యొక్క పేరు చెప్పితే
ఊరపిచ్చిక పాలము బారదు
పొట్టి పిచ్చుక పూరు చేరదు
కొంజులూ కొరాడుతుండు
నక్కలు నాట్యమూ ద్రొక్కు

గోల్కొండ బస్తీ లోణుకు
నెల్లూరు బస్తీ లోణుకు
బందరు బస్తీ లోణుకు
కడపా జిల్లా లోణుకు - వాడి పేరంటే॥

తరువాత పాపన్న కొంతమందిని గూర్చుకొనెను. కార్యమందు దీక్ష, ఒడలికి చులుకు కలుగుటకై కల్లు సేవించుటకు వెళ్లుచున్నాఁడతఁడు : దారిలో నపశకునములైనవి. లెక్కచేయలేదు వానిని. బాగుగా నెక్కించినాఁడు కల్లు. కల్లు త్రాగి వెళ్లుచుండఁగా నతని కెఱుకల నాంచా రెదురు పడినది. 'గెద్దబుట్ట' దింపి తన కెఱుక చెప్పు మని నిర్బంధించినాఁడు పాపఁడు. ప్రాణభయముచేత తుద కంగీకరించి 'గెద్దబుట్ట' దింపి ''ఏడుగడియలు గోలకొండ నేలుటకు 'పంత' మున్నది సి'' కని యానాంచా రెఱుక చెప్పినది. అది వఱకే సెగలు పొగలీను నాతని సంకల్పబల మంతటితో రాజి మండినది. ఉద్ధతితో నింటికి వెళ్లి గోలకొండ దర్బారు కొట్టవలె, పైక మెక్కడ నున్నదో చెప్పవలసిన దని పాపఁడు తల్లిని నిర్బంధపెట్టెను. ధన మున్న స్థలము తల్లి యెంతకు చెప్పకపోవుటచేత నేస్తకాండ్రచేత సిద్దెలతో నూనె తెప్పించి కోకలు చుట్టి దివిటీలు తయారుచేసి నూనెలో ముంచి

పన్నెండువేలకే దండు రాణువను వెంబడి తోడ్కొని
గోలకొండకే యుద్ధానికే ప్రయాణమైనాడు
ఈటె చువ్వలబారు ముందుగ తర్లుతువున్నాది
కత్తికటారుల బారు వెనుకనె తర్లుతువున్నాది
పన్నెండు కొప్పెర్ల ధనము గనుకనె దండుకు పంచెనురా
దండుదళమునే తీసుకోనిగా ప్రయాణమైనాడు
గోలకొండకే వర్ధిజాబులే తాను బంపినాడు॥

పంద్రెండువేల రాణువను వెంట నిడికొని పాపఁడు గోలకొండ మీఁదికి యుద్ధమునకుఁ బోవుటతో ఛందస్సురీతి, పాటలయకట్టు అదివఱకున్నదానికి భిన్నమయినది. మాఱిన పరిస్థితుల కది సూచన. పోవుచున్న సైన్యముల బారువలెనే చరణములును పొడువెక్కినవి. సైన్యముల కదనపుగమనిక చరణముల నడకలోఁ జక్కఁగ చూపఁబడినది. గోలకొండపై యుద్ధమునకు వెడలిన పాపని దండునకు, నవాబుదండునకు ఘోర యుద్ధము జరగెను. పాపని యుద్ధ మిట్లు వర్ణితమైనది:

రెండుగా తలపట్టాలు తోడిగ సర్దారి పాపడు
కయ్యానికై తే దూకినాడుగా దండుమీది కేమీ
పొడుపొడు పొడుపొడు పొడు మంటాడు సర్దారి పాపడు
గిరగిర గిరగిర గిరమంటూ పట్టాలు తిరిగినావి
కొట్టితేనుగా పడివున్నావి క్రొవ్వినదేహాలు

తుదకు యుద్ధమున సర్దారి పాపఁడు గెలిచెను. నవాబోడిపోయెను. ఏడు గడియలు గోలకొండ 'తక్తు' నెక్కి పరిపాలించినాఁడు సర్దారి పాపఁడు. ఆ యేడుగడియల కాలము నయినపిదప నవాబు తిరిగి సేనలను సమకూర్చుకొని పాపనిపై నెత్తి వెళ్లినాఁడు. యుద్ధముచేసి యందు 'నిభాయించు' కొనలేక పాపఁడు ఇంతటి పౌరుషమైన బ్రదుకు బ్రదికి,

ఇకను నేనురి వకరిచేతులో చావ నేటికండీ
బాకే పైకి ఎగరవేసిగా రొమ్ము వొగ్గినాడు
గరగర గరగర గరమంటూను బాకు వచ్చినాది
రామారామా రామా అంటూ ప్రాణం విడిచాడు॥

ఇంతటితో పాపనికథ సమాప్తమైనది. పశువులను గాచుకొనుచు, కల్లు గీసికొను సామాన్యుఁడు పాపఁడు అసాధారణ విక్రమము నెఱపి, తురకదండు నోడించి, గోలకొండ పట్టణము వశముచేసికొని గద్దెయెక్కి పరిపాలనము చేసినాఁడు! ఆ యేలుబడి యేడుగడియల కాలమే యగుఁగాక! ఎట్టి పౌరుషవంతుఁడు! — తుదకు దైవప్రాతికూల్యమున నోటమి సంభవించి చావవలసి వచ్చినది. చావెప్పటికైన పుట్టినవారి కెల్లరకు నున్నదే. సమయము వచ్చినప్పుడు చచ్చుటకైన వెనుదీయలేదు పాపఁడు. గవుండ్ల కులమైనను చచ్చుటకూడ నెట్లో తెలిసినవాఁడు. పుట్టి యింత బ్రదుకు

మును, చచ్చిన చావును గమనింప ప్రజాహృదయము ద్రవించినది. అందువలననే కథకుఁ డనుచున్నాఁడు,

> వీరస్వర్గము పోయినాడుగా సర్దారి పాపడు
> పాపడియొక్క వీరస్వర్గం పాడించీ విన్న
> పాడినవారికి విన్నవారికి తొలగును దోషంబు

అని.

సర్వాయి పాపఁడికథ యిది: తల్లి సర్వమ్మకొడుకు గనుక సర్వాయి పాపఁడని యతనికి పేరు కలిగినది. ఈపద మీరీతినే కాక మఱియొకరీతినికూడఁ గన్పట్టుచున్నది. బళ్లారిలో నొక 'బోయ' పాడుచుండగా దీనిని విని ౧౮౭౪–వ సంవత్సరమున జే. యే. బోయిల్ దొరగా రానందించి యాంధ్రదేశమునందలి 'ఫోక్ సాంగ్స్' (ప్రజా గీతములు) అనుపేర నొక చిన్న వ్యాసమును 'ఇండియన్ ఆంటిక్వెరీ' పత్రికకు వ్రాసియున్నారు. ఆవ్యాసమునందు వా రీపాటకు సంబంధించిన మూఁడుపట్టులు మాత్రమే పొందుపఱిచినారు. అందు మొదటిది తల్లిదగ్గఱి నుండి పాపఁడు శలవు తీసికొను సందర్భము:

> తల్లి కొలువుకు వడిగ వెళ్లెను
> తల్లికి దండం [పెట్టి] నిలిచెను
> ఏరు కట్టి వ్యవసాయము, అమ్మ!

బంగరుకడియాల్ పెట్టుదును
మన కంత బంట్రోతుతన మేల ?

రెండవది పాపఁ డన్న లోకమునకుఁ గల భయమును వర్ణించుపట్టు :

అడుగో ! పాపడు వస్తా డంటే
కుందేళ్లు కూలబడును
లేడిపిల్ల లు లేవ లేవు
పసిబిడ్డలు పాలు త్రాగరు
నక్కలు సింహాలు తొక్కుళ్లాడును

మూఁడవది పాపఁడు త్రాగినకల్లు వర్ణించు సందర్భము:

పాపడు తాగడి కల్లూ
ఏతాటి ఏతాటి కల్లు ?
వ్రేలు పెట్టితే వ్రేలు తెగును
దివిటీ పెట్టితే భగ్గున మండును
త్రాగేటప్పుడు తీయఁగ వుండును
త్రాగినవాణ్ని లేవనివ్వదు
లేచినవాణ్ని పోవనివ్వదు
పాపడు తాగడికల్లూ
ఏతాటి ఏతాటి కల్లు ?

ఆ దొరగారి కీపాట సంపూర్తిగ దొరకలేదఁట. పై

వానిని సరిచూచి సరియైన పాఠ మేర్పఱిచి చక్కఁగ ముద్రించి ప్రకటింపవలసిన బాధ్యత ఆంధ్రులపైని గలదు.

ఇంతవఱకు సర్వాయిపాపని కథను గుఱించియే తెలిసి కొంటిమి గాని దాని ప్రాముఖ్యమునుగూర్చి గాని, చారిత్రక ముగ దాని విలువనుగుఱించి కాని యోజించి యుండలేదు. ఇఁక నది వివరింపఁ బడును.

సర్వాయి పాఁపడు ఔరంగజేబు పాదుషా యంత్య కాలమున నున్నవాఁడు. ఇతఁడు పాదుషా యవసానకాల మునం దాతని రాజ్యమునందలి హైదరాబాదు - ఓరుగల్లు ప్రాంతదేశముపై దాఁడివెడలి కోటలను ముట్టడించుచు, నగరములను కొల్లపెట్టుచు వచ్చినందున ఔరంగజేబు పాదుషాను గుఱించి వ్రాయునపుడు మహమ్మదీయ చరిత్ర కారు లీతని చరిత్రమునుగూడ వ్రాయక తప్పినదికాదు.

సర్వాయి పాపనికథలోని సత్య మరయుటకు మహమ్మ దీయ చరిత్రకారులు వ్రాసియుంచిన చరిత్రములే కాని మన కితరాధారములు లేవు. సర్వాయిపాపనిగుఱించి పాడఁబడు పాటలు సంపూర్తిగ నయిదాఱయినను దొరకుచో వీనిని, మహమ్మదీయ చరిత్రములను బరిశీలించి సత్యమును తేల్చుట కవకాశ మెక్కువ యుండును. మహమ్మదీయుల కోటలను

వారు వ్రాసినట్లు నిజముగా నాతఁడు దొంగయేనా యని మనము విచారింపవలసియున్నది. కాని హిందూదేశ మధ్య యుగ చారిత్రమును మనము పరిశీలింతుమేని అప్పుడు నీతియు రీతియు గలిగి మెలఁకువతో నెవ్వఁడు పదిమందిని జేరఁదీసి పదియూళ్లను జయింప గలిగెడువాఁడో వాఁడే దొర యని తెలియును. ఇట్లు కోటలను ముట్టడించియు, పట్టణములను దోఁచుకొనియు, కేవలము ప్రజోపద్రవము కలిగించుటయే పరమావధిగాఁ బెట్టుకొనక యెవ్వఁడు కోటలను గట్టి పాళెగాఁడై, సంస్థాన సంస్థాపకుఁడై రాజధర్మమును వెలయించుచు వచ్చెనో వాఁడే రాజు. ఆదినములలో బలమున్నవానిది రాజ్యము, ఆకాల మట్టిది. దొంగలే దొరలు: దొరలే దొంగలు. కాని యిరుతెఱఁగులవారిని వేఱుపఱుచు ముఖ్యలక్షణము లివి: ఒకరు తమ కణఁకువయయిన దేశమున ధర్మమును పాటించి ప్రజాహితము సేయువారు: వీరు దొరలు; ఇఁక రెండవవారు తమ కణఁకువయైన దేశమునఁగూడ పై విధులను బాటింపక స్వలాభపరాయణులై దోఁచుకొనుచు ప్రజలను హింసించువారు. సర్వాయిపాపఁడు దొంగయో దొరయో మనము నిర్ణయించి చెప్పుటకు తగిన యాధారములు లేవు. అతఁడు నిజాంరాజ్యమున 'భోనగిరి' పరగణా యందు 'షాహాపుర' దుర్గమును కట్టించి, దానిని తనకు

కలిగించుచు వచ్చెను. దుర్గములను నిర్మించి, దుర్గములను సాధించి రాజ్యమును విస్తరింపఁ జేసికొనఁ బ్రయత్నించినవాఁడు దొర కాక దొంగ యెట్లగును? కాని యతని ప్రజాపరిపాలన మెట్లుండెడిదో మనకు తెలియదు. సర్వాయిపాపని కథలను (పాటలు - పదములు) మన మెంత ఎక్కువగను, సంపూర్తిగను సంపాదింపఁగలిగిన నీతని చారిత్ర మంత స్పష్టముగఁ దెలియుట కవకాశము కలుగును. ప్రజాదరణము లేక క్రమక్రమముగ వీధిభిక్షుకుల నోళ్లలో నవసిపోవుచున్న యీ పాటలను చరిత్రాభిమానులు మేల్కొని యెంత త్వరితముగ సంరక్షించిన దేశచరిత్రమున కంతలాభము; లేనిచో చరిత్రమునకు నష్టము వాటిల్లు నని వేఱ చెప్ప నక్కఱలేదు.

సర్వాయిపాపనిగుఱించి మహమ్మదీయ చరిత్రకారులు చెప్పు సంగతులకును మనకు దొరకిన పాటలోని సంగతులకును కొన్నికొన్ని వ్యత్యాసము లగుపడుచున్నవి. పాట ననుసరించిచూడ నితఁడు పుట్టినది బెలగాము. కాని మహమ్మదీయ చరిత్రములు చూచిన నీతని జీవిత కథలో బెలగాము ప్రసక్తియే రాదు. పాటలో నితఁడు పెరిగినది తాటి(డి)కొండ యనియు, కులమున నితఁడు గవుండ్లవాఁడనియు, తల్లి సర్వమ్మ యనియుఁ గలదు. చరిత్రమున (చరిత్ర మనఁగా నిచట మహమ్మదీయులు వ్రాసినచరిత్ర మని యర్థము చేసికొనవలె) తా(డి)కొం

పేరు లేదు, అది యటుండ సర్వాయి, పాపరా ('పాపరా' అని యే మహమ్మదీయచరిత్ర లీతనిం బేర్కొనుచున్నవి) అను పేరుగలవా రిరువు రున్నట్లు మహమ్మదీయ చరిత్రము చెప్పెను. ఇది పొరపాటు కాఁదగును. కథలో పాపని తల్లిపేరు సర్వమ్మ యని స్పష్టముగఁ జెప్పబడినది ; సర్వమ్మనే సర్వాయి యనఁదగును. ఇట్టి రూపాంతరములు తెలుఁగుదేశపు స్త్రీల పేర్లలో మనము చాల గమనింపఁగలము. 'సర్వాయి' కొడుకు గను పాపనికి సర్వాయిపాపఁడని పేరు వచ్చియుండును. చరిత్రకూడ నితఁడు మొదట కల్లుగీసికొనువాఁ డనియు, తరువాత కొంతమంది నేస్తకాండ్రను జేర్చి యిట్టిదుండగములు సాగించె ననియు చెప్పుచున్నది. ఇతని ధనలాభమును గుఱించి కూడ చరిత్రమునఁ గలదు. ఇందును గుఱించి చరిత్రమున నిట్లు కలదు. పాపనికి వితంతువైన యొకసోదరి యుండెనఁట ; ఆమె చాల ధనవంతురాలఁట. ఎప్పుడో యొకప్పు డామె ధనముపై పాపని కన్నుపడుట తటస్థించెను. ఆధనమును తన కిమ్మని పాపఁ డామెను వేధించెను. ఎంతకు నామె ధన మియ్యకపోఁగా పాపఁ డామె నత్యంతదారుణముగను, క్రూరముగను హింసించి, యొడలంతయు కాల్చి తుద కా ధనమును గైకొనెనఁట ; దానితో సైన్యములను జేర్చి తాను నాయకత్వమును వహించి మహమ్మదీయ రాజ్యముపై దండయాత్రలు

గడియలకాలము గోలకొండ గద్దెపై నెక్కి రాజ్యము చేసెనని కలదు. చరిత్రమున నితఁడు గోలకొండ రాజ్యమును జయించి యేలుట కాదు గదా, తుదకు గోలకొండ ప్రస్తావమైన లేదు. అందీతఁ డోరుగల్లు ముట్టడించి జయించె నని కలదు. ఒకవేళ మనము పాటలో 'గోలకొండ'కు బదులుగ 'ఓరుగల్లు'ను చేర్చుకొనవలసియుండు నేమో. పాటలోని 'ఏడుగడియ'లను నది నిజముగా నేడుగడియలే యని విశ్వసింపనక్కఱలేదు. ఏడుగడియలకాలము మాత్రమే రాజ్యముచేసె ననుసంగతి యెప్పటికిని విశ్వసనీయమైనది కాదు. ఏడుగడియ లనుదానిని అత్యంతస్వల్పకాల మనుటకు గుర్తుగనే గైకొనవలసియుండును. పాటకు చరిత్రకు నింకొక్కవిషయమున మాత్రము వ్యత్యాసము కలదు. మహమ్మదీయసైన్యములు పాపని నోడించి యాతనిని చెఱపట్టె ననియు, తుద కాతనిని తురక ప్రభువులు ముక్కలు ముక్కలుగ చెండి, హైదరాబాదు కోట గుమ్మమునకు వ్రేలఁగట్టి రనియు చరిత్ర చెప్పుచుండ, నోటమి గలిగినపిదప నంత పౌరుషముగ బ్రదికిన తాను జీవముతో శత్రుహస్తములఁ బడరాదని పాపఁడు తనకు తానే బాకుతో పొడుచుకొని మరణించె నని పాట చెప్పుచున్నది. ఇం దేది నిజమో దైవమున కెఱుక: ఈరెంటిని పరస్పర విరుద్ధములు గాకుండ ఇట్లు సమన్వయము చేయవచ్చును.

వేధించియుండుటచేత, కసితీఱక యా చచ్చినవానినే తుండె తుండెములుగ నఱికి యాతనిని హైదరాబాదు కోటగుమ్మమునకు వ్రేలఁగట్టి యుండవచ్చును. ఇట్టి సందర్భములు దేశ చరిత్రమున లేకపోలేదు. మహమ్మదీయ చరిత్రమునకును, మన పాటకును గల వ్యత్యాసము లింతవఱకుఁ దెలుపఁబడినవి. ఇంక మహమ్మదీయ చరిత్రముల ననుసరించి తెలియనగు పాపని జీవితము సంగ్రహముగ పొందుపఱుపఁబడును.

పాపరాయఁడు కల్లుగీయు గవుండ్లకులమున జన్మించినవాఁడు. అతనికి చాల భాగ్యవంతురాలయిన వితంతుసోదరి యొకతె యుండెను. ఇతఁ డొకనాఁ డామెను చూచుటకు వెళ్లెను. నాలుగైదుదినము లామెయింట నున్నతరువాత నతనికన్ను లామె నిలువధనముమీఁద, నాస్తిమీఁద పడెను. కొంతమంది స్నేహితులను జేర్చుకొని యతఁ డామె నత్యంత క్రూరముగను, దారుణముగను హింసించి, యొడలు కాల్చి ధనము దాఁచియుంచినచోటు తెలిసికొని యాధనమును, నగలు నన్నియు సంగ్రహించి దానితో కొంతమంది కాలిబంటులను జేర్చి, దారులు కొట్టి ప్రయాణికులను దోఁచుకొని చుట్టుపట్ల దేశమును కొల్లపెట్టఁజొచ్చెను.

ఫౌఁజుదారులు, జమీన్‌దారులు ఆతని దుండగములను జూచి యాతనిని చెఱపట్ట నిశ్చయించిరి. ఏవిధమునతో వారి

యున్న మఱియొకనితో చేరి జమీందారుని యనుమతి గాని, యాజ్ఞ గాని లేకయే తనంత తానే చుట్టుపట్ల దేశమును దోఁచ మొదలిడెను. వేంకటరావిది తెలిసికొని వారిని పట్టి బంధించి కారాగారమున నుంచెను. కాని వేంకటరావు కుమారుఁ డొకప్పుడు వ్యాధిగ్రస్తుఁ డయ్యెను. చెఱనున్న ఖైదీలయుసురు తగిలి తన కొడుకున కారోగ్యము చెడె నని తలంచి వేంకట రావుభార్య తన కుమారుఁడు పునరారోగ్య వంతుఁ డగుచో ఖైదీలను విడిపించెద నని తలఁచుకొని, తుద కామెకోర్కె సఫలమగుటచేత వారి నందఱను విడిపించెను.

పాపరాయఁడు నల్గొండపరగణా భోనగిరి సర్కారు లోని 'షాహాపురము'నకు వెళ్లి యక్కడ 'సర్వా' యను మఱియొక దుండగీనితోఁ గలిసి, మరల కొంతమందిని జేర్చి షాహాపురమునొద్ద గుట్టమీఁద నొక మట్టికోట కట్టించెను. ఆదుర్గము చాల దిట్టమైనది. ఆప్రదేశ మాతనికిఁ జాల ననుకూలముగ నుండినది. అంతటనుండి యాతఁడు చుట్టుపట్ల దేశమును దోఁచుకొన మరల ప్రారంభించెను. షాహాపురమున కేడెనిమిది క్రోశముల దూరమున నున్న కుల్పాల్ పరగణా ఫౌఁజుదారు కొంత సైన్య మిచ్చి కాసింఖాన్ అఫ్‌గాన్ అను వాని నాతనిపైఁ బంపెను. ఈసైన్యమునకును, పాపనికి నప్పు డప్పుడు పోరాటములు సంభవించుచుండెడివి.

కాసింఖా నింకను అతనిని వెంబడించుచు పోఁగా నొకగుండు దెబ్బ తగిలి యాతఁడు ప్రాణములు విడిచెను. నాయకుఁడు నేల నొఱగినపిదప తురకదళము గచ్చువిచ్చయి చెదరిపోయెను. మహమ్మదీయు లింతటితో నిస్పృహులై యూరకుండలేదు. మఱియొక తడవ వారు దండెత్తి వచ్చి పాపని, 'సర్వా'ను షాహపురదుర్గమున రెండు నెలలవఱకు ముట్టడించిరి ; కాని పాపరాయఁడు తప్పించుకొని పాఱిపోయెను. అప్పుడు తురక లామట్టికోటను నాశముచేసిరి.

తురకదళములు వెళ్లిపోయినపిదప పాపరాయఁడును, 'సర్వా'యు తిరిగి వచ్చి షాహపురమునందే యీతడవ మట్టి కోటకు బదులుగ ఱాతితోను, సున్నముతోను ఒక క్రొత్త కోట కట్టించి, ఫిరంగులు మొదలైన యుద్ధసామగ్రి నందు నెక్కొలిపిరి. పాపరాయఁడు మరల దోఁపిడి యారంభించెను. ఈతడవ నతఁడు షాహపురమునకు పదునైదు, ఇరువది క్రోశములదూరమున నున్న దేశమునంతను దోఁచుకొనెను. ఈ దేశమునందలి ప్రజలు పాపరాయని పట్టి శిక్షించుటకుఁ దగు సాధనముల నరయవలసిన దని ఔరంగజేబు పాదుషాను ప్రార్థించిరి. పాదుషా రుస్తుం దిల్‌ఖాఁ అనునతనిని హైదరాబాదు సుబేదారుగా నియమించి, పాపరాయని పట్టుకొన వలసినదని యతని కాజ్ఞాపించెను. రుస్తుందిల్‌ఖాఁ (ఈతని

త్వము వహించి షాహపురదుర్గముపై నెత్తివెళ్లి దానిని రెండు మూఁడు నెలలు ముట్టడించెను కాని కోట స్వాధీనము కాలేదఁట ; రుస్తుం దిల్ ఖాను పాపనివలననుండి బహుమతులు వడసి వెడలిపోయెనఁట. దానిని లంచ మన్నను, కప్పమన్నను పాపఁడు మరల నెప్పుడు నట్టి దానిని సుబేదారున కిచ్చి యుండలేదు. రుస్తుం దిల్ ఖాన్ వెడలిపోయిన పిమ్మట కూడ పాపఁడు తన యాటలను సాగించుచునేయుండె నని కొన్ని చరిత్రలు చెప్పుచున్నవి. రుస్తుం దిల్ ఖాను సైన్యములతో వచ్చి షాహపురదుర్గమును ముట్టడించి 'సర్వ'ని ప్రాణోపద్రవకరముగ గాయపఱిచెను కాని తుద కాసేనాధిపతియే హతుఁ డయ్యె నని మఱికొన్ని చరిత్రములు తెలుపుచున్నవి.

అటుతరువాత పాపరాయఁడు యుద్ధసామగ్రిని, సైన్యములను అభివృద్ధిచేసికొని కోటలు సాధించుటకుఁ బూనుకొనెను. ఔరంగజేబు పాదుషా మరణానంతర (క్రీ.శ. ౧౭౦౭) మతని కుమారుఁడు 'కాంబక్ష్' విజాపుర, హైదరాబాదు రాజ్యములకు పాలకుఁ డయ్యెను. అతఁడుకూడ పాపరాయని నణఁచుట కంత గొప్ప ప్రయత్నములు చేయలేదు. కాని యెవరో యొకరి సైన్యాధిపత్యమున తురకదళము లెడపడప, పాపనిమీఁదికి వచ్చుచునే యుండెను. ఇట్టి 'తళ్ల'లో తురకలొకసారి 'షాహపుర'దుర్గమునుగూడ ముట్టడించిరి. కాని

ములు చేయకపోవుటవలనను పాపరాయునికి మఱింత ప్రో
త్సాహము కలిగి, యతఁడు షాహాపురమునకు ముప్పదిమైళ్ల
దూరమున నున్న యోరుగంటిపై నెత్తివెళ్లెను.

క్రీస్తుశకము ౧౭౦౮-వ మొహరము పండుగలలో
పదవనాఁడు పాలకులైన మహమ్మదీయులును, పాలితులైన
హిందువులునుగూడ వేడుకలయందును, వినోదములయం
దును తన్మయులై కాలముఁ బుచ్చుచుండఁగా, రెండుమూఁడు
వేల కాల్బలముతోను, నాలుగయిదువందల గుఱ్ఱపుదళము
తోను పాపరాయఁ డోరుగంటికోటయొద్ద ప్రత్యక్షమై తన
రాక పట్టణమునఁ దెలియకుండుటకొఱకు పట్టణమునకుఁ
బోవు దారు లన్నియు మూసివేయించెను. తెల్లవాఱక పూర్వ
మే గుఱ్ఱపుదళము పట్టణమును ముట్టడించు ప్రయత్నమున
నుండ, కాల్బలము కోటగోడల నెక్కి దానిని సాధింపఁ
జొచ్చెను. అనతికాలముననే కోట పాపరాయుని యధీన
మయ్యెను. లక్షలకొలఁది రూప్యముల యాస్తియు, నగదును,
సుప్రసిద్ధములైన యోరుగంటి తివాసులును దోఁపిడికాండ్ర
వశ మయ్యెను. స్త్రీలును, పురుషులును, పిల్లలును కలసి
౧౨,౦౦౦ ల మంది చెఱపట్టఁబడిరి. ఈఖైదీలలో నోరుగంటి
కాజి మహమ్మదు సయ్యదు భార్యయు, కూఁతురునుగూడ
నుండిరి. మహమ్మదు సయ్యదు భార్యను

తరువాత పాపరాయఁడు హైదరాబాదునకు పదునాఱు క్రోశములదూరమున నున్న భువనగిరి (భోనగిరి)పై దండెత్తి వెళ్లెను. అక్కడ పట్టణమును, పేటనుగూడ దోఁచుకొని యతఁ డటనుండి రెండు మూఁడువేలమంది స్త్రీ పురుషులను ఖైదీలుగాఁ గొనిపోయెను. పిదప నతఁడు షాహపురమునకు నాలుగు క్రోశముల దూరమున నున్న తరికొండ(తాడికొండ) దగ్గఱ మఱియొకకోట కట్టెను. ఆకోటలోఁ గూడ నాతఁడు గొప్పసైన్యము నుంచి, చాల యుద్ధసామగ్రిని జాగ్రత పఱిచెను.

నిరాతంకముగను, యథేచ్ఛముగను దోఁపిడులు సాగించు సీ పాపరాయని యుద్ధతికి తాళలేక మోరుగంటి ప్రాంతములవారు స్వయముగ సైన్యములతో వచ్చి యాతని దర్పముడుపవలసినదని ప్రార్థించుచు ఢిల్లీచక్రవర్తియైన బహదూర్‌షాకు మహజర్నామా పంపుకొనిరి. సామ్రాజ్యసైన్యమును దీసికొని స్వయముగ నాయకత్వము వహించి, యొక కల్లు గీసికొనువానిపై దండెత్తి వెళ్లుట తనవంటివాని కది గౌరవప్రదము కాదని, తన ప్రతిష్ఠ కది భంగకర మని తలంచి బహదూర్‌షా చక్రవర్తి యుక్తిపరుఁడును, చుఱుకైనవాఁడు నగు యూసఫ్‌ఖాన్ 'రుజ్ బిహాని' అనువానిని పాపరాయని నొంచుటకుఁ బంపెను. యూసఫ్‌ఖాన్ సైన్యములతోఁ దనసై

నష్టమును గలిగించి యాతనిని షాహాపురమునకుఁ దఱుమఁ
గొట్టెను.

ఒకప్పు డాతఁడు షాహాపురమున లేనిసమయమున కోటయందలి ఖైదీలు కొందఱు చెఱనుండి తప్పించుకొని కోట వశపఱుచుకొనిరఁట. గ్రామాంతరమునుండి వచ్చి పాపరాయఁడు మరల తనకోటను లోఁబఱుచుకొనుటకై దానిని ముట్టడింపవలసివచ్చెను; ఈసమయముననె కుల్పాల్ ప్రాంతములనుండి యూసఫ్ఖాన్ సైన్యములుకూడ నాతనిపై నెత్తివచ్చెను. పాపఁ డివతల నీదళములతో పోరాడవలసి వచ్చినకారణమున షాహాపురదుర్గమును వశపఱుచుకొనఁ జాలక పోయెను. షాహాపురము శత్రువులకు వశ మయ్యెను. షాహాపురదుర్గమున ఖైదీల 'పితూరీ' రేఁగి కోట వారి యధీన మగుటకును, సరిగా పాపఁడు తన కోటను తాను వశపఱుచుకొను సందర్భమున నుండఁగనే తురకలదం డాతనిపై నెత్తి వచ్చుటకును యూసఫ్ఖాఁ తంత్రమే కారణమై యుండును. పాపరాయఁ డెట్లో యాయుద్ధమున శత్రువులబారిఁ బడకుండ తప్పించుకొని తరికొండ(తాడికొండ)కు పాఱిపోయి యా దుర్గమున దాఁగుకొనెను. శత్రుసైన్యము లాతని నచ్చుటకుఁ గూడ వెంబడించి తఱిమి తరికొండ కోటను ముట్టడించినవి. ఇచ్చటఁ గూడ పాపరాయని ధైర్యసాహసములు పనిచేయ

వశపఱచుకొనఁ బ్రయత్నించుచునే యుండిరి. దండోపాయ మున నెన్నినాళ్లకు కోట వశము కానందున శత్రువులు భేదో పాయమును బ్రయోగించిరి. ఈ తంత్రమువలన పాపరాయ నికి నమ్మిన బంటులుగ నుండిన యాతని స్వజనమే యాతనిని విడిచిపెట్టి వెళ్లిపోయిరి. అటుపిదప శత్రువులు మరల మరల కోటపైఁ గవిసి దానిని క్రమముగా లోఁబఱచుకొనఁజొచ్చిరి. పాపఁ డెవ్వరికిని దెలియకుండ నొంటరిగ తాడికొండకు రెండు మకాములదూరమున నున్న హసనాబాదు గ్రామమునకు పాఱిపోయెను. తాడికొండ కోటలో నతఁ డున్నదియు లేని దియుఁగూడ రెండుదినములవఱ కెవ్వరికిఁ దెలియనే లేదు. హసనాబాదునందలి ప్రజలు కొందఱు స్వామిద్రోహముఁ గా వించి యాతని యునికిని, మనికిని తురకలకుఁ దెలియఁజెప్పిరి.

తరువాత శత్రువులు వచ్చి హసనాబాదునుగూడ ముట్టడించి, పోరాటమున పాపని గాయపఱచి ఖైదీగఁ గొని పోయి యూసఫ్ఖాన్ ముందుంచిరి. తాను కొల్లగొట్టినధన మెచ్చటెచ్చట దాఁచియుంచెనో సంపూర్తిగఁ దెలుపువఱకు వా రాతనిని బ్రదికియుండనిచ్చి పిదప వధించిరి. ఆతని శిరస్సును చక్రవర్తికి పంపిరి. చిత్రవధ చేసి యాతని మొండె మును హైదరాబాదు పట్టణద్వారమునొద్ద వ్రేలాడఁదీసిరి.

మయినది. కాలగర్భప్రవాహములలో మఱుఁగుపడిపోయిన యట్టి వారల జీవితము లింకను వీధిభిక్షుకుని ప్రాంతజోలె దులిపిన నెన్ని రాలునో! తిరిపె మెత్తికొను వీధిపాటకుని తంబురతీగ మీటిన నెన్ని మోఁగునో! సర్వాయి పాపనికథవంటి చరిత్ర పదములు దేశమున పూర్తిగ నింకను మఱుఁగిపోయి యంతరింపకమునుపే సేకరించి జాగ్రతపఱచి, చారిత్రకముగ వాని విలువను వివరించి ప్రకటించుట చరిత్రాభిమానుల ముఖ్యధర్మము.

# బౌద్ధవాఙ్మయము: పరిశోధన

బౌద్ధవాఙ్మయపరిశోధనోదంతము చాల విచిత్రమైనది. హిందువులవలెనే బౌద్ధులును తమ మతగ్రంథములను మతాంతరులకుఁ జూపక కడుజాగ్రతతో వానిని పేటికలలో పెట్టి తమ తమ పుస్తకభండారముల భద్రపఱిచి యుంతురు. హిందూదేశమున బౌద్ధమత మెన్నఁడో యంతరించిన దగుటచేత తన్మతగ్రంథము లేవియో, అవి యేభాషలో నున్నవో బౌద్ధులకు మాత్రమే తప్ప తదితరులకుఁ దెలియనే తెలియదు. నశించిపోక ఏమూలలనైన నొదిగి మెదిగి బౌద్ధమింకను ప్రాణముతో నున్నను, చాలవఱకది హిందూమతలక్షణముల నవలంబించి వాడుకకు తన్మతానుకరణమే యై, పేరునకు మాత్రమే బౌద్ధముగ నిలిచిపోయెను. అందువలన ఉన్న మత గ్రంథములైనను సమర్థులును, పండితులునైన మతాచార్యులకే కాని తదితరులకు తెలియరాకయుండెను. ఈకారణములవలన పౌరస్త్యులైన భారతీయులకే వీనిని గుఱించి తెలియలేదనిన ఇఁక పాశ్చాత్యులైన యూరోపియనులమాట యేల ?

క్రీస్తుశకము పందొమ్మిదవశతాబ్ది ప్రాచ్యవిజ్ఞాన పరిశోధన కారంభయుగము. ఈయుగారంభమున విజ్ఞాన

యనుసరించి కొందఱు ప్రాచ్యపండితులును ఈప్రాచ్యవిజ్ఞాన రత్నాకరమును మథింపఁజొచ్చిరి. ఈసందర్భముననే యీపౌరస్త్య, పాశ్చాత్యపండితులకు బౌద్ధవాఙ్మయానంతము తెలియవచ్చినది. అప్పటి కయినను బౌద్ధమతగ్రంథములు పాలీ భాషలో నున్నవని మాత్రమే వారికిఁ దెలియును. అవి సంస్కృత భాషనుగూడఁ గల వనుట క్రీ. శ. ౧౮౨౧ - ౧౮౨౮ ల నడిమికాలమున మాత్రమే తెలియవచ్చిన రహస్యము. ఈ రహస్యము వెల్లడియగుటకు కారణభూతుఁడైనవాఁడు బ్రియన్ హౌటన్ హాడ్జ్‌సన్ దొర.

ఈతఁడు క్రీ. శ. ౧౮౨౧ లో నేపాళదేశపు 'బ్రిటిషు రెసిడెంటు'గ నియమింపఁబడెను. ఈయుద్యోగమును స్వీకరించిననాఁటనుండియు ఈతఁ డాదేశపు ప్రజల మతవాఙ్మయములనుగుఱించి తెలిసికొనఁ గృషిచేసెను. తత్ఫలితముగ నతని కచ్చటి మతాచార్యులతో మైత్రి కలిగెను. వీరిలో బౌద్ధులు చాలమంది కలరు. వీరి విహారములకు, మఠములకుఁ బోయి, యచ్చటి పుస్తక భండారములయందలి బౌద్ధ గ్రంథములను పరిశోధించి, తన్మతాచార్యుల సాహాయ్యమున నలువది బౌద్ధమతగ్రంథసంపుటములను సంపాదించెను. వాని నన్నిటిని పరిశీలనార్థము కలకత్తా 'బెంగాలు ఏషియాటిక్ సొసయిటీ' వారికి పంపెను. కాని యచ్చటి పరిశోధకపండితు

మఱియొకజత పారిస్ (ఫ్రాన్సు), 'సొసయిటీ ఏషియాటిక్'
వారికిని పంపెను. ఇట్లు పంపుటయే కాక అతఁడు తానుగూడ
ఆగ్రంథములను బాగుగ పరిశోధించి, యచ్చటి బౌద్ధమతా
చారాదులనుగూర్చి తెలిసికొని పత్రికలకు వ్యాసములు వ్రా
యుచువచ్చెను. హాడ్జ్‌సన్ పరిశోధనలవలన ఈబౌద్ధమతవా
ఙ్మయము నేపాళదేశమున క్రీస్తుశకము రెండువందలసంవత్స
రములనుండి యున్నట్లు తెలియవచ్చెను. త్రివిష్టప మనఁబడు
తిబెత్తుదేశమున బౌద్ధమతము బాగుగ పాదుకొన్నపిదప
క్రీ. శ. ఏడెనిమిదిశతాబ్దులలో, ఈబౌద్ధవాఙ్మయ మంతయు
తిబెత్తుభాషలోని కనువదింపఁబడెను. చీనాదేశమునుండి
ముద్రణయంత్రము తిబెత్తునకు వచ్చినపిదప ఈగ్రంథము
లన్నియు ముద్రితములై ఒక్కొక్కగ్రంథమున కెన్నిప్రతులు
వలసిన నన్నిప్రతులు దొరకుచుండెడివి: కాని తిబెత్తు భాష
రానిది ఆగ్రంథముల ప్రయోజనమేమి, పరిశోధకపండితులకు?

సరిగా ఇదేసమయమున దైవికముగ ఆలోటుకూడఁ
దీరెను. హంగేరీ (ఆస్ట్రియా) దేశమునుండి అలెగ్జాండరు
సోమ డి కోరోసీ అనుతద్దేశీయుఁడొకఁడు పురాతత్త్వపరిశోధ
నయందాసక్తి కలవాఁడు — మధ్య ఆసియాఖండమున ఎచ
టనో హంగేరీదేశస్థుల యాదిమనివాసస్థల ముండవలె నని
యూహచేసి, దానిని కనిపెట్టవలయునను మహోత్సాహము

భాషను – స్వప్రయోజనము నిమిత్తమే – నేర్చుకొనవలసిన వాఁడయ్యెను. నూతనభాషాధ్యయనవశమునఁబుట్టిన నూతనోత్సాహ మాతనిని స్వకార్యాచరణోన్ముఖునిగఁ జేయుటకు మాఱుగ ఆతని దృష్టిని తద్దేశవాఙ్మయముపైఁ ద్రిప్పెను. టిబెత్తు బౌద్ధవాఙ్మయమును పరిశోధించి లోకమున కందలి సంగతులను దెలుపుభారము దైవవశమున నాతనిపైఁబడెను. ఆతఁడు టిబెత్తు బౌద్ధమతగ్రంథములను చాల పరిశీలించి పరిశోధించెను. టిబెత్తు దేశమునందలి బౌద్ధగ్రంథములు రెండు గొప్పగ్రంథభాండారములలో కలవు. వీనినే కంజూర్, తంజూర్ లందురు. కంజూర్ గ్రంథభండారమున నూఱు, నూటయెనిమిది సంపుటములు కలవు. ఒక్కొక్క గ్రంథమునకు పాఠభేదముల నొప్పు వేఱు వేఱు ప్రతులు కలవు. అసలు గ్రంథములు ౧,౦౮౩ వఱకు నున్నవి. ఇఁక తంజూరు గ్రంథభండారమున రెండువందల యిరువదియైదు సంపుటములు కలవు. హంగేరీ దేశస్థుఁడు క్రొత్తమతవాఙ్మయమును గనిపట్టితి నన్న యుత్సాహమున నేతద్గ్రంథజాలమును జాలవఱ కవలోడనము చేసినను, దీని నంతను మథించుట ఒక్కనికి తలకుమీాఱిన పని. అయినను ఆతఁడు చేయఁగలిగినంత చేసి తన పరిశోధనఫలితములను వ్యాసరూపమున పత్రికలఁ బ్రకటించెను; కాని గ్రంథముల

పోయెను. జ్ఞానతృష్ణ యలసటను గాని యపాయమును గాని యెఱుంగదుకదా!

నేపాళదేశమున హాడ్జ్‌సన్ ద్వారయును, తిబెత్తు దేశమున సోమ డి కొరోసీయును బౌద్ధవాఙ్మయపేటికలను గాలించి యందలి యమూల్యవిషయములను లోకమునకు వెల్లడించుచుండిన కాలముననే మంగోలియాయందలి బౌద్ధవాఙ్మయమును ష్మిట్ ద్వార (Schmidt)యు, సింహళమునందలి బౌద్ధవాఙ్మయమును జార్జి టర్నరు ద్వారయు తరుచుచు, తమ ప్రయత్నఫలితములను లోకమునకు వెల్లడించుచు వచ్చిరి. హాడ్జ్‌సన్ ద్వార పారిస్ పంపిన బౌద్ధమత గ్రంథములను యూజీన్ బర్నాఫ్ పరిశోధించి, తనపరిశోధనఫలితముల నాతఁడుకూడ ఇంచుమించుగ ఈ కాలముననే లోకమునకు వెల్లడిపఱచుచుండెను. ఈవిధమున నేల నాలుగుచెఱఁగుల నుండియు బౌద్ధమతవాఙ్మయవిజ్ఞానము వఱదలై ప్రవహింపసాగెను. నాఁటనుండియు, అనఁగా పందొమ్మిదవశతాబ్ది ప్రథమపాదాంతముననుండియే లోకమునకు బౌద్ధమతవాఙ్మయముయొక్క అసలుస్వరూపము వ్యక్తమయినది.

నాలుగు దిశలనుండియుఁ దెలియవచ్చిన బౌద్ధమత వాఙ్మయవిషయకవృత్తాంతము సమాలోకింపఁగా బౌద్ధమత గ్రంథములు సంస్కృతమున [illegible] నేపాళదేశమునందే [illegible]

అవి అసలు సంస్కృతగ్రంథముల కనువాదము లని స్పష్టమయినది. ఈగ్రంథములవలనఁ దెలియవచ్చిన బౌద్ధమునకు, నేపాళదేశ బౌద్ధమత గ్రంథములవలనఁ దెలియవచ్చిన బౌద్ధమునకు నంత వ్యత్యాసము కానరాదు. ఇట్లే మఱియొకవిషయముకూడఁ దెలిసినది. సింహళదేశమునందలి బౌద్ధమత గ్రంథములు పాలీభాషలో నున్నట్లే, బర్మా సయామ్ ఆనామ్ మొదలైన ఆసియాఖండదక్షిణదేశములలోని బౌద్ధమతగ్రంథములును పాలీభాషనే కలవు. ఈపాలీభాషాగ్రంథములవలనఁ దెలియవచ్చిన బౌద్ధమతము వ్యత్యాసము లంతగ లేక యొక్కటి యనియే స్పష్టమయినది. అంతియే కాక పాలీగ్రంథ బౌద్ధమతమునకు, సంస్కృతగ్రంథ బౌద్ధమతమునకు చాల వ్యత్యాసము కల దనికూడ సిద్ధాంతమయినది. ఈపోలికలను, వ్యత్యాసములను గమనించి పాశ్చాత్యులైన బౌద్ధవిద్వాంసులు నేపాలు, టిబెత్తు, చీనా, జపానులలో వ్యాపించిన బౌద్ధమతమునకు ఉత్తరబౌద్ధమత మనియు, సింహళము, సయాం, బర్మా, ఆనాం దేశములలోని బౌద్ధమతమునకు దక్షిణ బౌద్ధమత మనియు పేర్లుపెట్టిరి. కాని యీవిభాగము సరియైనది కా దని 'టకకుసు' మొదలైన ప్రాచ్యదేశ పండితులు చెప్పియున్నారు; ఏలయన సుమత్ర, జావాద్వీపములు హిందూదేశమునకు దక్షిణమునవే యున్నను అందు

కాని యీవిభాగమువలనఁ గొంత యుపయోగము లేకపోలేదు. దక్షిణబౌద్ధమే ఆదిమ బౌద్ధమతము. అశోకుని కాలమున బౌద్ధమతబోధకులు మతవ్యాపనము చేయుటకై సింహళద్వీపమునకు పోయియున్నారు. అట్లు వెళ్ళినవారిలో అశోకచక్రవర్తి కుమారుఁడైన 'మహిందు' డొకఁడు. ఇతఁడే పాలీభాషయందున్న 'త్రిపిటకము'లను (బౌద్ధుల వేదములు- ఇవి మూఁడు: (౧) వినయపిటకము (౨) సుత్తపిటకము (౩) అభిధమ్మపిటకము), వాని భాష్యము లనఁదగు 'అత్థకథ' లను సింహళమునకుఁ గొనిపోయినట్లును, అక్కడివారి కుపయోగపడునట్లు 'అత్థకథ'లను సింహళదేశభాషలోనికి పరివర్తించినట్లును చెప్పెదరు. 'మహిందు'ని సోదరియైన 'సంఘమిత్ర'యే సింహళమున మొట్టమొదటిమాఱు బౌద్ధమత మవలంబింపఁదలఁచిన స్త్రీలను 'భిక్ఖుణు'లంగావించినట్లు తెలియుచున్నది. 'మహిందు'నితోపాటు 'ఇఠియ', 'ఉత్తియ', 'సుమనులు'కూడ బౌద్ధమతమును వ్యాపింపఁజేయు నిమిత్తము వెడలిరి. ఈబౌద్ధభిక్షువుల త్యాగదీక్షయు, ధర్మనిరతియునే బౌద్ధమతము సింహళమున వ్యాపించుటకుఁ గారణమయ్యెను. అది యచ్చటినుండియే బర్మా, సయామ్, ఆనామ్ మొదలైన దేశములకుఁ బ్రాఁకెను. ఈకారణమువలన పాలీగ్రంథబౌద్ధమతము – (దక్షిణబౌద్ధమతము) – నొకవిధముగ ఆదిమ

లకు పెక్కు మతవిషయములనుగుఱించి చాల నభిప్రాయ భేదము లుండెను. అశోకుఁడు వేఱువేఱుబౌద్ధమతకక్షులవారి నేకీకరించుటకై చాల ప్రయత్నించెను. అశోకునికాలమున ప్రధానముగ నుండిన కక్షులు రెండే: స్థవిర, మహాసాంఘిక కక్షులు. స్థవిరులు మహాసాంఘికులతో నిర్వహింపలేక మగధను విడిచిపెట్టిరి. వీరిలో 'వినయ భాణకము'ల నవలంబించినవారు (హిందువుల యాచారకాండవంటి వినయపిటకమునకే ప్రాధాన్య మిచ్చినవారు) సింహళమునకుఁ బోయిరి. 'సూత్రభాణకము'ల నవలంబించినవారు (ధర్మమునకు ప్రాధాన్య మిచ్చినవారు) కాశ్మీర, గాంధార దేశముల కరిగిరి. మొదటి తెగవారికి సింహళమును, రెండవ తెగవారికి కాశ్మీర, గాంధారములును ప్రధానస్థానము లయినవి. కాశ్మీర, గాంధారస్థవిరులు చాల కాలమువఱకు బుద్ధభగవానుని ఆదిమసిద్ధాంతములకే యంటి పెట్టుకొనియుండిరి. కాని కాలక్రమమున దేశమునఁ గలిగిన 'మహాసాంఘిక' ప్రాబల్యమువలన వారి మత స్వరూపమున మార్పుకలిగెను. వీరు క్రమక్రమముగ నాసిద్ధాంతములయందలి తత్త్వమునుగుఱించియే చర్చసేయుచు, దానినే బోధింపఁ దొడఁగిరి. తత్త్వబోధకు ప్రాధాన్యము కలిగినపిదప ఈ తెగవారికే సర్వాస్తివాదు లని పేరు కలిగెను. వీరిబౌద్ధమే క్రమక్రమముగ తిబెతు, చీనా, జపాను మున్నగు నుత్తర దేశము

ఈపైసంగతులవలన చీనా, తిబెత్తు, జపాను దేశములలోని బౌద్ధులకు ప్రధానముగ సంస్కృతమును, సింహళము బర్మా సయాము అనామములలోని బౌద్ధులకు పాలీయును హిందువులకు సంస్కృత మెట్లో యట్టి పవిత్రభాష లని తేలుచున్నది. ఉత్తర దేశబౌద్ధులగ్రంథములు సామాన్యముగ సంస్కృతము భాషయం దున్నను వారిలో పెక్కు శాఖ లుండుటచేత ఒక్కొక్క శాఖవారు ఒక్కొక్క విధమైన భాషను దమ మత గ్రంథములయందు వాడుకచేసినట్లు తెలియవచ్చుచున్నది. ఉత్తర దేశబౌద్ధుల మతగ్రంథములు కొన్ని (సంస్కృత) గ్రాంథికభాషను, కొన్ని గాథాభాషను, వేఱొక కొన్ని ప్రాకృతమునను గలవు. క్రీ. శ. ఎనిమిదవ శతాబ్దియం దుండిన బౌద్ధ భిక్షువగు వినీతదేవుఁ డనుగొప్పవిద్వాంసుఁడు తమ మత గ్రంథములకు సర్వాస్తివాదులు సంస్కృతమును, సమ్మితీయులు అపభ్రంశమును, స్థవిరవాదులు పైశాచిని వాడుచుండినట్లు తెలిపియున్నాఁడు.

క్రీస్తుశకము పందొమ్మిదవ శతాబ్ది ప్రథమపాదాంతమున ప్రాచ్య, పాశ్చాత్యపండితుల పరిశోధనలవలన బౌద్ధ మత, వాఙ్మయోదంతము లీరీతిని లోకమునకు వెల్లడియైనవి. పైని తెలిపిన విషయము లన్నియు తద్విద్వాంసుల వ్రాఁతల వలనఁ దెలియవచ్చినవే. నాఁటనుండి విదేశీయులును, స్వదే

అయినను గతశతాబ్దియందుకంటె నేఁడు ఈబౌద్ధవాఙ్మయమును పరిశోధించువారు మన భారతీయులలోఁగూడ ననేకులు కలరు. ఆంధ్రులకు బౌద్ధవాఙ్మయాధ్యయన మత్యంతావశ్యకమైనది. ఒకప్పు డాంధ్రదేశము బౌద్ధమతమునకు భారతదేశమంతటిలో ప్రధానస్థానముగ నుండెను. బౌద్ధాంధ్రదేశ చారిత్రమునకు బౌద్ధవాఙ్మయ మత్యంతోపకారకము. అందువలన ఆంధ్రులు ఏతద్వాఙ్మయమునం దభిమానము వహించి తదధ్యయన, పరిశోధనములకుఁ బూనుకొనుట యావశ్యకము.